# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 94 | హైదరాబాద్ | శుక్రవారం 26-09-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

ఫార్ములా ఈ-రేసు కేసులో కేటీఆర్‌కు బిగుస్తున్న ఉచ్చు.. రాజ్‌భవన్‌కు చేరిన ఫైల్

## నేటి భారతం

- హైదరాబాద్ కలలతో కలిసి పరుగులు తీసే నగరం.. కానీ ఆ కలలను సైతం కొల్లగొడుతున్నారు అధికారులు..
- ఈ నగర వీధుల్లో ప్రతి అడుగు పోరాటమే.. కానీ ప్రతి మూలలో అవకాశాల వాసన వెదజల్లుతూనే ఉంది..
- హైదరాబాద్ లో సామాన్యుల జీవితం వేగంగా పరిగెడుతున్నప్పటికీ.. ఇక్కడి పరిస్థితులు మాత్రం చార్మినార్ గడియారంలా నిలిచిపోతున్నాయి..
- ఇక్కడ జీవించడం అంటే.. ట్రాఫిక్‌లో ఓర్పు, పనిలో పోరాటం తప్పనిసరి..
- అయినా సారీ ఈ నగరం ఎప్పుడూ ఆగదు.. ఎందుకంటే ప్రతి ఒక్కరి కలలు ఇక్కడే సాకారం అవుతాయి.
- పాలకుల, అధికారుల అవినీతి అడుగడుగునా పేరుకుపోయినా.. ఈ మహానగర జీవితం మనల్ని మార్చుతుంది..
- సహనం నేర్పుతుంది, శ్రమను విలువైనదిగా చేస్తుంది.
- ఇక్కడ మనం పడుతున్న ప్రతి కష్టం వెనుక ఒక విజయవంతమైన కథ సాక్షాత్కరిస్తుంది.. ఇది మాత్రం అక్షరాలా నిజం..

– బోయినపల్లి రమణా రావు, సీనియర్ జర్నలిస్ట్

## మిగ్-21 విమాన స్థానంలో తేజస్ జెట్‌లు..

### హెచ్ఏఎల్‌తో రక్షణ శాఖ ఒప్పందం

- రూ. 62,370 కోట్లతో 97 తేజస్ విమానాల కొనుగోలుకు సంబంధించి ఒప్పందం
- సమీకరిస్తున్న 97 విమానాల్లో 68 యుద్ధ విమానాలు, 29 ట్విన్ సీటర్లు
- 2027-28 నుంచి వీటి సేకరణ ప్రారంభమవుతుందని రక్షణ శాఖ వెల్లడి

11లో



## నేను భారత్‌కు పెద్ద అభిమానిని

### ఆ దేశమంటే చాలా ఇష్టం

- భారత్‌తో ఇంధన వాణిజ్యాన్ని మరింత పెంచుకోవడానికి ఎదురు చూస్తున్నామని వ్యాఖ్య
- అద్భుతమైన మిత్ర దేశం భారత్‌తో ఇంధన సహకారాన్ని విస్తరించుకోవాలన్న మంత్రి
- న్యూఢిల్లీపై పెనాల్టీలు విధించాలని అమెరికా కోరుకోవడం లేదన్న క్రిస్ రైట్

11లో






## జీ.హెచ్.ఎం.సి. నిర్లక్ష్యం..

# ప్రజలకు ప్రాణ సంకటం

- భారీ వర్షా లతో నదులను తలపిస్తున్న లోతట్టు ప్రాంతాలు..
- అక్రమ నిర్మాణాలకు వంతపాడటమే ఈ పరిస్థితికి కారణం..
- అధికారులు లంచాల మత్తులో.. అమాయక ప్రజలు వరదల్లో..
- నాలాలను మింగేస్తున్న అక్రమ అనకొండలు..
- ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దురదృష్టం..
- అవినీతి రాజ్యమేలుతున్న రాజకీయ కీచకులు..
- విశ్వనగరంగా పేరొందిన భాగ్యనగరానికి ఏమిటి ఈ దుస్థితి..?
- అసలు మనం నగరంలో ఉన్నామా..? నరకకూపంలో ఉన్నామా..?
- చిన్న వర్షా నికే అతలాకుతలం అవుతున్న దౌర్భాగ్యం..
- హైడ్రా పనిచేస్తున్నట్లు అనిపిస్తున్నా అనుకున్నంత ఫలితం లేదు..
- వ్యర్థాలను తొలగిస్తే సరిపోదు.. అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి..
- సామాన్య ప్రజల మీద ప్రతాపం కాదు.. పెద్ద తలకాయల పనిపట్టాలి..
- అక్రమ నిర్మాణాలపై సమర శంఖం పూరిస్తోంది " ఫోరం ఫార్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ



12లో

## తెలంగాణ ఇంటర్ విద్యలో మార్పులు

### సిలబస్ మార్పుతో పాటు ఏఐ కోర్సులు!

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి మారనున్న ఇంటర్ సిలబస్, పరీక్షల విధానం
- నవంబర్ నుంచి విద్యార్థులకు ప్రత్యేకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తరగతులు
- లెక్చరర్ల కొరత తీర్చేందుకు 494 మంది గెస్ట్ లెక్చరర్ల నియామకానికి ఆమోదం



11లో



11లో

## తమిళనాడు ప్రభుత్వ ఆహ్వానం..

### చెన్నైకి సీఎం రేవంత్ రెడ్డి

- మహా విద్యా చైతన్య ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు
- మధ్యాహ్నం 1 గంటకు ప్రత్యేక విమానంలో చెన్నైకి పయనం
- నిన్న పాట్నాలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో పాల్గొన్న సీఎం

హైదరాబాద్, సెప్టెంబరు 25 (భారత శక్తి) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేస్తున్నారు. వరుస పర్యటనలతో కాంగ్రెస్ పార్టీలో, ఇండియా కూటమిలో కీలక నేతగా ఎదుగుతున్నారు. తాజాగా ఆయన ఈరోజు చెన్నైలో పర్యటించనున్నారు. తమిళనాడు ప్రభుత్వం నిర్వహిస్తున్న "మహా విద్యా చైతన్య ఉత్సవ్" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

తరువాయి 11లో

## స్మితా సబర్వాల్ పై చర్యలు వద్దు.. హైకోర్టు

- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో తన పేరు చేర్చడంపై స్మిత అభ్యంతరం
- కమిషన్ నివేదికను కొట్టివేయాలంటూ న్యాయస్థానంలో పిటిషన్
- ఈ నివేదిక ఆధారంగా స్మితా సబర్వాల్ పై చర్యలు తీసుకోవద్దన్న కోర్టు



11లో

## అగ్ని-ప్రైమ్ ప్రయోగం సక్సెస్..

# అగ్నిప్రైమ్ ప్రయోగం సక్సెస్..

- విజయవంతంగా అగ్ని-ప్రైమ్ క్షిపణి ప్రయోగం
- దేశంలో తొలిసారిగా రైలు మొబైల్ లాంచర్ నుంచి పరీక్ష



## శ్రీవారి భక్తులకు గుడ్ న్యూస్

### అందుబాటులోకి కొత్త సౌకర్యాలు



- ఉపరాష్ట్రపతి, సీఎం చేతుల మీదుగా వేంకటాద్రి నిలయం ప్రారంభం
- భక్తుల కోసం అత్యాధునిక వసతి సముదాయం

# సంపాదకీయ

## మోడీకి మినహాయింపు ఇచ్చేసినట్టేనా

ఎన్నో ఆశలు, మరెన్నో ఆకాంక్షల మధ్య దేశ ప్రజలు 2014లో మోడీకి తొలిసారిగా ప్రధాని అవకాశం ఇచ్చారు. మోడీ వేవ్ ఏ రేంజ్ లో ఉందంటే.. ఆయన ధాటికి ఎన్నో రాజకీయ వటవృక్షాలు కూలిపోయాయి. బీజేపీకి ఏమాత్రం పట్టులేని ప్రాంతాల్లో కూడా మోడీ గాలి వీచింది. అంతకుముందు పన్నెండేళ్ల పాటు గుజరాత్ సీఎంగా ఆ రాష్ట్రంలో తిరుగులేని రాజకీయం చేసిన మోడీ.. అదే ఒరవడిని ఢిల్లీ వచ్చాకా కొనసాగించారు. రాజకీయ జీవితంలో ఓటమన్నదే ఎరుగని తిరుగులేని నేతగా పేరు తెచ్చుకున్నారు. మోడీ తెచ్చిన ఊపుతో దేశంలో పలు రాష్ట్రాల్లో బీజేపీ జెండా రెపరెపలాడింది. దశాబ్దాలుగా బీజేపీకి ప్రాతినిధ్యమే లేని రాష్ట్రాల్లో కూడా అధికార పీఠం దక్కడంతో.. బీజేపీలో నమో జపం కూడా ఎక్కువైపోయింది. మోహన్ భగవత్ 75 ఏళ్లకు రిటైర్మెంట్ పై చేసిన వ్యాఖ్యల గురించి పెద్ద చర్చ జరిగింది. ఇప్పుడు రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై అంతకంటే ఎక్కువ చర్చ జరుగుతోంది. ఎందుకంటే సమీప భవిష్యత్తుపై భరోసా లేని రాజకీయం నడుస్తున్న ఈరోజుల్లో ఏకంగా 2047 దాకా మోడీనే దేశానికి ప్రధానిగా ఉంటారన్న రాజ్‌నాథ్ వ్యాఖ్యలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ అంశంపై ప్రాక్టికల్ పాజిబులిటీ గురించి ఎలాగో అభిప్రాయాలు వస్తున్నాయి. అప్పటిదాకా ఉండేదెవరు, ఊడేదెవరూ అనే కామెంట్లు ముందే వచ్చాయి. ఇంకా అప్పటిదాకా బీజేపీనే గెలుస్తూ ఉంటుందా అనేది మరో అభిప్రాయం. ఈ మాత్రం రాజ్‌నాథ్ సింగ్ కు తెలియదనుకోలేదం. కానీ ఆయన వ్యాఖ్యల్లో ఆంతర్యాన్ని అర్థం చేసుకోవాలంటున్నారు విశ్లేషకులు. బీజేపీలో మోడీకి ఎలాంటి స్థానం ఉందో చెప్పడమే రాజ్‌నాథ్ ప్రధాన ఉద్దేశం. కనీసం మరో పదేళ్ల దాకా బీజేపీలో నాయకత్వం గురించిన చర్చకు ఆస్కారం లేదన్నట్టుగా రాజ్‌నాథ్ సంకేతాలిచ్చారు. ఇదే విషయాన్ని గతంలో ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ కూడా పరోక్షంగా చెప్పారు. మోడీని ఉద్దేశించి తాను రిటైర్మెంట్ వ్యాఖ్యలు చేయలేదని వివరణ కూడా ఇచ్చారు. అప్పుడు మోహన్ భగవత్, ఇప్పుడు రాజ్‌నాథ్ చేసిన వ్యాఖ్యల్ని పరిశీలిస్తే.. పార్టీ పరంగా, ఆరెస్సెస్ పరంగా మోడీకి రిటైర్మెంట్ నుంచి మినహాయింపు వచ్చేసిందని చెప్పుకోవచ్చు. 1980 నుంచి తనకు మోడీతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని రాజ్‌నాథ్ గుర్తుచేసుకున్నారు. ప్రజలతో సులభంగా కలిసిపోయే అరుదైన సామర్థ్యం మోడీ సొంతమని ప్రశంసించారు. ఎంతటి సంక్లిష్ట సమస్యలనైనా సులువుగా పరిష్కరించగలరని, క్లిష్టమైన సమయాల్లో సరైన నిర్ణయాలు తీసుకుంటారని కొనియాడారు. అంతర్జాతీయ సమస్యలపై కూడా ప్రపంచ దేశాల నాయకులు మోడీ సలహాలు తీసుకుంటారని తెలిపారు. ఇందరు ప్రపంచ నాయకుల నుంచి పుట్టినరోజు శుభాకాంక్షలు అందుకున్న మరో ప్రధానిని తాను చూడలేదని అన్నారు. ఇటీవల పహల్గాం ఉగ్రదాడి తర్వాత ప్రభుత్వం స్పందించిన తీరు, 'ఆపరేషన్ సిందూర్'కు సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం మోడీ వ్యవహార శైలికి నిదర్శనమని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. 2013లో మోడీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించే సమయంలో సీనియర్ నేత ఎల్.కె. అద్వానీని అగౌరవపరచలేదని, ఆనాడు దేశ ప్రజలే మోడీ నాయకత్వాన్ని కోరుకున్నారని ఆయన పేర్కొన్నారు. రాజ్‌నాథ్ వ్యాఖ్యలు అనుకోకుండా చేసినవి కాదనే వాదన కూడా లేకపోలేదు. ఎందుకంటే కొద్దిరోజుల ముందే.. 2047 గురించి, వికసిత్ భారత్ లక్ష్యం గురించి స్వయంగా మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. వికసిత్ భారత్ కల సాకారం కోసం 2047 వరకు నిరంతరం శ్రమించే బాధ్యతను దేవుడు తన మీద పెట్టాడని ప్రధాని మోడీ అన్నారు. ఇండియా టీవీ సలాం ఇండియా షోలో ఆయన మాట్లాడారు. దేవుడు తననో ప్రత్యేక కార్యం మీద పంపాడని తనకు అనిపిస్తోందన్నారు. దేవుడు తనకు దారిచూపించడమే కాకుండా శక్తినిచ్చాడని, 2047 కల్లా వికసిత్ భారత్ లక్ష్యం నెరవేర్చే వరకు దేవుడు తనను పైకి పిలవడని విశ్వాసం ఉందని చెప్పారు. ఈ భూమ్మీద ఇంకా తాను ఎక్కాల్సిన మెట్లేవీ లేవన్నారు. ప్రస్తుతం 74 ఏళ్ల వయసున్న మోడీ ఈ వ్యాఖ్యల ద్వారా మరో రెండు దశాబ్దాలు దేశ రాజకీయాల్లో క్రియాశీలంగా ఉంటానని పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. 400 సీట్ల నినాదం బీజేపీది కాదని, జనం నుంచి వచ్చిందని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు చూస్తే.. దీనికి కొనసాగింపుగానే ఇప్పుడు రాజ్‌నాథ్ మాట్లాడారనుకోవటానికి అవకాశం కనిపిస్తోంది. మోడీ నాయకత్వానికి కేవలం బీజేపీ, ఆరెస్సెస్ నుంచే కాదు దేశ ప్రజల నుంచి కూడా పెద్దగా అభ్యంతరాల్లేవంటే అతిశయోక్తి కాదు. అందుకు కావాల్సినట్టుగా గత పదకొండేళ్లుగా మోడీ రంగం సిద్ధం చేసుకున్నారు. అత్యంత సాధారణ జీవితం నుంచి.. దేశంలోనే అత్యంత ఉన్నతమైన ప్రధాని పదవి చేపట్టిన ఘనత నరేంద్ర మోడీ సొంతం. మోడీ.. ఎన్నో విషయాల్లో తన ప్రత్యేకత చూపించారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నేతలు నడుచుకోక తప్పదు. కానీ చాలా కొద్ది మంది నేతలు మాత్రమే తమ మాట ప్రజలే వినేలా చేయగలరు. స్వతంత్ర భారత చరిత్రలో అలాంటి నేతలు అతికొద్ది మందే ఉన్నారు. అలాంటి వారిలో మోడీ కూడా ఒకరని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అంతగా ఆయన దేశప్రజలతో కనెక్ట్ అయ్యారు. ప్రధానిగా పరిపాలనపై కూడా మోడీ తనదైన ముద్ర వేశారు. అవినీతికి తావిచ్చేది లేదని అధికార బాధ్యతలు చేపట్టిన తొలిరోజే కార్యదర్శులకు స్పష్టం చేశారు. అన్నట్టుగానే చాలావరకు కేంద్ర పథకాల్లో నిధులు వృథాను అరికట్టారనే పేరు తెచ్చుకున్నారు. అదే సమయంలో రాష్ట్రాలను లెక్కలడిగి ముఖ్యమంత్రుల్ని చిన్నబుచ్చారనే విమర్శలూ ఎదుర్కొన్నారు. పైకి టీమిండియా అని చెబుతూ.. పెద్దన్న పాత్రే పోషిస్తున్నారని బీజేపీయేతర సీఎంలు మోడీ గురించి ఎన్ని విమర్శలు చేసినా.. ప్రజలు మాత్రం నమ్మలేదు. మోడీ నిజాయతీపరుడు, ఆయన ఏం చేసినా పేదల మంచి కోసమే చేస్తారని గట్టిగా విశ్వసించారు. పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు స్థానిక బీజేపీ నేతల్ని కాకుండా.. మోడీని చూసే కాషాయ పార్టీని గెలిపించారు. మోడీ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకపోయినా, అసలు ఆ స్థాయి వ్యక్తులెవరూ లేరని ప్రత్యర్థులు గుర్తుచేసినా.. ప్రజలు మాత్రం పట్టించుకోలేదు. సీఎంగా ఎవరున్నా.. తానే ఢిల్లీ నుంచి అన్నీ మానిటర్ చేస్తానన్న మోడీ మాటపై నమ్మకం ఉంచారు. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన యూపీలో చాలా కాలం తర్వాత బీజేపీ ఘన విజయం సాధించింది. ఏకంగా 400 సీట్లతో అధికార పీఠం అధిష్ఠించింది. యూపీ సీఎంగా ఎవర్ని కూర్చోబెడతారా అని ఆసక్తిగా ఎదురుచూసిన విశ్లేషకుల్ని ఆశ్చర్యపరుస్తూ.. యోగి ఆదిత్యనాథ్ ను ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టారు మోడీ. అప్పటిదాకా యూపీలో చక్రం తిప్పిన ఎస్పీ, బీఎస్పీ పార్టీల్ని పూర్తిగా బలహీనపడేలా చేయడంలో మోడీ గాలి బాగా ఉపయోగపడింది. కేంద్రంలో అధికారం వచ్చినప్పట్నుంచీ హరియాణా, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్, ఉత్తరప్రదేశ్, గోవా లాంటి పలు రాష్ట్రాల్లో కాషాయ జెండా రెపరెపలాడింది. చివరకు కశ్మీర్లో కూడా పీడీపీతో పొత్తు పెట్టుకుని సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ద్వారా మోడీ చరిత్ర సృష్టించారనే చెప్పాలి.

# అసెంబ్లీ స్వపక్షంలో విపక్షం



విజయవాడ, సెప్టెంబర్ 15, (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలలో కూటమి లో మిత్ర పక్షాలుగా ఉన్న టీడీపీ, జనసేన ల మధ్య మాటల యుద్ధం సాగుతుంది. అయితే ప్రజా సమస్యలపైనే ప్రశ్నిస్తున్నామని వారు చెబుతున్నప్పటికీ ఎక్కడో తేడా కనపడుతుందే అన్న కామెంట్స్ సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. ఈ వర్షాకాల సమావేశాల్లో విచిత్రమైన పరిస్థితి అసెంబ్లీ సమావేశాల్లో చూడాల్సి వస్తుంది. కొన్ని అంశాలపై జనసేన మంత్రులను టీడీపీ ఎమ్మెల్యేలు ఇరుకున పెట్టేందుకు ప్రయత్నించాలని చూస్తుంటే, జనసేన ఎమ్మెల్యేలు కూడా తామేమీ తక్కువ తినలేదంటూ టీడీపీ మంత్రులు ఇబ్బంది పడే ప్రశ్నలను వేస్తున్నారు. ఫలితంగా ఈ ప్రభావం ప్రభుత్వంపై పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతుంది. అసెంబ్లీ సమావేశాల్లో జనసేన లబ టీడీపీ అన్నట్లుగా చర్చలు నడుస్తున్నాయి. తొలుత టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరావు ఇటీవల పొల్యూషన్ కంట్రోల్ బోర్డు విషయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇబ్బంది పడే విధంగా ప్రశ్నలు వేశారు. తాము కాలుష్య నియంత్రణ మండలి అధికారులను కలిసి సమస్యను చెప్పుకుంటే ఉప ముఖ్యమంత్రి ఆదేశాలుండాలని చెబుతున్నారని ఆయన అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి సక్రమంగా పనిచేయడం లేదని పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ శాఖపై బొండా ఉమామహేశ్వరరావు నిందలు వేసేందుకు ప్రయత్నించారు. ఇక మరో సీనియర్ సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు. రేషన్ బియ్యం విషయంలో ప్రభుత్వం గత ప్రభుత్వ వైఖరినే అనుసరిస్తుందని పరోక్ష వ్యాఖ్యలు చేసి ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారు. రహదారులు బాగాలేవని.. తాజాగా తాడేపల్లి గూడెం నియోజకవర్గానికి చెందిన జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ టీడీపీ మంత్రులు నిర్వహిస్తున్న శాఖపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ప్రధానంగా తన నియోజకవర్గంలో రహదారులు బాగా లేవని, కాంట్రాక్టరును అడిగితే గతంలో పెండింగ్ లో ఉన్న బిల్లులను చెల్లిస్తే తాము రోడ్ల మరమ్మతులు చేపడతామని అన్నారని, అభివృద్ధి పనులు చేసుకుంటున్నామని చెప్పుకుంటున్న మన ప్రభుత్వం రహదారులను బాగు చేయకపోతే ప్రజల్లో చెడ్డపేరు తెచ్చుకోవాల్సి వస్తుందని అన్నారు. అంటే జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రాష్ట్రంలో రహదారులు బాగా లేవని అసెంబ్లీ సాక్షిగా పరోక్షంగా అనడంతో ప్రభుత్వం కూడా ఇరుకునపడిన పరిస్థితి ఏర్పడింది. కానీ ఇవి యధాలాపంగానే జరిగాయా? లేక ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడానికి ఇటువంటి అంశాలు లేవనెత్తుతున్నారా? అన్నది తెలియాల్సి ఉంది.

మండలిలో మాత్రం వారే... నడుస్తోంది

ఏ రాష్ట్రమైనా శాసనసభ సమావేశాలు హాట్ హాట్ గా సాగుతాయి. కానీ ఆంధ్రప్రదేశ్ లో మాత్రం దానికి విరుద్ధంగా శాసనమండలి సమావేశాలు వాడి వేడిగా జరుగుతున్నాయి. అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమైన చర్చ జరిగే సమయంలో ఎక్కువగా అన్ని న్యూస్ ఛానెళ్లలో లైవ్ ఇస్తాయి. కానీ ఇప్పుడు ఏపీ అసెంబ్లీ లైవ్ కనిపించడం చాలా తక్కువగా కనిపిస్తుంది. ఎక్కువగా శాసనమండలి సమావేశాలు మాత్రమే ఫోకస్ అవుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం శాసనసభలో ప్రతిపక్షం లేకపోవడం. శాసనమండలిలో విపక్షం ఉండటమే. అందుకే శాసనమండలిలో చర్చలు రసవత్తరంగా సాగుతున్నాయి. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం జరుగుతుంది. అసెంబ్లీ సమావేశాలు మాత్రం సజావుగానే సాగుతున్నా మామూలుగానే సాగిపోతున్నాయి. అందుకే దానిపై ప్రజల్లోనూ పెద్దగా ఆసక్తి ఉండటం లేదు. గత ఎన్నికల్లో వైసీపీ కేవలం పదకొండు స్థానాల్లో మాత్రమే గెలిచింది. దీంతో తమకు ప్రతిపక్ష హోదా ఇస్తే తప్ప శాసనసభకు రామని వైసీపీ చెబుతుంది. పది శాతం సీట్లు వస్తేనే ప్రతిపక్ష హోదా దక్కుతుందని, పద్దెనిమిది సీట్లు రాకపోవడంతో ప్రతిపక్ష హోదా ఇవ్వలేమని అధికార పార్టీ అంటోంది. దీంతో వైసీపీ శాసనసభ్యులు, మాజీ ముఖ్యమంత్రి జగన్ తో సహా శాసనసభ సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో అసెంబ్లీలో ఉన్నది మూడు పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీ సభ్యులు కూటమి ప్రభుత్వంలోని వారే కావడంతో అర్థవంతమైన చర్చలు జరుగుతున్నాయి కానీ, ఆసక్తి లేదం టున్నారు శాసనమండలిలో మాత్రం వైసీపీ బలంగా ఉంది. అందుకే శాసనమండలి సభ్యులు సమావేశాలకు హాజరవుతున్నారు. అక్కడ వాయిదా తీర్మానాలు ఇవ్వడం నుంచి ప్రజా సమస్యలపై చర్చించేందుకు శాసనమండలి వేదికగా మారింది. శాసనమండలి వైసీపీ పక్ష నేతగా బొత్స సత్యనారాయణ ఉన్నారు. దీంతో పాటు సభ్యులం దరూ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ, ఫీజు రీ ఎంబర్స్ మెంట్, తల్లికి వందనం వంటి సమస్యలను ప్రస్తావిస్తున్నారు. దీంతో శాసనమండలిలో మంత్రులకు, వైసీపీ సభ్యులకు వాదన రసవత్తరంగా సాగుతోంది. శాససభకు కూడా వైసీపీ వచ్చి కనీసం వాయిదా తీర్మానాలు ఇచ్చి వాటిని తిరస్కరించిన తర్వాత వాకౌట్ చేసి వెళ్లిపోతే మంచిదన్న సూచనలు మేధావుల నుంచి వస్తున్నాయి.

# ఐదు నియోజకవర్గాలకే కోనసీమ



కాకినాడ, సెప్టెంబర్ 15, (భారత శక్తి): వైసీపీ ప్రభుత్వంలో జిల్లాల పునర్విభజన జరిగింది. ఈ పునర్విభజనతో ఏర్పడ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఇప్పుడు మరిన్ని మార్పులు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ముందు నుంచి మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో కొంత భాగాన్ని తూర్పుగోదావరి జిల్లాలోను, కాకినాడ జిల్లాలోనూ కలపాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. తాజాగా ఏకంగా మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాలను తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో కలిపాలన్న డిమాండ్ ఊపందుకుంది.. దీనికనుగుణంగా కూటమి ప్రభుత్వం సానుకూలంగా అడుగులు వేస్తోండగా మొత్తం మీద అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మార్పులు ఖాయమనే సంకేతాలు గట్టిగానే ఉన్నాయి. మండటపేట నియోజకవర్గంలో పలు ప్రాంతాలన్నీ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురానికి అత్యంత దూరం. అయితే ఇక్కడ ప్రాంత ప్రజలు తమకు అత్యంత సమీపంలో ఉన్న తూర్పుగోదావరి జిల్లా పరిధిలోకి కలపాలన్న డిమాండ్ మొదటి నుంచి వినిపిస్తున్నారు. ఈ తరహా డిమాండ్ ముఖ్యంగా మండపేట నియోజకవర్గంలోని కేశవరం తదితర ప్రాంతాల్లో ఎక్కువగా వినిస్తోంది. ఆలమూరు మండల పరిధిలోకి వచ్చే బడుగువాని లంక ప్రాంతంలో కూడా ఈతరహా డిమాండ్ వినిపించింది.. ఇది కొత్తపేట నియోజకవర్గ పరిధిలోనిది గనుక ఆ అవకాశం లేదనే చెప్పాలి. అయితే ఇటు రామచంద్రపురం నియోజకవర్గం పరిధిలోకి వచ్చే పలు ప్రాంతాలన్నీ కాకినాడకు అత్యంత సమీపం.. ఈ ప్రాంతాలనుంచి కాకినాడ వెళ్లాలంటే కేవలం 5 నుంచి 10 కిలోమీటర్లు దూరం మాత్రమే. అయితే వీరంతా కూడా కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం రావాలంటే గౌతమీ నదీపాయ దాటి రావాలి. లేదా పుదుచ్చేరి యానాం నుంచి అమలాపురం రావాల్సి ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని పక్కజిల్లాలకు అత్యంత సమీపంలోని ప్రజలంతా ఈ డిమాండ్‌ను జిల్లాల పునర్విభజన నాటి నుంచి వినిపిస్తున్నారు.. ఇటువంటి ఇబ్బందుల ఉన్నందున ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోకి వచ్చే తాళ్ల రేవు మండలాన్ని కాకినాడ జిల్లాలోకి చేర్చారు. మూడు జిల్లాల్లో కేవలం ఈ ప్రాంతం మాత్రమే నియోజకవర్గంతో సంబంధం లేకుండా పక్క జిల్లాలోకి మార్చారు అధికారులు. జిల్లాల పునర్విభజనలో కోనసీమ జిల్లాను అమలాపురం పార్లమెంటు పరిధినే జిల్లాగా నిర్ధారించిన పరిస్థితి ఉంది. అమలాపురం పార్లమెంట్ సెగ్మెంట్‌లో ఏడు నియోజకవర్గాలున్నాయి. అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు, రామచంద్రపురం, మండపేట.. ప్రస్తుతం రామచంద్రపురం కాకినాడ జిల్లాలో కలిపేందుకు ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తోన్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పూర్తి సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై ఇప్పటికే కాకినాడ జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తున్నవారికి తన సంఘీభావం కూడా తెలియజేశారంటున్నారు.. ఇదిలా ఉంటే మండపేట నియోజకవర్గాన్ని కూడా తూర్పుగోదావరి జిల్లాలోకి మార్చేందుకు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సానుకూలంగానే ఉన్నట్లు తెలుస్తోంది.. ఈయన కూడా అక్కడి ప్రజలకు త్వరలోనే ఈసమస్యకు పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది... కూటమి ప్రభుత్వం కొలువతీరాక జిల్లాల పునర్విభజనలోజరిగిన లోపాలన్నింటిని సవరించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.. ఇందులోభాగంగా ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఈ సంఘం ఇప్పటికే పలువురి నుంచి అభిప్రాయాలు, సలహాలు, సూచనల్ని సేకరించింది. త్వరలోనే గత లోటుపాట్లను సవరించడంతోపాటు మరికొన్ని జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. ఇదే జరిగితే కోనసీమ ప్రాంతం చిక్కిపోయే పరిస్థితి తప్పదు.. అంటే కోనసీమ జిల్లా ఇకపై అయిదు నియోజకవర్గాలకే పరిమితం కానుంది.. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలు పక్క జిల్లాల్లో కలిసిపోయే పరిస్థితి కారణం నియోజకవర్గాల పునర్విభజన జరిగితేనే కానీ కొన్ని ప్రాంతాలు పక్క జిల్లాల్లోకి కలిపే అవకాశం లేదు. అందుకే కోనసీమ జిల్లాను అయిదు నియోజకవర్గాలకే పరిమితం చేసి పార్లమెంటు పరిధిని మాత్రం కదిపే అవకాశం లేనందున దాన్ని అలానే కొనసాగిస్తారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

## దసరా తర్వాత ఫీల్డ్ లోకి...

విజయవాడ, సెప్టెంబర్ 15, (భారత శక్తి): సీపీ అధినేత వైఎస్ జగన్ దసరాకు ముందు కీలక నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తుంది. ఈ మేరకు పార్టీ వర్గాలు జగన్ తీసుకునే నిర్ణయంపై ఆసక్తిగానూ, ఉత్కంఠగానూ ఎదురు చూస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశం నిర్వహించింది. వైఎస్ జగన్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జప్రారంభం కావడంతో ఈ సమావేశంలో కీలక నిర్ణయాలను తీసుకునే అవకాశముంది. గత పదిహేను నెలల నుంచి కూటమి ప్రభుత్వం వైఫల్యం, సూపర్ సిక్స్ హామీల అమలులో లొసుగులు, ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ వంటి అంశాలపై చర్చించనున్నట్లు తెలిసింది. . దీంతో పాటు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై కూడా



వైసీపీ అధినేత వైఎస్ జగన్ నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. అయితే అన్నింటికంటే ముఖ్యమైనది జగన్ తో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీల రాజీనామాల విషయంలోనూ జగన్ ఈ సమావేశంలో చర్చించే అవకాశముందని అంటున్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు శాసనసభకు రావడం లేదని కానీ జీతాలను తీసుకుంటున్నారని, స్పీకర్ దగ్గర నుంచి అందరూ విమర్శిస్తున్న నేపథ్యంలో జగన్ కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయంటున్నారు.

అయితే రాజీనామాలకు మాత్రం వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు మాత్రం సిద్ధంగా లేరని కూడా ఒక వాదన నడుస్తుంది. ఎందుకంటే కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీని ఉప ఎన్నికల్లో ఎదుర్కొనడం కష్టమవుతుందని, అందుకు పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక ఉదాహరణ అని పలువురు నేతలు అంటున్నారు. మరొకవైపు జగన్ ఈ సమావేశంలో రాజీనామాల విషయంలో చర్చించే అవకాశముండదని సీనియర్ నేతలు చెబుతున్నారు. అది ప్రచారం మాత్రమేనని, అయితే ఆయన జనంలోకి వెళ్లేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసుకోవడానికే ఈ సమావేశాన్ని పెట్టారని అంటున్నారు. అందుకే అందరి అభిప్రాయాలను తెలుసుకోవడానికే ఈ సమావేశానికి వైసీపీ రీజినల్ కో-ఆర్డినేటర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పీఏసీ మెంబర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు, పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలను ఆహ్వానించార. సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని కోరినట్లు అంటున్నారు. రాష్ట్రంలో జగన్ పర్యటనపై ఈ సమావేశంలో క్లారిటీ వచ్చే అవకాశముందని చెబుతున్నారు.

# ఉప్పాడలో ఏం జరుగుతోంది

రాజమండ్రి సెప్టెంబర్ 25, (భారత శక్తి): గోదావరి జిల్లాలో మత్స్యకారులు ఆందోళనతో ఉన్నారు. ముఖ్యంగా కాకినాడ ఉప్పాడ తీరంలో రసాయన వ్యర్థాలతో మత్స్య సంపదకు నష్టం వాటిల్లుతోందని.. మత్స్య సంపద అంతరించి పోతుందనే భయంతో పెద్ద ఎత్తున ఆందోళన బాటపట్టారు. రహదారులను దిగ్బంధించారు. ఒక్కో మత్స్యకార కుటుంబానికి లక్ష యాభై వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు కలుగజేసుకొని వారి ఆందోళనను విరమింప చేశారు. అయితే గోదావరి జిల్లాలో ఇలా మత్స్యకారులు రహదారుల పైకి రావడం ఆందోళన కలిగించింది. ఉప్పాడ నుంచి అద్దరిపేట వరకు సముద్ర తీర ప్రాంతం విస్తరించి ఉంది. గతంలో అపారమైన మత్స్య సంపద చిక్కేది. కానీ ఇప్పుడు ఆశించిన స్థాయిలో చేపలు వలలు చిక్కడం లేదు. ఒకప్పుడు రాత్రి వేటకు వెళ్లి తెల్లారేసరికి వలలో కుప్పలు కుప్పలుగా చేపలు పడేవి. ఇప్పుడు చేపలు చిక్కకపోవడంతో మత్స్యకారులు ఉపాధికి దూరమయ్యారు. అయితే దీనంతటికీ కారణం



తీరంలో ఉన్న రసాయన పరిశ్రమలేనని తెలుస్తోంది. భారీ ఔషధ తయారీ పరిశ్రమలు, ల్యాబ్లు తీర ప్రాంతంలో ఉన్నాయి. అవి విడిచి పెట్టే వ్యర్థాలతోనే సముద్రంలో నీటి రంగు మారిపోతోందని.. అందుకే చేపలు వలలకు చిక్కడం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ఒకప్పుడు వలలో పడిన చేపలతో తమ కుటుంబాలు సుఖంగా జీవించేవని.. ఇప్పుడు ఉపాధి లేక అప్పులు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మత్స్యకారులు. అయితే తీర ప్రాంతం వెంబడి మత్స్యకారులు ఇప్పుడు రోడ్డు ఎక్కడంతో ఏదో ఉద్యమంలా మారే అవకాశం ఉంది. సమస్యను పరిష్కరించకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు. సముద్రం విషం గా మారిందని.. మమ్మల్ని రక్షించేది ఎవరు అంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈ సమస్యపై తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. ఈ సమస్యపై అధ్యయనానికి కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలు, ఫిషరీస్, రెవెన్యూ ఉన్నతాధికారులు, కాకినాడ జిల్లా కలెక్టర్ తో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారంతో పాటు జీవనోపాధి మెరుగుదల, వీరప్రాంత గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ఈ కమిటీ దృష్టి పెడుతుందని చెప్పారు. ఈ కమిటీ నివేదికల ఆధారంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు.

# అరికెపూడి గాంధీ ఆక్రమణలపై చర్చ

హైదరాబాద్, సెప్టెంబర్ 25, ( (భారత శక్తి): శేర్లింగంపల్లి నియోజకవర్గంలో గులాబీ పార్టీ గుర్తు మీద 2023 లో జరిగిన ఎన్నికల్లో అరికెపూడి గాంధీ ఎమ్మెల్యేగా గెలిచారు. అంతకుముందు ఎన్నికల కూడా ఆయన విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లోను ఆయన ఎమ్మెల్యేగా గెలుపును సందం చేసుకున్నారు. మొత్తంగా హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రికార్డ్ సృష్టించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో ఆయన తెలుగుదేశం పార్టీ గుర్తు మీద పోటీ చేసి గెలిచారు. అనంతరం మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2016లో ఆయన గులాబీ పార్టీలో చేరారు. అప్పట్లో ఆయన చేరికను కెసిఆర్ రాజకీయ పునరేకి కరణ గా పేర్కొన్నారు.ఇక 2023 లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన గాంధీ? ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు. కాంగ్రెస్ పార్టీ కూడా ఈయనకు ప్రజాప్రతిల కమిటీ చైర్మన్ పదవి ఇచ్చింది. అతడికి ఆ పదవిని ఇవ్వడాన్ని భారత రాష్ట్ర సమితి తప్పు పట్టింది. ఆ తర్వాత గులాబీ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, గాంధీ మధ్య మాటల యుద్ధం సాగింది. ఒకానొక దశలో ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు పరస్పరం దాడులకు పాల్పడతాం అన్నట్టుగా సంకేతాలు కూడా ఇచ్చారు. ఇరువురికి



చెందిన అనుచరులు రచ్చ రచ్చ చేశారు. అప్పట్లో ఈ రెండు వర్గాల మధ్య జరిగిన సంఘటనలు హైదరాబాద్ లో సంచలనం సృష్టించాయి.కాంగ్రెస్ పార్టీకి గాంధీ దగ్గర కావడం వెనుక చాలా కారణాలు ఉన్నాయని అప్పట్లో భారత రాష్ట్ర సమితి ఆరోపించింది. ఇప్పుడిక సరికొత్త విషయాన్ని బయటపెట్టింది. గులాబీ పార్టీ నేత లక్ష్మారెడ్డి కీలక ఆధారాలను సేకరించి ఏకంగా రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానంలో ఫిర్యాదు చేశారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గా జు ల రా మ ా ర ం లో సర్వేనెంబర్ 307 లోని 100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని గాంధీకి అక్రమంగా బదిలీ చేశారని లక్ష్మారెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వే నెంబర్ 307 లో సీలింగ్ కింద ప్రభుత్వ భూమి ఉంది. మిగిలిన ప్రైవేట్ భూమిలో ఇప్పటికే కొంతమంది పూర్తిగా ఇండ్లు నిర్మించుకున్నారు.అక్కడ ఎటువంటి ప్రవేట్ భూమి లేదని.. అయితే తమ పేరు మీద ఉన్న 11 ఎకరాలు ఎప్పుడో అమ్మేసి వెళ్లిపోయిన జాహేద్ బేగం, షేక్ ఇమామ్, ఇషాన్ ఆమీన్ అనే వ్యక్తులను తీసుకొచ్చి.. వారి భూమిని గాంధీ కొన్నట్టుగా చూస్తూ మోసానికి తెర లేపారని లక్ష్మారెడ్డి ఆరోపించారు. వాస్తవానికి ఆ ముగ్గురి వద్ద ఎటువంటి భూమి లేదని.. అక్రమంగా రిజిస్ట్రేషన్ లు చేయించి 11 ఎకరాల భూమిని స్వాహా చేయడానికి పథకం రూపొందించారని లక్ష్మారెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ 11 ఎకరాల భూమి ప్రభుత్వానికి సంబంధించిందని.. ఇందులో అక్రమంగా చేర్చిన వారి పేర్లను తొలగించాలని.. ఆర్డిఓ సర్టిఫై చేసిన నాలా ప్రొసీడింగ్స్ రద్దు చేయాలని.. ఆ స్థలంలో బహుళ అంతస్తుల నిర్మాణానికి చేపడుతున్న ప్రణాళికలను అడ్డుకోవాలని ఆయన కోరారు.. లక్ష్మారెడ్డి హైకోర్టులో వేసిన పిటిషన్ లో ఎమ్మెల్యే గాంధీ, ఆయన భార్య శ్యామల దేవి, కుమార్తె నందిత, ఏడుగురు ప్రవేట్ వ్యక్తులు, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్, ఆర్డీవో, కుత్బుల్లాపూర్ తహసీల్దార్ ను ప్రతివాదులుగా పేర్కొన్నారు.ఈ కేసును విచారించిన ధర్మాసనం భూ బదిలీపై కుత్బుల్లాపూర్ ఎమ్మార్వోకు ఫిర్యాదు చేయాలని.. ఒకవేళ ఆయన గనుక స్పందించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని పేర్కొంది. ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసే విషయమైతే.. తమ పిటిషన్ వెనక్కి తీసుకుంటామని.. లక్ష్మణ్ రెడ్డి తరఫున న్యాయవాది పేర్కొన్నారు. దానికి న్యాయవాది అనుమతులు జారీ చేస్తూ.. ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో లక్ష్మారెడ్డి కోర్టును ఆశ్రయించే పనిలో ఉన్నారు. ఒకవేళ అదే జరిగితే ఈ భూ వ్యవహారం రాష్ట్రంలో సంచలనంగా మారే అవకాశం ఉందని తెలుస్తోంది.

# సిరిసిల్లలో బూమ్ రాంగ్ అవుతోందా

కరీంనగర్, సెప్టెంబర్ 25, ( (భారత శక్తి): కొంతకాలంగా సిరిసిల్ల కలెక్టర్ మీద భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఆయన ఎప్పుడు సిరిసిల్ల వెళ్ళినా సరే.. తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. కేటీఆర్ అనుచర వర్గం కూడా ఆ కలెక్టర్ మీద అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సిరిసిల్లలో అడ్డగోలుగా అక్రమాలు జరిగాయని.. ఆ అక్రమాలను ప్రస్తుత సిరిసిల్ల కలెక్టర్ బయట పెడుతున్నారని.. రేవంత్ అందుకోసమే ఆయనను సిరిసిల్ల పంపించారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కేటీఆర్ ఏ స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ.. ఆయన అనుచరులు ఏ స్థాయిలో మండిపడినప్పటికీ అక్కడి కలెక్టర్ మాత్రం తన శైలిని మాత్రం మార్చుకోలేదు. వాస్తవానికి కేటీఆర్ అనుచరులు చేసిన అక్రమాలను బయటికి తీసే క్రమంలో ఆయన అదే దూకుడు కొనసాగించి ఉంటే బాగుండేది. కానీ ఓ నిర్వాసితురాలి విషయంలో ఆయన వ్యవహరించిన తీరు ఏకంగా హైకోర్టు దాకా వెళ్ళింది. ఆయనకు మాత్రమే కాదు.. ప్రభుత్వానికి కూడా మొట్టికాయలు పడేలా చేసింది.సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గా సందీప్ కుమార్ ఝా పనిచేస్తున్నారు. అయితే ఇటీవల ఆయన మిడ్ మానేరు నిర్వాసితురాలు వనభట్ల కవిత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆయనకు పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆయన పట్టించుకోలేదు. పైగా ఆర్డీవో, ఎమ్మార్వోకు చెప్పి కేసులు నమోదు చేయించారు. దీంతో కవిత మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. అయితే గతంలో ఇదే పిటిషన్ మీద హైకోర్టుకు సందీప్ కుమార్ హాజరయ్యారు. ఆ సమయంలో ఆయన వేసుకున్న డ్రెస్ పట్ల హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కోర్టుకు వచ్చే ప్రొసీడింగ్ తెలియదా.. కోర్టుకు వచ్చే విధానం ఇదేనా అంటూ కలెక్టర్ మీద హైకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది.కవిత మరొకసారి హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో.. ఈసారి హైకోర్టు న్యాయమూర్తులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గతంలో బాధితురాలికి పరిహారం ఇవ్వాలని ఇచ్చిన తీర్పును యధావిధిగా అమలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను సక్రమంగా అమలు చేయాలని ప్రభుత్వానికి.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి హైకోర్టు సూచించింది. అంతేకాదు కలెక్టర్ ను చూస్తే భయం వేస్తోందని.. ఆయన డ్రెస్సింగ్ సెన్స్ బాగోలేదని.. ఇలాంటి వ్యక్తి ప్రజలకు ఎలా సేవ చేస్తారని హైకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. వాస్తవానికి ఇటీవలి కాలంలో ఒక కలెక్టర్ మీద ఈ స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడం ఇదే తొలిసారి. కేటీఆర్, ఆయన అనుచరులు అక్రమాలు వెలుగులోకి తేవాలని సందీప్ కుమార్ ని పంపిస్తే.. రేవంత్ లక్ష్యం నెరవేరకపోగా.. పైగా హైకోర్టు నుంచి చివాట్లు ఎదురయ్యాయని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

============

# ఫిబ్రవరి 17 నుంచి సీబీఎస్ ఈ ఎగ్జామ్స్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25, (భారత శక్తి): సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్సీ) బోర్డు పరిధిలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి వచ్చే ఏడాది జరగనున్న 10వ, 12వ తరగతి బోర్డు పరీక్షల షెడ్యూల్‌ను సీబీఎస్ఈ విడుదల చేసింది. ఈ మేరకు పరీక్షల పూర్తి షెడ్యుల్‌ను సీబీఎస్సీ బోర్డు అధికారిక వెబ్‌సైట్ లో ఉంచింది. తాజా షెడ్యూల్ ప్రకారం సీబీఎస్సీ బోర్డు పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 17 నుంచి ప్రారంభంకానున్నాయి. మరోవైపు 2026 నుంచి పదో తరగతి పరీక్షలు ఏడాదికి రెండుసార్లు నిర్వహించనున్నట్లు ఇప్పటికే సీబీఎస్సీ ప్రకటించిన సంగతి తెలిసిందే. అందుకనుగుణంగా తాజా షెడ్యూల్‌ను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు రూపొందించింది.తాజా షెడ్యూల్ ప్రకారం పదో తరగతి పరీక్షలను తొలి విడతలో ఫిబ్రవరి 17 నుంచి మార్చి 6 వరకు, ఇక రెండో విడత పరీక్షలను మే 15 నుంచి జూన్ 1వరకు నిర్వహించనున్నట్లు సీబీఎస్ఈ కంట్రోలర్ (ఎగ్జామ్స్) సన్యం భరద్వాజ్ వెల్లడించారు. ఇక సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 17 నుంచి ఏప్రిల్ 9 వరకు జరగనున్నాయి. ఈ పరీక్షల పూర్తి టైం టేబుల్ అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు.ఇక పరీక్షలు పూర్తయిన అనంతరం ప్రతి సబ్జెక్టు పరీక్షకు దాదాపు పది రోజుల తర్వాత సమాధాన పత్రాల మూల్యాంకనం కూడా ప్రారంభమవుతుంది. ఇలా పూర్తి మూల్యాంకనం ప్రక్రియ 12 రోజుల్లో పూర్తవనుంది. అయితే ప్రస్తుతం బోర్డు విడుదల చేసిన పరీక్షల షెడ్యూల్ తాత్కాలికమైందని సీబీఎస్ఈ తెలిపింది. పాఠశాలల నుంచి తుది నివేదికలు సేకరించిన తర్వాత వాటి తుది షెడ్యూల్‌ను ప్రకటించనున్నట్లు బోర్డు స్పష్టం చేసింది. కాగా ఈ ఏడాది దేశ వ్యాప్తంగా దాదాపు 45 లక్షలకు పైగా విద్యార్థులు 10, 12వ తరగతి పరీక్షలకు హాజరవనున్నట్లు బోర్డు తెలిపింది.

# కవితకు స్థానిక సంస్థలకు లింక్

నిజామాబాద్, సెప్టెంబర్ 25 (భారత శక్తి): క ఎమ్మెల్యేగాని, ఎంపీగాని, ఎమ్మెల్సీగాని రాజీనామా చేస్తే వేరే కారణాలు ఏమీ లేకపోతే వెంటనే స్పీకర్?, చైర్మన్ ?ఆమోదిస్తారు. ఆరు నెలల్లోగా ఎన్నిక నిర్వహిస్తారు. కాని కేసీఆర్? కూతురు కవితది స్పెషల్? కేసు. ఆమె ఎమ్మెల్సీ పదవికి



రాజీనామా చేసి చాలా కాలమైనా దాన్ని ఇప్పటికీ శాసన మండలి చైర్మన్? గుత్తా సుఖేందర్?రెడ్డి ఆమోదించలేదు. నిన్న మీడియాకు కూడా తన రాజీనామా ఇంకా ఆమోదించలేదని చెప్పింది. తన రాజీనామా ఆమోదించాలని చైర్మన్?ను మళ్లీ కలుస్తానంది.

పార్టీలో ఏర్పడిన విభేదాల కారణంగా కవిత ఈ నెల 3వ తేదీన బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసింది. ఆ వెంటనే చైర్మన్ ఫార్మాట్ లో రాజీనామా లేఖను తన అనుచరులతో చైర్మన్ కార్యాలయానికి అందజేసింది. తరువాత కవిత స్వయంగా చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఫోన్ చేసి, తన రాజీనామాను ఆమోదించాలని కోరింది. దీనిపై స్పందించిన గుత్తా తాను ప్రస్తుతం అందుబాటులో లేనని తర్వాత నిర్ణయం తీసుకుంటానని చెప్పాడు. కాని ఇప్పటికీ రాజీనామా ఆమోదం పొందలేదుకవిత రాజీనామాను చైర్మన్ ?ఎందుకు ఆమోదించలేదన్న విషయం చర్చనీయాంశమైంది. ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన కూతురిని ఎలాగైనా చట్టసభకు పంపాలని తండ్రి కేసీఆర్? అనుకున్నాడు. మార్గం అన్వేషిస్తుంటే స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ పదవి ఖాళీగా కనిపించింది. అప్పట్లో అధికారంలో ఉన్న గులాబీ పార్టీ చేతిలోనే స్థానిక సంస్థలు ఉన్నాయి కదా. స్థానిక సంస్థల్లో ఆ పార్టీ హవాయే నడుస్తోంది కదా. అందువల్ల కవిత నిజామాబాద్? స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలవడం చాలా ఈజీగా జరిగిపోయింది.ప్రభుత్వం మారినా ఎమ్మెల్సీలకు ముప్పు ఉండదు కాబట్టి కాంగ్రెసు అధికారంలోకి వచ్చినా కవిత ఎమ్మెల్సీగా కొనసాగింది. బీఆర్ఎస్ తరఫున 2016లో ఎన్నికైన ఎమ్మెల్సీ భూపతిరెడ్డి పార్టీ ఫిరాయింపు కారణంగా అనర్హత వేటుకు గురయ్యాడు. ఆయన పదవీ కాలం 2022 వరకు ఉంది. అయితే.. ఎన్నికైన తర్వాత ఆయన అనుసరించిన తీరుతో పదవి ఊడిపోయింది. ఆయనకున్న పదవీ కాలానికి అనుగుణంగా ఉప ఎన్నికను నిర్వహించారు. ఆ ఎన్నికలో కవిత గెలిచింది.వాస్తవానికి ఈ ఎన్నిక ప్రక్రియ కరోనా కారణంగా ఆలస్యమైంది. కవిత పదవీ కాలం 2028 జనవరి 4వ తేదీ వరకు ఉంది. ఇక కవిత నిజామాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల ఎమ్మెల్సీ కావడంతో ఆమె రాజీనామా అంశం ఇంకా పెండింగ్ లోనే ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇందుకు కారణం? ప్రస్తుతం జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవులు లేవు కదా. ముందుగా ఆ పదవులకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఆ తరువాతే ఎమ్మెల్సీ ఎన్నిక. మండలి చైర్మన్ కవిత రాజీనామాను ఆమోదిస్తే ఆరు నెలల్లో ఆ స్థానానికి ఉప ఎన్నికలు నిర్వహించాలిఅయితే స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయనే టాక్ వినిపిస్తోంది. ఈ కారణంతోనే కవిత రాజీనామాను ఆమోదించలేదని తెలుస్తోంది. ఇక కవిత నేరుగా చైర్మన్ ను కలిస్తే రాజీనామాను ఆమోదించక తప్పదు అంటున్నారు. ఆమె త్వరలో చైర్మన్?గుత్తా సుఖేందర్?రెడ్డిని కలుస్తానని చెప్పింది. ఆమె కలిస్తే గుత్తా ఆమోదిస్తాడా? లేదా పరిస్థితి వివరించి పెండింగ్?లో పెడతాడా? చూడాలి.

# బై ఎలక్షన్స్ లేనట్టే

హైదరాబాద్, సెప్టెంబర్ 25, ( (భారత శక్తి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక క్లారిటీ ఇచ్చేశారు. భారాస ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరడం అనేది జరగనేలేదని.. కండువాలు కప్పినంత మాత్రాన పార్టీ మారినట్టు పరిగణించడానికి లేదని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చెబుతున్నారు. అయినా సరే.. స్పీకరు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉన్నదని రేవంత్ అంటున్నారు. ఒకసారి రేవంత్ రెడ్డి.. 'కండువాలు కప్పడం పార్టీ మారినట్టు కాదు' అనే మాటలద్వారా సంకేతాలు స్పష్టంగా ఇచ్చిన తర్వాత.. ఆయన పార్టీకే చెందిన స్పీకరు భిన్నమైన నిర్ణయం తీసుకుంటారని అనుకోవడం భ్రమ.భారత రాష్ట్ర సమితి నాయకులు చెబుతున్నది ఒక్కటే. 'వారు పార్టీ మారారు' అనే సంగతి అందరికీ తెలుసు.. కండువాలు కప్పడం కూడా పార్టీ మారడం కాదు- అంటే జనం నవ్వుతున్నారు- అని వాళ్లు వాదిస్తున్నారు. వాళ్లు పార్టీ మారడం నిజమే కావచ్చు, తాము పార్టీ మారలేదని రేవంత్ రెడ్డి కప్పినవి కాంగ్రెస్ కండువాలు కాదు జాతీయ జెండా రంగులున్న కండువాలు అని వారు స్పీకరుకు వివరణ ఇచ్చినందువలన ప్రజలు నవ్వడం కూడా నిజమే కావచ్చు.. అంతమాత్రాన సాంకేతికంగా వారి మీద అనర్హత వేయడం సాధ్యం కాదు. ప్రజలు నవ్వడం అనేదే గనుక ప్రామాణికం అయితే, ఇదే ప్రజలు కేసీఆర్ పరిపాలన మొదలైన నాటి నుంచి నవ్వడం అలవాటు చేసుకుని బతుకుతున్నారు.కల్వకుంట్ల చంద్రశేఖర రావు అప్పట్లో అటు తెలుగుదేశంలోనూ ఇటు కాంగ్రెస్ పార్టీలోనూ ఎమ్మెల్యే లందరినీ ఖాళీ చేయించడమే తన జీవిత ధ్యేయం అన్నట్లుగా విచ్చలవిడిగా ఫిరాయింపులను ప్రోత్సహించారు. ఒక పార్టీ తరఫున గెలిచి తర్వాత గులాబీ దళంలో చేరిన వారు మంత్రి పదవులు కూడా పుచ్చుకుని అగ్ర నాయకులయ్యారు. తెలంగాణ ప్రజలకు ఇలాంటి అనైతిక రాజకీయాలను చూసి నవ్వే అలవాటు ఉంటే గనుక, వారు అప్పట్లోనే పగలబడినవి ఉండాలి. అప్పట్లో ఎంత మాత్రం నవ్వుకున్నారో మనకి తెలియదు. ఇప్పుడు జగదీశ్ రెడ్డి తదితర బిఆర్ఎస్ నాయకులు ఆశపడినంత మాత్రాన మళ్ళీ నవ్వుతారని గ్యారెంటీ కూడా లేదుసాంకేతికంగా గమనిస్తే బిఆర్ఎస్ తరఫున గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి ఎంపీ ఎన్నికలలో కూడా పోటీ చేసిన దానం నాగేందర్ కు తప్ప మరెవ్వరికీ కూడా అనర్హత వేటుపడే భయం లేదు అని అనుకోవచ్చు. రాబోయే మూడేళ్ల పాటు కూడా ఎమ్మెల్యేలు ఫిరాయించారు అని నిందలు వేసుకుంటూ గడపడమే తప్ప భారత రాష్ట్ర సమితి చేయగలిగింది మరి ఏమీ లేదు అని కూడా విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

దానం తప్ప మిగిలిన వారు సేఫేనా

నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు చెప్పిన తర్వాత.. ఆ ఎమ్మెల్యేలకు స్పీకరు నోటీసులు ఇచ్చి విచారించి, వివరణలు తీసుకోవడం జరిగింది. తాము పార్టీ మారలేదని, సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రిని కలిసినప్పుడు.. ఆయన జాతీయజెండా రంగులను పోలిన కండువాను మాత్రమే కప్పారని



వారు వివరణ ఇచ్చారు. ఆ తర్వాత మళ్లీ భారాస వాళ్లు కూడా తమ వాదనలు, తమ వద్ద ఉన్న సాక్ష్యాలతో మళ్లీ కంప్లయింటు చేశారు. కానీ.. స్పీకరు తన విచక్షణాధికారాన్ని బట్టి నిర్ణయం తీసుకోవడానికి అవకాశం ఉంది. అయితే.. దానం నాగేందర్ కు మినహా మిగిలిన ఎమ్మెల్యేలకు పదవులకు పెద్ద ప్రమాదం ఉండకపోవచ్చునని పలువురు అంచనా వేస్తున్నారు.ఎమ్మెల్యేలు కాంగ్రెసు పార్టీ వారిగా మారిపోయి ఉండవచ్చు. కానీ.. క్రియాశీల సభ్యత్వం వంటి ఆధారం వచ్చిన తర్వాత తప్ప.. వారిని కార్నర్ చేయడం సాధ్యం కాదు. దానం నాగేందర్.. పార్టీ మారిన తర్వాత.. కాంగ్రెసు టిక్కెటుపై సికింద్రాబాద్ ఎంపీగా కూడా పోటీచేశారు గనుక.. ఆయన గురించి ప్రత్యేకంగా సాక్ష్యాలు ఆధారాలు ఇక అనవసరం. కానీ.. మిగిలిన వారు చెప్పిన బుకాయింపు వాదనలకు మన్నన దక్కితే వారికి ఇబ్బంది లేదు.రేవంత్ కప్పిన మూడురంగుల కండువా ఫోటోలను, రాహుల్ ను కలిసిన ఫోటోలను భారాస నేతలు సాక్ష్యాలుగా సమర్పిస్తున్నారు. కానీ వాటివల్ల వేటు వేయడం సాధ్యం కాదు. వేరే పార్టీ నాయకుడిని ఒక పార్టీ ఎమ్మెల్యే కలవడమే అనర్హతకు కారణం కావాలని వారు కూడా వాదించలేరు. ప్రజలకు ఏం చెబుతారు.. నియోజకవర్గ ప్రజలకు ఏం చెబుతారు? అని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి లాంటి వాళ్లు అడుగుతున్నారు. ఏం చెప్పాలో.. వారు నిర్ణయించుకోగలరు. ఆ పర్యవసానాలను వారు ఫేస్ చేసుకోగలరు. వారి గురించి గులాబీలకు ఆందోళన అనవసరంఇలా కాంగ్రెసు పార్టీలో ఉంటూ.. తాము పార్టీ మారలేదని స్పీకరుకు ఇచ్చిన వివరణలను చూసి ప్రజలు నవ్వుతారు కదా.. అని జగదీష్ రెడ్డి ఎద్దేవా చేస్తున్నారు. ప్రజలకు 'నవ్వేంత' చైతన్యం ఉంటే.. వారి ఫిరాయింపుల మీద భారాస పార్టీ కోర్టులో అనర్హత పిటిషన్లు వేసినప్పటినుంచి నవ్వుతూనే ఉండాలి.ఎందుకంటే.. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక.. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల నుంచి విచ్చలవిడిగా ఫిరాయింపులను ప్రోత్సహించి.. ఆ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులను కూడా కట్టబెట్టిన పార్టీ వారిది. అలాంటి వారు.. తమ పార్టీనుంచి కొందరు వెళ్లగానే ప్రజాస్వామ్యం గురించి ఆందోళన చెందడం చూసి ప్రజలు నవ్వుకోవాలి కదా.. అని ప్రజలు భావిస్తున్నారు.

# ఎల్ అండ్ టీ ఔటేనా...

హైదరాబాద్, సెప్టెంబర్ 25, (భారత శక్తి): హైదరాబాద్ మెట్రో రైలుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. తరచూ బెదిరింపులకు దిగుతున్న ఎల్ అండ్ టి సంస్థను మెట్రో రైలు కార్పొరేషన్ నుంచి తప్పించాలని భావిస్తున్నారు. ఇప్పటికే మెట్రో రైలు ఎండీగా ప్రారంభం నుంచి పనిచేస్తున్న ఎన్వీఎస్ రెడ్డిని తప్పించి ఆయన స్థానంలో మరొకరిని నియమించడంతో ఈ ప్రచారం మరింత ఊపందుకుంది. ఎల్ అండ్ టి సంస్థ చేతులో మెట్రో రైలు ఉంటే తాము అనుకున్నట్లుగా నగరంలో విస్తరణ జరగదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. అందుకే త్వరలోనే ఎల్ అండ్ టి సంస్థ కు హైదరాబాద్ మెట్రో రైలు బాధ్యతలను తప్పించాలని ఆయన నిర్ణయించినట్లు అధికార వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతుంది.2017లో ప్రారంభమైన... హైదరాబాద్ లో మెట్రో రైల్ 2017లో ప్రారంభమైంది. 29.14 కి.మీ. ఫేజ్-1 నెట్‌వర్క్‌ను ఎల్ అండ్ టీ సంస్థ నిర్వహిస్తోంది. అంటే దాదాపు ఎనిమిదేళ్ల నుంచి ఆ సంస్థ మెట్రో రైలు నిర్వహణ బాధ్యతలను చూస్తోంది. అయితే తరచూ తమకు నిర్వహణలో నష్టాలు సంభవిస్తున్నాయని తెలిపింది. ఛార్జీలు పెంచుకునేందుకు కూడా ఇటీవల తెలంగాణ ప్రభుత్వం అనుమతించింది. అలాగే పార్కింగ్ స్థలాల వద్ద కూడా రుసుము పెంచింది. అయినా సరే ఎల్ అండ్ టి సంస్థ తరచూ నష్టాలు వస్తున్నాయని చెబుతూ తమను బెదిరిస్తుందన్న భావనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. ఈ ప్రాజెక్ట్ పీపీపీ మోడల్‌లో నిర్మాణం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వానికి కొంత వాటా ఉంది. హైదరాబాద్ మెట్రో రైలులో రోజుకు ఐదు లక్షల మంది ప్రయాణిస్తున్నప్పటికి ఏడాదికి ఆరు వందల కోట్ల నష్టం వస్తోందని ఆ



సంస్థ చెబుతుంది. తెలంగాణ ప్రభుత్వం ఆ సంస్థ వాటా మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలన్న ఆలోచన చేస్తున్నట్లు కనిపిస్తుంది. లేదంటే మరొక ప్రముఖ సంస్థకు అప్పగించాన్న యోచనలోనూ ప్రభుత్వం ఉంది. ఎల్ అండ్ టీ ఎదుట ప్రభుత్వం రెండు ఆఫర్స్ పెట్టినట్లు సోషల్ మీడియాలో పెద్దయెత్తున ప్రచారం జరుగుతోంది. మొదటిది 15,000 కోట్లకు ఎల్ అండ్ టి నుంచి వాటాలను కొనుగోలు చేయడం ఒకటి. ఇందులో 13,000 కోట్ల లోన్ ట్రాన్స్‌ఫర్, .2,000 కోట్ల నగదు చెల్లింపు ఉంటుంది. రెండవది ఎల్ అండ్ టి ప్రైవేట్ గా తన వాటాలు అమ్మేసుకోవడానికి అవకాశం కల్పించడం. ఈ రెండింటిని ప్రభుత్వం సీరియస్ గా పరిశీలిస్తున్నట్లు సమాచారం. రెండో ప్రతిపాదనకే ఎక్కువ అవకాశాలున్నాయని అంటున్నారు. ఎల్ అండ్ టి సంస్థ ఉంటే విస్తరణ పనులు కూడా ఆలస్యమవుతాయని, తాము అనుకున్న లక్ష్యానికి చేరుకోలేమన్న భావనలో ముఖ్యమంత్రి ఉన్నట్లు అధికార వర్గాల్లో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. మరి చూడాలి ఏం జరుగుతుందో.

# 46వ వార్డులో కూల్చివేతలు

విశాఖపట్నం , సెప్టెంబర్ 25, (భారత శక్తి): విశాఖ ఉత్తర నియోజకవర్గం 46వ వార్డులో జీవీఎంసీ అధికారులు, పోలీసులు 'ఆపరేషన్ లంగ్స్' కార్యక్రమం కింద పెద్ద ఎత్తున చర్యలు చేపట్టారు. ఈ ఆపరేషన్లో భాగంగా వీధుల్లోని తోపుడు బండ్లు, చిన్న దుకాణాలు, ఫుట్పాత్లపై ఉన్న షాపులను తొలగిస్తున్నారు. ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం, పాదచారులకు మార్గం సుగమం చేయడం, పరిశుభ్రమైన వాతావరణాన్ని ప్రోత్సహించడం దీని ముఖ్య ఉద్దేశ్యాలుగా అధికారులు తెలిపారు.

=====================

# ఆప్కో చేనేత వస్త్రాలపై ప్రత్యేక ఆఫర్లు

ఏలూరు,, సెప్టెంబర్ 25, (భారత శక్తి): దసరా మరియు దీపావళి పండుగలను పురస్కరించుకొని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం సరి కొత్త వస్త్రాలపై 40% డిస్కౌంట్ మరియు ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై 45% బినీ 67% డిస్కౌంట్ ను ఇస్తున్నట్లు ఆప్కో రాజమండ్రి మండల వాణిజ్య అధికారి కె. పెద్ది రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లా లోని సి. ఆర్ రెడ్డి షో రూమ్, నేత బజార్ భవనం, సర్. సి.ఆర్ రెడ్డి కళాశాల ఎదురుగా గల ఆప్కో విక్రయ శాలలలో పై ఆఫర్ లు అందించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఆప్కో విక్రయ శాలలు సందర్శించి దసరా మరియు దీపావళి సంధర్బంగా తమకు కావలసిన రాజమండ్రి, బందరు ,వెంకటగిరి, మాధవరం, చీరాల, ఉప్పాడ చీరలు , షర్టింగ్ ,దోవతులు, దుప్పట్లు, లుంగీలు, టవల్స్ మొదలగు చేనేత వస్త్రాలు కొనుగోలుచేసి చేనేత వస్త్ర పరిశ్రమను ప్రోత్సహించి చేనేత కార్మికులను ఆదరించగలరని ఆయన తెలిపారు.

# జీఎస్టీ సంస్కరణలతో వ్యాపారాలు పెరిగాయి

### వర్తక వ్యాపారులతో కేంద్ర మంత్రి వ్యాఖ్యలు

కరీంనగర్, సెప్టెంబర్ 25(భారత శక్తి):
జీఎస్టీ సంస్కరణలతో మా వ్యాపారం, వినియోగదారుల సంఖ్య



గణనీయంగా పెరుగుతోందనీ,ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలుపై పెద్ద ఎత్తున ధర తగ్గిందనీ కరీంనగర్ వర్తక, వాణిజ్య వ్యాపారులు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు వివరించారు. ఈ సందర్భంగా వ్యాపారులు ప్రధాన మంత్రి, ఆర్థిక మంత్రి, కేంద్ర మంత్రి సంజయ్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. కరీంనగర్ టీవీ షోరూం యజమాని కేంద్ర మంత్రి చేతుల మీదుగా కొనుగోలు దారుడికి నూతన టీవీ అందించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టీ తగ్గింపు నిర్ణయం వల్ల ప్రతీ పేద, మధ్యతరగతి కుటుంబానికి నేరుగా లాభం చేకూరబోతోందన్నారు. దినసరి అవసరాల వస్తువులు, గృహ వినియోగ వస్తువులపై ధరలు తగ్గడం వల్ల జీవన వ్యయం గణనీయంగా తగ్గనుందన్నారు. మోదీ ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తోందన్నారు. .పండుగల సమయంలో పేద కుటుంబాలకు ఇది నిజమైన బహుమతి లాంటిదన్నారు. కాంగ్రెస్ పాలనలో పెరిగిన ధరలు, పెరిగిన పన్నుల భారం వల్ల ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలకు మోదీ జీఎస్టీ సంస్కరణలు ఊరట కలిగిస్తున్నాయన్నారు.. ఇది కేవలం ఆర్థిక ఉపశమనం మాత్రమే కాదు, పేదల అభ్యున్నతి పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు నిలువుటద్దం లాంటిదన్నారు. మోదీ నిజాయితీ పాలనలోనే జీఎస్టీ తగ్గింపు నిర్ణయం సాధ్యమైందన్నారు. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలు, రోడ్లు, రైల్వేలు, ఎయిర్‌పోర్టులు, డిజిటల్ సదుపాయాల్లో వేగంగా అభివృద్ధి జరిగేలా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకొని ముందుకు సాగుతుందని చెప్పారు. విద్యుత్ చార్జీలు, ఇంధన ధరలు, మద్యం ధరలు, రిజిస్ట్రేషన్ చార్జీలు, బస్సు చార్జీలు పెంపులతో సామాన్యుడి జీవితాన్ని కష్టతరం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి, కన్న కృష్ణ, ప్రవీణ్ రావు, రమేష్, అజయ్ వర్మ, వ్యాపారాలు తిరుపతి రెడ్డి, మునీందర్ లు పాల్గొన్నారు.

# 20 కోట్లతో ఎస్ యులో గిరిజన వసతి గృహాలకు శంకుస్థాపన

### బిఆర్ఎస్ ప్రభుత్వంలోఎస్ యు అభివృద్ధికి నోచుకోలేదు

### రాష్ట్ర మంత్రులు పొన్నం, అడ్లూరి

కరీంనగర్, సెప్టెంబర్ 25 (భారత్ శక్తి):
శాతవాహన యూనివర్శిటీలో 20కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా గిరిజన బాలబాలికల వసతి గృహాలకు రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ లు గురువారం శంకుస్థాపన చేశారు. సందర్భంగా మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ తాను మార్క్ ఫెడ్ ఛైర్మన్, అప్పటి మంత్రి జీవన్ రెడ్డి సహకారంతో 200 ఎకరాల్లో శాతవాహన యూనివర్శిటీనీ తీసుకువచ్చమనీ గుర్తుచేశారు. గత 10 ఏండ్ల బి ఆర్ ఎస్ పాలనలో యూనివర్శిటీ నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వంలో హుస్నాబాద్ కు ఇంజనీరింగ్ కాలేజీ, కరీంనగర్ కు న్యాయ, పార్మసి కళాశాలలు తీసుకువచ్చామని చెప్పారు. గత ప్రభుత్వంలో అన్ని జిల్లాల అనంతరం కరీంనగర్ కు ప్రభుత్వ మెడికల్, కోరుట్లకు వ్యవసాయ, పెద్దపల్లి కి ఇంజినీరింగ్ కాలేజీ వచ్చిందన్నారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఈ ప్రజా ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చామని చెప్పారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి రాజకీయాలు పక్కనబెట్టి చేద్దామని పిలుపునిచ్చారు. యూనివర్శిటీ అభివృద్ధికి మౌలిక వసతలు ప్రభుత్వం ద్వారా అందజేస్తామని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేయాలన్నారు. ఎంట్రెన్స్ పరీక్షల్లో మొదటి 100ర్యాంకులు మన యూనివర్శిటీ లోనే తీసుకునే విధంగా పోటీపడాలని కోరారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి అడ్లూరి కి హుస్నాబాద్ నియోజకవర్గంలో గిరిజనుల అభివృద్ధి కొరకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా 125 కోట్ల రూపాయలకు కేటాయించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ వకడే , మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ,వీసీ ఉమేష్ కుమార్, సుడా ఛైర్మన్ నరేందర్ రెడ్డి, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ , కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్ రావు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

స్వచ్ఛతా హీ సేవా 2025 ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ అనే నినాదంతో పరిశుభ్రత పనుల కార్యక్రమంలో భాగంగా లోయర్ మానరు డ్యామ్ సమీపంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శ్రమదానం నిర్వహించారు.
విద్యార్థులతో కలిసి మానేరు పరిసరాల్లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను స్వయంగా తొలగించారు.. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు ప్రజల సహకారం కావాలనీ అప్పుడే విజయవంతం అవుతాయనీ గుర్తుచేశారు. అధికారులు, పోలీస్, ఫారెస్ట్, పారిశుధ్య కార్మికులు, సిబ్బందితో కలిసి లోయర్ మానేరు డ్యామ్ వద్ద చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం ఒకరోజు పరిమితం కావద్దు, నిరంతరంగా కొనసాగాలని సూచించారు.కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతిఒక్కరు పర్యావరణాన్ని కాపాడుకోవాలనీ కోరారూ. పర్యావరణాన్ని కాపాడుకుంటూనే ప్రజలందరూ ఆరోగ్యం ఉంటారాని, భవిష్యత్తు తరాలకు ఆరోగ్య సమాజాన్ని అందిస్తామని తెలియజేశారు. అనంతరం సిక్కువాడిలోని గుర్ ద్వారాన్ని సందర్శించారు. ప్రతి కలని లో స్వచ్ఛత కమిటీ లు.. ఏర్పాటు చేసుకోవాలనీ చెప్పారు.

# తుది దశకు చేరుకున్న గొల్లపూడి ఎగ్జిబిషన్

### ఈనెల 27న బాలకృష్ణ చేతుల మీదుగా ప్రారంభోత్సవం.. ఏర్పాట్లు పర్యవేక్షించిన ఎంపీ కేశినేని శివనాథ్..



విజయవాడ : సెప్టెంబర్ 25, (భారత శక్తి):
గొల్లపూడి సమీపంలోని మైదానంలో ఈనెల 27వ తేదీన ప్రారంభమయ్యే ఎగ్జిబిషన్ ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎటువంటి లోపాలు లేకుండా అన్ని విభాగాలను సమన్వయంతో పూర్తి చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు.ఎగ్జిబిషన్ స్టాళ్లు, విద్యుత్, భద్రత, పార్కింగ్, ప్రజా సౌకర్యాలపై నిర్వాహకుల నుండి ప్రత్యక్షంగా వివరాలు తెలుసుకున్న ఎంపీ కేశినేని శివనాథ్, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా సన్నాహాలు చేయాలని సూచించారు. పార్కింగ్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీ ఎంపీ కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు.ఈనెల 27వ తేదీ శనివారం సాయంత్రం జరిగే ప్రారంభోత్సవానికి ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు ఎంపీ కేశినేని శివనాథ్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. బాలకృష్ణ రాక సందర్భంగా ఎటువంటి లోపం లేకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టంగా సూచించారు.అంతేకాకుండా శ్రేయస్ మీడియా అధినేత శ్రీనివాస్‌తో ప్రత్యేకంగా సమావేశమై ఏర్పాట్లపై సమీక్ష చేసిన ఎంపీ కేశినేని శివనాథ్, కుటుంబాలతో వచ్చే సందర్శకులకు వినోదాత్మకంగా, ఆకర్షణీయంగా ఉండేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విజయవాడ ప్రజలకు ఈ ఎగ్జిబిషన్ ఒక విశేష అనుభూతిని కలిగించేలా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా అమలు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ ఎగ్జిబిషన్ విజయవాడలో సాంస్కృతిక, వినోద వేదికగా నిలవనుంది. కుటుంబాలు, యువత, పిల్లలకు ప్రత్యేక ఆకర్షణలతో ఈ ప్రదర్శన విజయవాడ ప్రజలకు చిరస్మరణీయ అనుభవాన్ని అందించబోతోంది.. అని ఎంపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గొల్లపూడి అధ్యక్షుడు నూతలపాటి నారద, బిజెపి మైలవరం నియోజకవర్గం ఇన్చార్జ్ నూతలపాటి బాలకోటేశ్వరరావు, గొల్లపూడి మార్కెట్ యార్డ్ చైర్మన్ నర్రా వాసు, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ వడ్లమూడి చలపతిరావు, టిడిపి లీగల్ సెల్ నాయకులు యెర్నేని వేదవ్యాస్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

### – అపోలో ఫార్మసీలు నమ్మకానికి, సేవకు ప్రతీకలు
### – వరల్డ్ ఫార్మసిస్టుల దినోత్సవంలో విసి డా. వినోద్ భట్



చిత్తూరు, సెప్టెంబర్ 25: (భారత శక్తి):
ఆరోగ్య రంగంలో విశేష కృషికి అంకితం అయిన ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం ? 2025ను అపోలో విశ్వవిద్యాలయం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్ ముఖ్య అతిథిగా హాజరై ఫార్మసీ విద్యార్థులు, అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రాజ్వలనతో ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా డా. వినోద్ భట్ మాట్లాడుతూ... ఔషధ నిపుణులు ఆరోగ్య రంగంలో కీలక భాగస్వాములు. రోగుల ఆరోగ్య సంరక్షణ, మందుల సురక్షిత వినియోగం, నాణ్యత మరియు సరైన సూచనల విషయంలో వారి పాత్ర అపారమైనది. కోవిడ్ సమయంలో ఫార్మసిస్టుల సేవలు సమాజంలో విశేష గుర్తింపు పొందాయి. ఫార్మసిస్టులు కేవలం మందులు ఇవ్వడమే కాదు, ప్రజల్లో మందుల వినియోగంపై అవగాహన కల్పించడం, దుష్ప్రభావాలను నివారించడం కూడా వారి బాధ్యత అని పేర్కొన్నారు. అపోలో ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మసీ నెట్‌వర్క్‌ను నడుపుతోంది. దేశవ్యాప్తంగా 6,500 మందుల ఔట్‌లెట్లు ఉన్నాయి. ప్రపంచంలోని 12 అగ్రగణ్య ఫార్మసీలలో అపోలో ఒకటి. ఆన్‌లైన్ మెడిసిన్ సేవలలో కూడా అపోలో ముందున్నది. పేషంట్ల ఆరోగ్య పరిస్థితిని ఫోన్ ద్వారా తెలుసుకోవడం, అపోలో ఫార్మసీ సేవల అత్యంత విశ్వసనీయతకు నిదర్శనమని భట్ అన్నారు. ఈ సందర్భంలో అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (ఎఐపిఎస్) డీన్ ప్రొఫెసర్ కె. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. 'ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం మనకు ఫార్మసీ రంగంలోని బాధ్యతలను గుర్తు చేయిస్తుంది. ఫార్మసిస్టులు కేవలం మందులు ఇస్తే సరిపోదు, ప్రజలకు మందుల వినియోగం, భద్రత, ఆరోగ్య పరిరక్షణలో అవగాహన కల్పించడం ముఖ్యం. కోవిడ్ సమయంలో ఫార్మసిస్టుల సేవలు స్ఫూర్తిదాయకం' అని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించే వీడియో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సృజనాత్మక స్కిట్ ప్రదర్శన ద్వారా ఫార్మసీ రంగంలో ఆవగాహన, భద్రతా ప్రాధాన్యత గురించి స్పష్టమైన సందేశాన్ని అందించారు.కార్యక్రమంలో గౌరవ అతిథి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పోతరాజు, డీన్లు డాక్టర్ రామయ్య ఇటుమల్ల, డాక్టర్ జగదీషన్, ఎఐఎంఎస్ఆర్ ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ సచ్చితానంద ఆడిగ, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి, అలయిడ్ హెల్త్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ సుచరిత పి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజశేఖర్, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.–

# గొప్ప మానవతావాది దీన్ దయాళ్

### ఘన నివాళ్లర్పించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్, సెప్టెంబర్ 25 (భారత్ శక్తి):
కొందరు మరణించే వరకు జీవిస్తారు. కొందరు మరణించాక కూడా జీవిస్తూనే ఉంటారు. రెండో కోవకు చెందిన గొప్ప వ్యక్తి, మానవతావాది పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ. నవజ్యోల భారత మహానాయకుడు. మహోన్నతమైన ఈ శతాబ్దపు రుషి. గొప్ప రచయిత. పాత్రికేయుడు. రాజనీతిజ్ఞుడు. ఏకాత్మతా మానవతా సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన మహోన్నతుడు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. గురువారం నగరంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని కరీంనగర్ లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఖాదీ వస్త్రాలను కొనుగోలు చేశారు. అనంతరం దీన్ దయాళ్ సేవలను స్మరిస్తూ ప్రకటన విడుదల విడుదల చేశారు. ఈ దేశంలో భోజనం లేకుండా ఏ ఒక్కరూ అలమటించకూడదనే ఉద్దేశంతో అంత్యోదయ సిద్ధాంతాన్ని తీసుకొచ్చిన మహనీయుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ. అధికారమే పరమావధిగా కాకుండా సేవే లక్ష్యంగా రాజకీయాలను కొనసాగించాలని చెప్పిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. దేశ రక్షణ కోసం నిరంతరం సిద్ధంగా ఉండాలని భారత సైన్యంతోపాటు జన సంఘ్ కార్యకర్తలను కూడా పాకిస్తాన్ తో జరిగిన యుద్ధానికి పంపిన గొప్ప దేశభక్తుడు దీన దయాళ్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు సునీల్ రావు, రమేష్, సత్యనారాయణ, శ్రీనివాస్, సొల్లు అజయ్ వర్మ పాల్గొన్నారు.

# ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనం ప్రారంభించిన రాష్ట్ర మంత్రులు పొన్నం, అడ్లూరి

కరీంనగర్, సెప్టెంబర్ 25 (భారత శక్తి):
సేవలాల్ మహారాజ్, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల శిక్షణ తరగతులను రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమారులు ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి బలహీన వర్గాలకు సంబంధించిన అంశాలు కాంగ్రెస్ చర్చించాలనీ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి ఛాంపియన్.. కాంగ్రెస్ పార్టీ లో మాత్రమే సామాజిక న్యాయం జరుగుతుందనీ గుర్తుచేశారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రమే బలహీన వర్గాల అభివృద్ధి జరిగిందనీ తెలియజేశారు. ప్రజాస్వామ్యంలో మనం ఏం సాధించాం.. ఎంతవరకు అభివృద్ధి చెందాం అనేది నిర్ణయించుకోవాలనీ కోరారు. బెల్లయ్య ఉద్యమము, నిర్మాణం, భావజాల వ్యాప్తి , సంఘంలో సంస్కరణలు సమాజానికి న్యాయం జరపాలని పోరాడుతూ గిరిజన నాయకుడుగా ఎదిగారనీ చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్ రావు, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పడాల రాహుల్ లు పాల్గొన్నారు.



# ప్రజల సంక్షేమమే మా లక్ష్యం

### కేంద్ర మంత్రితో కలిసి మహాశక్తి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి పొన్నం



కరీంనగర్, సెప్టెంబర్ 25(భారత శక్తి):
కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి అంశంలో రాజకీయాలకు అతీతంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ తో కలిసి పనిచేస్తున్నట్లు రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కేంద్ర మంత్రి ఆహ్వానం మేరకు మంత్రి ప్రభాకర్ కరీంనగర్ లోని మహాశక్తి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ముందుగా వేదపండితులు రాష్ట్ర మంత్రి ప్రభాకర్ ను ఆశీర్వదించి, సన్మానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తో కలిసి ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గత 18 ఏళ్లుగా అమ్మవారి మాల వేసుకుని మహా శక్తి ఆలయంలో సర్వేజనా సుఖినోభవ దీక్ష చేపట్టి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాజకీయాలు పక్కనపెట్టి నియోజకవర్గ అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు వెలిచాల రాజేందర్ రావు, వైద్యుల అంజన్ కుమార్, బోనాల శ్రీనివాస్, సొల్లు అజయ్ వర్మ, సతీష్, వీర దేవేందర్ లు పాల్గొన్నారు.

# ఎరువుల సరఫరా బాధ్యత మహిళా సంఘాలకే

### పోషణ్ మహా, బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మంత్రులు సీతక్క, పొన్నం



కరీంనగర్, సెప్టెంబర్ 24 (భారత శక్తి):
గత ప్రభుత్వ పాలనలో శిథిలావస్థకు చేరిన మహిళ ప్రాంగణాలు ప్రస్తుతం మహిళలకు స్వయం ఉపాధి రంగాల్లో శిక్షణ ఇస్తూ కళకళలాడుతున్నాయని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీలోని దుర్గాబాయి దేశ్ముఖ్ మహిళా, శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం)లో బ్యూటీషియన్, టైలరింగ్, జ్యూట్ బ్యాగ్, ఆటో డ్రైవింగ్లో శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం, పోషణ మాస ఉత్సవం, బతుకమ్మ ఉత్సవాలకు మంత్రి సీతక్క రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు సీతక్క, ప్రభాకర్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని ముఖ్యమంత్రి సంకల్పించారని అన్నారు. ఇందులో భాగంగా మహిళల స్వయం ఉపాధి కోసం ఇప్పటికే 27 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణం అందజేశామని తెలిపారు. శిథిలావస్థకు చేరిన రాష్ట్రంలోని పది మహిళా ప్రాంగణాలను మళ్లీ శిక్షణకు సిద్ధం చేసి 10 కోట్ల రూపాయల కేటాయించామని అన్నారు. మహిళలకు పలు రకాల శిక్షణలు ఇస్తూ మహిళా ఇస్తూప్రాంగణాలు కళకళలాడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో మహిళా సంఘాల సభ్యులు విజయవంతంగా పలు వ్యాపారాలు నిర్వహిస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారని అన్నారు. నారాయణపేట మహిళా సంఘాల 11 మంది సభ్యులు పెట్రోల్ బంకు ఏర్పాటు చేసి ఆరు నెలల్లోనే 13 లక్షల ఆదాయాన్ని ఆర్జించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇవే కాకుండా సోలార్ ప్లాంట్లు, ఆటోలు, వాహనాలు, బస్సుల కొనుగోలు కోసం బడ్డీలేని రుణాలను అందజేస్తున్నామని, వీటిని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదుగుతున్నారని తెలిపారు. ప్రతి మహిళా సంఘంలో చేరి ప్రభుత్వం అందించే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలతో పాటు పదిలక్షల రూపాయల ప్రమాద బీమా, రెండు లక్షల లోన్ బీమా ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. మహిళా సంఘం అంటే భరోసా అని, తోటి సభ్యులు కష్టసుఖాల్లో తోడుంటారని తెలిపారు. రాష్ట్రంలో మహిళా సంఘాలు పది మందికి ఉపాధినిచ్చే స్థాయికి ఎదిగాయని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కలెక్టర్, పోలీస్ కమిషనర్ను

# ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భక్తి కలిగి ఉండాలి - ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి,(భారత శక్తి )సెప్టెంబర్ 25: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భక్తి కలిగి ఉండాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్ కల్వకుంట రోడ్డులో శ్రీ పంచముఖి హనుమాన్ సాహితి రాజరాజేశ్వర దేవాలయంలో శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా కసిని చంద్రకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్య క్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు



నిర్వహించారు. నిర్వాహకులు ఎమ్మెల్యే ను శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ సి డి సి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి , మధుసూదన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, విటల్ నరసన్న ,పరశురాం తదితరులు ఉన్నారు.

# అంతర్ ప్రాంగణ క్రీడా పోటీలలో సత్తా చాటిన గీతం




సంగారెడ్డి, ( భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 25 :
గీతం వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం.వి.వి.ఎస్. మూర్తి స్మారక అంతర్ ప్రాంగణ క్రీడా పోటీలు (ఇంటర్ క్యాంపస్ టోర్నమెంట్), ప్రతిభావంతుల ఎంపికలో గీతం హైదరాబాదు ప్రాంగణ విద్యార్థులు ప్రతిభను చాటిచెప్పారు. గీతం విశాఖపట్నం, హైదరాబాదు, బెంగళూరు మూడు ప్రాంగణాల ప్రతిభావంతులైన విద్యార్థి అథ్లెట్లను ఈ పోటీలు ఒకచోటకు చేర్చాయి.గీతం హైదరాబాదు జట్లు అథ్లెటిక్స్, టీమ్ గేమ్ లతో పాటు రాకెట్ క్రీడలలో కూడా పతకాలు సాధించడం ద్వారా అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. అథ్లెటిక్స్ లో వంద, రెండు వందలు, 1500 మీటర్ల పరుగు పోటీలు, షాట్ పుట్, పురుషులు-మహిళల 4%ఇ%100 మీటర్ల రిలేలలో పతకాలు సాధించారు. జట్టుగా పోటీపడే క్రీడలలో, హైదరాబాదు పురుషుల జట్లు క్రికెట్, ఫుట్ బాల్, బాస్కెట్ బాల్, మహిళల జట్టు వాలీబాల్ లో రజత పతకాలు సాధించాయి. కబడ్డీలో పురుషులు స్వర్ణం, మహిళలు రజతం సాధించారు. ఇక మహిళల పికిల్ బాల్, బ్యాడ్మింటన్ పోటీలలో స్వర్ణం గెలుచుకోగా, పురుషుల పికిల్ బాల్, టేబుల్ టెన్నిస్, చెస్ లలో బలమైన పోడియం ఫినిషింగ్ లతో రజతం సాధించారు. అంతేగా, గీతం హైదరాబాదు ప్రాంగణం నుంచి 33 మంది విద్యార్థులు దక్షిణ భారత ప్రాంతీయ (సౌత్ జోన్) పోటీలలో గీతం వర్సిటీకి ప్రాతినిధ్యం వహించడానికి ఎంపికయ్యారు.

# డీఎస్పీగా ఎంపికైన ప్రవీణ్

ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 25 (భారతశక్తి) : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలో ములుగు జిల్లాఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన దైనంపల్లి ప్రవీణ్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 105వ ర్యాంక్ సాధించిన ఆయనకు మల్టిజోన్-1లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్



పోలీస్ (డి.ఎస్.పి) పదవి కేటాయించింది. ప్రవీణ్ ప్రస్తుతం యూపీఎస్సీ మెయిన్స్ కూడా రాసి ఆ ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు.

# భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉద్యోగ విరమణ అభినందన సభ.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 25 (భారత శక్తి):
నిర్మల్ జిల్లాలోని భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓకేషనల్ కోర్సు లెక్చరర్గా సేవలందిస్తున్న చివాటే బాలానంద్ , తను 34 సంవత్సరాల ఉపాధ్యాయ జీవితం అనంతరం సెప్టెంబర్ 30 (మంగళవారం) నాడు గౌరవవంతంగా పదవీవిరమణ చేయనున్నారు .విద్యారంగంలో విశిష్ట సేవలందించి, అనేక మంది విద్యార్థులకు ప్రేరణగా నిలిచిన బాలానంద్, తన విద్యా బోధనలో నిబద్ధత, నైతికత మరియు పాఠశాల అభివృద్ధికి చేసిన కృషి మరపురానిదిగా నిలిచింది.ఈ సందర్భంగా కళాశాలలో పదవీవిరమణ అభినందన సభ ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా కళాశాల సిబ్బంది శాలువా పూలమాలలతో సన్మానించారు. కళాశాల ప్రిన్సిపల్ శివరంజని మాట్లాడుతూ శ్రద్ధగల ఉపాధ్యాయునిగా, సహోద్యోగులతో సత్సంబంధాలు, విద్యార్థుల పట్ల మానవీయ దృష్టికోణంతో ముందున్న బాలానంద్ గారు, సేవనివృత్తి సందర్భంగా విద్యా సంఘాలు, సహచరులు, విద్యార్థులు, మాజీ విద్యార్థుల నుంచి అభినందనలు అందుకుంటున్నారు.ఈ శుభసందర్భంగా ఆయనకు మా హృదయపూర్వక శుభాకాంక్షలు.కళాశాల సిబ్బంది ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శివరంజని. భూషణ్ పాండే. సందీప్ కుల్కర్ని. హరి ప్రసాద్. గంగయ్య. రంజిత్ కుమార్. చందు. తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కార్యాలయంలో పండిట్ దీన్ దయా ళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు

కామారెడ్డి జిల్లా, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 25: ఏకాత్మ మానవతా వాద సిద్ధాంతకర్త, అంత్యోదయ స్పూర్తిప్రధాత పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బీజేపీ జిల్లా కార్యాలయంలో మొక్కలు నాటి, ఆ మహనీయుని చిత్ర పటానికి నివాళులు



అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు ఏవి అయినా చిట్ట చివరి వ్యక్తికి చేరాలనే ఉద్దేశంతో అంత్యోదయ, ఏకాత్మ మానవవాద సిద్ధాంతాన్ని పండిట్ దీన్ దయాళ్ జి రూపొందించారని, ప్రముఖ సంఘ సంస్కర్తగా, అర్థశాస్త్రవేత్తగా, ఆయన విశేష సేవలు అందించారని అన్నారు. భారతీయ జన సంఘ్ ద్వారా భారతీయ జనతా పార్టీకి పటిష్ట పునాదులు వేసిన సమర్థులు అని కొనియాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన ఆ మహానుభావుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయుల జయంతి సందర్భంగా వారికి మా ఘన నివాళులు అని అన్నారుఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు నరేందర్ రెడ్డి, రవీందర్ రావు, నాయకులు సంతోష్ రెడ్డి, విఠల్, వెంకట్ రెడ్డి, రాజగోపాల్, రఘు, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో అట్టహాసంగా అటుకుల బతుకమ్మ వేడుకలు

సంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 25 : బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదు తెలంగాణ అస్తిత్వానికి సంస్కృతికి ప్రతీక గా నిలిచిందని, మహిళల సామాజిక కలయికను ప్రోత్సహిస్తుందని జిల్లా కలెక్టర్ పి .ప్రావీణ్య అన్నారు. గురువారం కలెక్టరేట్ లోనిర్వహించిన అటుకుల బతుకమ్మ ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, పూలతో అలంకరించి గౌరమ్మ కు పూజలు చేసి అటుకుల బతుకమ్మ సంబురాలను ప్రారంభించారు .రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోన్న బతుకమ్మ వేడుకలు ,పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు . ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడారు . బతుకమ్మ పండుగ లో ప్రధానంగా పూలతో గౌరమ్మను పూజించడం ప్రత్యేకత అని,ఇతర పండుగల మాదిరి నైవేద్యాల కంటే పూలనే దేవతారాధనకు సమర్పించడం బతుకమ్మ పండుగకు ప్రత్యేక గుర్తింపు కల్పిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. పూలను పూజించే మన సంస్కృతి గొప్పదన్నారు. స్త్రీల ఐక్యత, కుటుంబ సఖ్యతకు



ప్రతీకగా నిలిచే అటుకుల బతుకమ్మ లో కలెక్టర్, చిన్నారులు, మహిళలతో కలిసి పాటలు పాడి, ఆటలాడి అందరినీ ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జెడ్పిసిఒ స్వప్న, డిపిఓ సాయి బాబా, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి , పంచాయతీ రాజ్ శాఖ మహిళా ఉద్యోగులు, చిన్నారులు, ఇతరశాఖల మహిళా ఉద్యోగులు తదితర పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 25:
సంగారెడ్డి పట్టణంలో స్థానిక క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ చేతుల మీదుగా అందజేశారు.రాష్ట్రంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేయడంలో సంగారెడ్డి నియోజకవర్గం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కృషితో రెండో స్థానంలో ఉంది.కొండాపూర్, కంది, సంగారెడ్డి టౌన్, సంగారెడ్డి మండలానికి చెందిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకుఅందజేశారు.ఇందులో మొత్తం 61 చెక్కులు వాటి విలువ రూ.1428500 ఉందని అన్నారు.సదాశివపేట క్యాంపు కార్యాలయ ఆవరణలో సదాశివపేట పట్టణం, మండలానికి చెందిన మొత్తం 21 చెక్కులు వాటి విలువ 5,08,000 ఉందని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు రావడానికి కృషిచేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూమధ్యవర్తులు లేకుండా నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలి.అధికారం లేకున్న నేను సంగారెడ్డి ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యను నా సమస్యగా భావించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ జడ్పీటీసీ లు కొండల్ రెడ్డి, పాండు పట్టణ కార్యదర్శి నర్సింలు, మండల పార్టీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, విఠల్,చక్రపాణి, వివిధ మండలాల మాజీ సర్పంచులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెరిగిన భూముల ధరలకు అనుగుణంగా మార్కెట్ విలువ సవరణ : అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

-భూ భారతి దరఖాస్తులను పరిష్కరించి
-అర్హులకు భూ హక్కుల కల్పన
డీలర్లు మాత్రమే రేషన్ షాపులను నడపాలి
-రెవెన్యూ శాఖలోని పలు అంశాలపై
-అధికారులతో సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్



ఖమ్మం ప్రతినిది, (భారత శక్తి ) సెప్టెంబర్ 25:
పెరిగిన భూముల ధరలకు అనుగుణంగా మార్కెట్ విలువ సవరణ ప్రతిపాదనలు తయారు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు.
గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్, రెవెన్యూ శాఖలోని పలు అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు.
భూముల మార్కెట్ విలువ సవరణ, నిషేధిత భూముల జాబితా రిజిస్టర్ 22(ఎ), భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, రేషన్ షాపుల పర్యవేక్షణ, జాతీయ రహదారుల కోసం సేకరించిన భూములను మ్యూటేషన్ చేయడం వంటి పలు అంశాలపై అదనపు కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సర్వే నెంబర్ వారీగా అధ్యయనం చేసి భూముల విలువ సవరణ ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. భూముల విలువ సవరణ ప్రతిపాదనలు సహేతుకంగా తయారు చేయాలని, పెరిగిన భూముల ధరలకు అనుగుణంగా మార్కెట్ విలువ పకడ్బందీగా నిర్ణయించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. జాతీయ రహదారులకు సంబంధించి సేకరించిన భూముల మ్యూటేషన్ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం సేకరించిన భూములను ఆయా శాఖల పేరు మీద మ్యూటేషన్ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో ఉన్న భూముల మ్యూటేషన్ తక్షణం పూర్తి చేయాలని అన్నారు.
22(ఎ) రిజిస్టర్ రూపకల్పనలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వ భవనాల వివరాలు డోర్ నెంబర్ తో సహా వీటిలో నమోదు చేయాలని అన్నారు. భూ భారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించి అర్హులకు భూ హక్కులను కల్పించాలని అన్నారు
మండలంలో ఉన్న రేషన్ షాపులను తహసిల్దార్ క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని అన్నారు. రేషన్ షాపులను ప్రభుత్వం ఆథరైజ్ చేసిన డీలర్లు మాత్రమే నడపాలని అన్నారు. అక్టోబర్ చివరి నాటికి జిల్లాలో ఉన్న అన్ని రేషన్ షాపులను తనిఖీ పూర్తి చేసి నివేదిక అందించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

# ధమ్మ చక్ర దినోత్సవాన్ని శాంతియుతంగా నిర్వహిద్దాం: అడిషనల్ ఎస్పీ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 25 ( భారత శక్తి):ధమ్మ చక్ర దినోత్సవాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని అందరిని కోరుతూ, నిర్మల్ జిల్లా బైంసాలో అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో కుల సంఘాల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ, అంబేద్కర్ అందించిన బౌద్ధ సూత్రాలను గుర్తుచేసుకునే ఈ ప్రత్యేక దినాన్ని, సామరస్యపూరిత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నదే పోలీసు శాఖ ఆశయం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం, అని చెప్పారు.కుల సంఘాల ప్రతినిధులు కూడా శాంతియుతంగా ఉత్సవాలను నిర్వహించేందుకు తమ పూర్తి సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల మధ్య అక్కసులు, అనవసరమైన వివాదాలు లేకుండా ఉండేందుకు




అందరూ సంయమనం పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.ప్రముఖ బౌద్ధ నేతలు, సామాజిక కార్యకర్తలు కూడా ఈ సమావేశంలో పాల్గొని, తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ మరియు పట్టణ సీఐ గోపీనాథ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ పండుగ సంబరాలు

కామారెడ్డి జిల్లా, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 25: బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ మార్గదర్శకత్వంలో జిల్లావ్యాప్తంగా ప్రతిరోజు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో బతుకమ్మ పండుగలను నిర్వహించడం జరుగుతుంది. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ పండుగలో విద్య, పే అండ్ అకౌంట్స్, స్టేట్ ఆడిట్, ఇంటర్మీడియట్ విద్యాశాఖల ఉద్యోగులు పువ్వులతో ముస్తాబు చేసిన బతుకమ్మలతో సాంప్రదాయక దుస్తులతో హాజరై బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి బతుకమ్మ ఆడి అలరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయంలో బతుకమ్మ పండుగకు విశిష్ట స్థానం ఉందని రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా జరుపుకుంటున్న ఈ బతుకమ్మ పండుగలో పాల్గొనడం చాలా



# గాంధీ భవన్ బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 25:



గాంధీ భవన్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. బతుకమ్మ సంబరాల్లో మహిళా నాయకులతో కలిసి నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పువ్వులను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ కు మాత్రమే స్వంతమన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నదని ఆమె పేర్కొన్నారు.మహిళలందరూ బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాక్షించారు.

# మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

సంగారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి )సెప్టెంబర్ 25:




సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మండలం పటేల్ గూడలో కేంద్ర ప్రభుత్వ సంస్థ క్వాయర్ బోర్డ్ ఆధ్వర్యంలో మహిళా ఎంట్రప్రెన్యూర్షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మైత్రి ఫౌండేషన్ చైర్మన్ చెన్నంశెట్టి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. మహిళల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్వాయర్ బోర్డ్ మేనేజర్ టన్సీబ్, ప్రోగ్రాం మేనేజర్ ప్రసాద్, ట్రైనర్ మీనా, ఏపిఎం రవిశంకర్ మరియు పటేల్ గూడ మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా పండిత్ దీన్ దయాళ్ జన్మదినోత్సవం



గుమ్మడిదల,(భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 25: సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు నియోజకవర్గం గుమ్మడిదల మండల కేంద్రం అన్నారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రకృతినివాస్ లో పండిత్ దీన్ దయాళ్ జయంతి ఉత్సవాలు గుమ్మడిదల మండల అధ్యక్షులు కావలి ఐలేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐలేష్ మాట్లాడుతూ పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 1916 సెప్టెంబర్ 25న ఉత్తరప్రదేశ్ లోని మధుర దగ్గర నగుల చంద్రబాన్ గ్రామంలో జన్మించారని,అలాగే ఆయన 1937లో మొదట కొద్ది మంది స్వయం సేవకులలో ఒకరిగా చేరి, ప్రాదేశిక సహ ప్రచారక్ స్థాయికి ఎదిగారని, 1952 సంవత్సరంలో భారతీయ జన సంగిలిలో చేరి ఉపాధ్యక్షుడుగాని యమితులయ్యారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్రీయ సేవా సంఘం నాయకులు డాక్టర్ లక్ష్మీనారాయణ హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పదాధికారులు ముత్యాల గౌడ్, అన్నారం భూత్ అధ్యక్షులు తాళ్ల నరసింహ, బీజేవైఎం మండల అధ్యక్షులు పంకజరొక్కడే, కొత్తపల్లి భూత్ అధ్యక్షులు మధు పెంటారెడ్డి,గంగా గౌడ్, తూర్పాటి రాజు,భాను,కోళ్ల రాజు, ప్రకృతి నివాస్ సీనియర్ సిటిజన్స్, స్థానికులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పారమిత విద్యార్థులు

కరీంనగర్, సెప్టెంబర్ 25 (భారత శక్తి):ఈ నెల 25 నుంచి 27 వరకు తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిజామాబాదు జిల్లా ముక్తల్ లో అండర్ 17 విభాగంలో జరగనున్న 35వ



సబ్ జూనియర్ బాల బాలికల కబడ్డీ ఛాంపియన్షిప్ పోటీలకు నగరంలోని పారమిత ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి డి. సాత్విక బాలికల విభాగంలో,10వ తరగతి విద్యార్థి యండి ఇస్మైల్ బాలుర విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులబాలాజీ తెలిపారు.ఇటీవల అంబేద్కర్ స్టేడియంలో జరిగిగన ఉమ్మడి కరీంనగర్ జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ బాల బాలికల ఎంపిక పోటీలలో సాత్విక, ఇస్మైల్ అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్టాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను పారమిత విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాద్ రావు, డైరెక్టర్స్ ప్రసూన, అనుకర్ రావు, రశ్మిత, రాకేష్,వినోద్ రావు, వి.యు.మం ప్రసాద్, హనుమంతరావు, ప్రశాంత్, కవిత, సమన్వయకర్తలు వ్యాయామ ఉపాధ్యాయులు అర్జున్, వేణు, స్వామి అభినందించారు.

# కల్లూరు గవర్నమెంట్ జూనియర్ కళాశాలకు హాస్టల్ మంజూరు చేస్తాం..

– తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హామీ
– కల్లూరు మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు

ఖమ్మం ప్రతినిధి,(భారత శక్తి ) సెప్టెంబర్ 25:కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు హాస్టల్ మంజూరు చేస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు.కల్లూరు మండలంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి లతో కలిసి గురువారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేసారు.కల్లూరు మున్సిపాలిటీ ప్రాంతంలో మైనారిటీ సంక్షేమ శాఖచే రూ. 75 లక్షలతో నిర్మించిన షాదీఖాన భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. అనంతరం కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు యూనిఫామ్, నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని విద్యార్థులకు యూనిఫామ్, నోట్ పుస్తకాల పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ... కల్లూరు జూనియర్ కళాశాలకు 3.5 కిలో మీటర్ల దూరంలో ఉన్న నారాయణపురం అనే కుగ్రామంలో పుట్టిన తాను, ఇదే కళాశాలలో విద్యార్థిగా చదువుకున్నానని తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.10వ తరగతి తర్వాత ఇంటర్ లో చదివేందుకు సైకిల్ మీద కళాశాలకు వస్తూ ఇంటర్ పూర్తి చేయడం జరిగిందని అన్నారు.





గతంతో పోలిస్తే నేడు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కళాశాలలో ఉన్న కుటుంబాలలో 90 శాతం వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన వారై ఉంటారని అన్నారు.

తల్లిదండ్రుల తాపత్రయం, కష్టం పిల్లలు అర్థం చేసుకుంటే జీవితంలో రాణించే ఆస్కారం ఉంటుందని అన్నారు. జీవితంలో మనం తల్లిదండ్రులు, టీచర్స్, ప్రాంతానికి మంచి పేరు తీసుకుని రావడమే లక్ష్యంగా విద్యార్థులు కష్టపడాలని సూచించారు.సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో స్థానిక ఎమ్మెల్యే సొంత ట్రస్ట్ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని అన్నారు. విద్యా శాఖలో పెను మార్పులు తీసుకుని వస్తున్నామని, సీఎం స్వయంగా విద్యాశాఖ తన వద్ద ఉంచుకొని ప్రత్యేక శ్రద్ధ పెట్టారని అన్నారు.ఆర్థిక వ్యవస్థ సహకరించక పోయినా గురుకులాల్లో డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్స్ చార్జీలు 200 శాతం పెంచడం జరిగిందని, అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 200 కోట్లతో యంగ్ ఇండియా గురుకులాల నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, 75 నుంచి 80 కోట్లతో ఏ.టి.సి. సెంటర్ల నిర్మాణం వంటి అనేక కార్యక్రమాలను విద్యాశాఖ క్రింద చేపట్టామని అన్నారు.కల్లూరు జూనియర్ కళాశాలకు హాస్టల్ మంజూరు చేస్తామని, డిజిటల్ తరగతులకు మెటీరియల్ మంజూరు చేస్తామని మంత్రి అన్నారు. రాబోయే కొద్ది రోజులలో శాశ్వత హాస్టల్ భవనానికి శంకుస్థాపన చేస్తామని అన్నారు.అనంతరం కల్లూరు లో 75 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంబేద్కర్ లైబ్రరీ భవనం, రీడింగ్ రూం నిర్మాణ పనులకు మంత్రివర్యులు శంకుస్థాపన చేశారు. కల్లూరు మార్కెట్ యార్డ్ లో బతుకమ్మ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, పీఆర్ ఎస్ఇ జి. వెంకట్ రెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహ్మద్ ముజాహిద్, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాగం నీరజ దేవి, కల్లూరు మునిసిపల్ కమీషనర్ సంపత్ కుమార్, తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపిడివో చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## జీపీవోలు ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చాలి

ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ లచ్చిరెడ్డి



కరీంనగర్, సెప్టెంబర్ 25 (భారత శక్తి):గ్రామ స్థాయిలో ప్రజలకు, రైతులకు మేలు జరగాలనే ప్రభుత్వ సంకల్పం జీపీవో (గ్రామ పాలన అధికారులు)లు నెరవేర్చాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి అన్నారు. ఇటీవల రెవెన్యూ శాఖలో నియమకమైన జీపీవోలు అంకిత భావంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. జీపీవోలపై ప్రభుత్వం పెట్టిన గురుతర బాధ్యతను అనునిత్యం గుర్తించుకోవాలన్నారు. బుధవారం ఉమ్మడి కరీంనగర్ నగర్ జిల్లా తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల ఐకాస ఆధ్వర్యంలో గ్రామ పాలన అధికారుల ఆత్మీయ సమ్మేళనము కరీంనగర్ కలెక్టరేట్ రోడ్డులోని రెవెన్యూ గార్డెన్స్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లచ్చిరెడ్డి నూతనంగా నియామకమైన జీపీవోలకు భూభారతి చట్టంపై అవగాహన, విధులు, బాధ్యతలతో పాటుపారదర్శకత, అంకితభావంతో కూడిన పౌరసేవలపైఆయన దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్ర గ్రామీణరైతాంగానికి, ప్రజలకు మెరుగైన సేవలను క్షేత్రస్థాయిలోనే అందించాలనే సంకల్పంతో పాటు గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం, పునర్నిర్మాణంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంపూర్ణ సహకారం, భూ భారతి చట్టం అమలుతో జీపీవో వ్యవస్థ ఏర్పాటు సాధ్యమైందన్నారు. జీపీవోల సమస్యలను నాకు వదిలేసి ప్రజల సమస్యల పరిష్కారం బాధ్యత ను జీపీవో లు స్వీకరించాలన్నారు. తెలంగాణలోని ప్రతి గ్రామాన్ని రెవెన్యూ, భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. రెవెన్యూ చట్టాలకు సంబంధించి తెలంగాణ రెవెన్యూ పత్రికను నడపడం జరుగుతుందన్నారు. గతంలో ఐదు వేల మంది ఉంటే, నేడు 10వేల పై చిలుకు రెవెన్యూ ఉద్యోగులను రెవెన్యూ శాఖలోకి తీసుకోవడం జరిగిందన్నారు. జీపీవోలు ఉద్యోగం భావన తెలిసి ఉండాలన్నారు. ఏ ఒక్కరు తప్పు చేసినా అది మొత్తం వ్యవస్థకు చెడ్డ పేరు వస్తుందన్నారు. ప్రజలతో సఖ్యతగా ఉండాలని సూచించారు. జీపీవోల సమస్య తీరిందని, ఇతరుల సమస్యలను విస్మరించవద్దన్నారు. కారుణ్య నియామకాలకు సంబంధించి త్వరలోనే తీపి కబురు వస్తుందన్నారు. ప్రజలకు మంచి సేవ చేస్తారని నేను భావిస్తున్నానని, కింది స్థాయి, నుండి ఉన్నత స్థాయి వరకు పదోన్నతులు వచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. భూ జీపీవో ల విధులు, పదోన్నతులు కూడా చాలా పకడ్బందీగా రూపొంచడం జరుగుతుంది. ఈ రోజు జీపీవోల వేతనాలకు సంబంధించి ప్రభుత్వ పెద్దలు, సీసీఎల్ఏ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. త్వరలోనే వేతనాలు అందుతాయని తెలిపారు. ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ సారథ్యంలో గ్రామ పాలన అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి అన్నారు. రెవెన్యూ వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన వ్యక్తులే నేడు మళ్ళీ మన మధ్య తిరుగుతున్నారని అన్నారు. పదోన్నతుల విషయంలో కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జీపీవో లు ఎలాంటి ప్రలోభాలకు లోను కావద్దని సూచించారు. టీజీటీఏ జనరల్ సెక్రటరీ రమేష్ పాక మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు యువత ఎంత కీలకమో, రెవెన్యూ వ్యవస్థకు జీపీవోలు అంతే కీలకమన్నారు. పోరాడి సాధించుకున్న ఉద్యోగంను ఒక యగ్నంగా భావించి ప్రజలకు నాణ్యమైన సేవలను సత్వరం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మెన్ లచ్చిరెడ్డితో పాటు టీజీటీఏ జనరల్ సెక్రటరీ రమేష్ పాక, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.బిక్షం, రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ చిల్లా శ్రీనివాస్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కరీంనగర్ నగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిషన్, రమేష్, టీజీటీఏ కరీంనగర్ నగర్ కార్యదర్శి రాజేశ్వరి, నవాజ్ షరీఫ్, రిటైర్డ్ తహసీల్దార్గంప శంకరయ్య, మల్లారం అర్జున్, ఆంజనేయ ప్రసాద్, సాయి కిషోర్, బాపుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రానికి నిధులు తెలీని కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి

## సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్

కరీంనగర్, సెప్టెంబర్ 25 (భారత శక్తి):
కేంద్రం ప్రభుత్వం ద్వారా తెలంగాణ రాష్ట్రానికి రావలసిన నిధులు, యూరియా తీసుకురావడంలో విఫలమైన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు వెంటనే రాజీనామా చేయాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ డిమాండ్ చేశారు . కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రతి కుటుంబానికి 15000 రూపాయల ఆదాయం పేరుగుతోందని గొప్పలు చెప్తుందని ఎద్దేవ చేశారు. బుధవారం కరీంనగర్ లోని ముకుందలాల్ మిశ్రా భవన్లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ద్వారా రెండున్నర లక్షల కోట్ల రూపాయల భారాన్ని తగ్గిస్తున్నామని చెబుతోంది. ఈ ఏడు సంవత్సరాల కాలంలో ఎన్ని లక్షల కోట్ల రూపాయలు బిజెపి ప్రభుత్వం సామాన్య ప్రజల నుండి దోచి కార్పొరేట్లకు పెట్టిందో ప్రజల అర్థం చేసుకోవాలని అన్నారు. ఈ జీఎస్టీ ని భారాన్ని పేద ప్రజలపై మోపి కార్పోరేట్ సంస్థల బొజ్జలు నింపిందని అన్నారు. అదేవిధంగా మన రాష్ట్రానికి రావలసిన మూడున్నర లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందించడంలో కేంద్ర మంత్రులు విఫలమయ్యారు దీని ఫలితంగా రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్రం నుండి 8 మంది పార్లమెంటు సభ్యులు గెలిచి ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉండి తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుండి రావాల్సిన నిధులు తేవడంలో, యూరియా ను తేవడం లో , పూర్తిగా వైఫల్యం చెందారు. అంతర్జాతీయంగా బిజెపి మోడీ విధానాల వల్ల భారతదేశం యొక్క అస్తిత్వాన్నీ కోల్పోతుంది. అమెరికా టారిప్ ల యుద్ధం చేస్తుంటే యుద్ధంలో మోడీ ప్రభుత్వం సరైన విధంగా యుద్ధం చేయలేకపోతున్నారు . ఐక్యరాజ్యసమితిలో రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని భారతదేశం పెంచి పోషిస్తుందని ట్రంపు మాట్లాడుతుంటే దాన్ని కనీసం మోడీ ఖండించలేకపోతున్నాడని , అమెరికాలో నిరుద్యోగానికి ఇండియన్స్ కారణమని తప్పుడు కూతలు కూస్తుంటే మోడీ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు? ఇప్పటికి కూడా తగ్గిన జిఎస్టి స్లాబుల కనుకూలంగా మార్కెట్లో నిత్యవసర సరుకుల ధరలు తగ్గించడం లేదని దీనివలన పేదలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో గత




ప్రభుత్వం పది సంవత్సరాలు పరిపాలించిన నీళ్లు నిధులు నియామకాలు చేపట్టకపోవడంతో తెలంగాణ అన్యాయం జరిగిందని మా ప్రభుత్వం వస్తే వచ్చిన సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, వికలాంగుల పెన్షన్ పెంచుతామని, పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని, అనేక హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం వలె ఇచ్చిన హామీలు అమలు చేయడంలో వైఫల్యం చెందుతుందన్నారు. ఈ రాష్ట్రంలో 120 గజాల ఇంటి స్థలం కోసం అనేక ప్రాంతాలలో లక్షలాది మంది పేద ప్రజలు గుడిసెలు వేసుకొని జీవిస్తుంటే వారి గుడిసెలను నిర్దాక్షిణ్యంగా తొలగిస్తూ లాఠీ చార్జీ చేస్తుందన్నారు. ఈ ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తే గత ప్రభుత్వానికి పార్టీని గత ఈ ప్రభుత్వానికి కూడా పడుతుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని లేని పక్షంలో రాష్ట్రంలో దేశంలో ప్రత్యేక విధానాల కోసం కలిసొచ్చే పక్షాలన్నిటిని కలుపుకొని సమరశీల పోరాటం చేస్తామని అన్నారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరు వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాకు 45 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటే ఇప్పటివరకు 30 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని దీంతో రైతు లు తీవ్రంగా నష్టపోతునారు. ఈ జిల్లా నుంచి ఎన్నికైన కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు? %జూ× ,ఫ్రశీంజూఞ్ఖశ్రీ%, ట్రిబుల్ ఐటీ తేలేకపోయాడు, ఏళ్ల తరబడి రైల్వే బ్రిడ్జి అసంపూర్తిగా ఉన్నది, ఏ ఒక చిన్న తరహా పరిశ్రమ తీసుకురాలేకపోయాడు, ఈ సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో ఉద్యమాల కొనసాగిస్తామని అన్నారు.

## మ్మెల్యే కవ్వంపెల్లి ఇదేమి పద్దతి?

ఇల్లంతకుంట జడ్పీటీసీ రిజర్వేషన్ మార్చేందుకు?
సామాజిక సేవకుడు తిరుపతిరెడ్డి వెంటే ప్రజలు





కరీంనగర్, సెప్టెంబర్ 25 (భారత శక్తి):సామాజిక సేవకుడు, మండలంలో ప్రజలకు ఆపదవచ్చిందంటే అదుకునే తత్వంగల బెంద్రం తిరుపతి రెడ్డినే ఇల్లంతకుంట జడ్పీటీసీగా గెలిపించు కుంటామని దృఢనిచ్చయంతో ఉంటే కావాలని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ జనరల్ రిజర్వేషన్ ను మార్చుతున్నాడని మండల ప్రజలు, తిరుపతిరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనరల స్థానాన్ని బీసీ రిజర్వేషన్ గా మార్చమని , ఎంపీపీ జనరల్ స్థానాన్ని సైతం ఎస్సీ రిజర్వేషన్ గా మార్చలని అధికారుల పై ఒత్తిడి చేసి మార్పిస్తున్నాడనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. గురువారం ఇల్లంతకుంట మండల పరిషత్ కార్యాలయం ముందు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి, మండలం ప్రజలు మీడియాతో మాట్లాడారు.ప్రజా పాలన అంటూ ఇలాంటి దౌర్భాగ్య పనులకు దిగడం ఎమ్మెల్యే దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. మీ మీద. మీ పాలనా మీద.. మీకే నమ్మకం లేదనే సంకేతం ప్రజలకు వెళ్ళిందని చెప్పారు. ఇల్లంతకుంట మండల జడ్పీటిసి ఎన్నికలలో నా మీద పోటీ చెస్తే ఓడిపోతామని బయమేస్తుందా కదా అని నిలదీశారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఓట్లతోనే గెలవాలి తప్పా... రిజర్వేషన్ మార్చి అప్రజాస్వామికంగా జడ్పీటిసి ఎన్నికల్లో తనను నిలబడకుండా చేయాలనుకోవడం మీ అవివేకమా..పిరికితనమా మరి అర్థం కావడం లేదన్నారు. నా ఇల్లంతకుంట మండల ప్రజల మనస్సుల్లో నుంచి తనను వేరు చేయలేరనీ సవాల్ విసిరారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజల గుండెల్లో ఉండే ప్రజా సేవాకుడిననీ తిరుపతి రెడ్డి గుర్తుచేశారు. ఆయన వెంట మండల ప్రజలు ఉన్నారు.

# తిరుమలలో సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 2 వరకు జరుగుతున్న అఖిలాండ కోటిబ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాలు

హైదరాబాద్,(భారత శక్తి )సెప్టెంబర్ 25 : ఓ బ్రహ్మా! నాకు ఉత్సవాన్ని జరిపించమని స్వామి కోరగా బ్రహ్మ ఆయన ఆజ్ఞను అనుసరించి స్వయంగా ఉత్సవాలను జరిపించాడు. కన్యారాశిలో సూర్యుడు ప్రవేశించిన అనంతరం చిత్తా నక్షత్రంలో 'ధ్వజారోహణం', ఉత్తరాషాఢ నక్షత్రం నాడు 'రథోత్సవం', శ్రవణం నాడు 'చక్రస్నానం', ఇలా బ్రహ్మదేవుడే స్వయంగా ప్రారంభించి జరిపిన ఉత్సవాలు అయినందున వీటిని "బ్రహ్మోత్సవాలు" అని అంటారు. పరబ్రహ్మకు చేసిన ఉత్సవాలు కూడా అయినందున వీటిని 'బ్రహ్మోత్సవాలు' అని కూడా అంటారు.లి

ధ్వజారోహణంతో భక్తులకు ఆహ్వానం

అంకురారోపణ జరిగిన తర్వాత రోజు ఉదయం జరిగే ఉత్సవం 'ధ్వజారోహణ' ఉత్సవం. అనగా గరుడ ధ్వజాన్ని



పైకెగరేస్తారు. ఈ ధ్వజారోహణకు ముందు ముద్గాన్నం అనగా పెసరపప్పుతో చేసిన పులగాన్ని (పొంగలి) గరుడునికి నివేదన చేస్తారు. ధ్వజంపై నిలిచిన గరుడుడు శ్రీవారి బ్రహ్మోత్సవానికి రావాల్సిందిగా భక్తులందరినీ ఆహ్వానిస్తాడు. ఈ గరుడుడే.. సకల దోషాలను, పాపాలను అపవిత్రతను తన దృష్టితో ఎనిమిది యోజనాల దూరం అనగా 96 కిలోమీటర్ల దూరం వరకు



తొలగిస్తాడు.

– పెద్దశేష వాహనం మీద మలయప్ప దర్శనం


ధ్వజారోహణం జరిగిన నాటి సాయంత్రం మలయప్ప స్వామిని పెద్ద శేష వాహనంపై నాలుగు మాడ వీధులలో అంగరంగ వైభవంగా సకల పరిజన పరి చందంగా తాళ, నృత్య, వాద్య, సంగీత, గానసంరంభంతో, వేదపండితుల వేదఘోషలతో, దివ్య ప్రబంధ అధ్యాపకుల ప్రబందాధ్యాయముతో పాటు భక్తుల కోలాహలం మధ్యన స్వామి ఊరేగుతారు.

పెద్దశేష వాహనం అనగా ఆదిశేషుడే. ఆదిశేషుడనగా ఆది– మొదటి, శేషుడు– సేవకుడు అనగా మొదటి సేవకుడు అని అర్థం. శ్రీమన్నారాయణునికి నిరంతరం వెంట ఉండి అతనికి కావాల్సిన అన్ని సేవలు అన్నీ తానే అయ్యి చేస్తాడు ఆదిశేషుడు. స్వామి నివసించడానికి తానే ఇల్లుగా, పడుకోవడానికి శయ్యగా, కూర్చోవడానికి సింహాసనంగా, నడవడానికి పాదుకలుగా, తలకింద తలగడగా, చలివేస్తే దుప్పటిగా, వర్షం, ఎండ వస్తే గొడుగుగా ఇలా స్వామికి ఎప్పుడు ఏ సేవ కావాలన్నా తానే ఆ పరికరంగా మారి సేవ చేస్తాడు కావున 'ఆదిశేషుడు' అని పిలువబడతాడు. అందుకే మొదటి వాహన భాగ్యం ఆదిశేషుడికే స్వామి కల్పించాడు. ఈ విధంగా సేవలు చేయ డమే కాకుండా స్వామి ఏ రూపంలో ఉన్నా తాను కూడా అతనికి తగిన రూపంలో ఉంటూ వెంట అవతరిస్తాడు.

ఆదిశేషుడు తన వేయి శిరములలో ఒక శిరములోని ఒక చిన్న భాగంలో అఖిలాండ కోటి బ్రహ్మాండములను సిద్ధార్థ (ఆవగింజ) రూపంలో ధరిస్తాడు. ఇంత బ్రహ్మాండాన్ని ఒక ఆవగింజలా ధరించే మహాబలుడు ఆదిశేషుడు. అతనికి కాస్త తల భారంగా అనిపించినపుడు అనగా భూమిపై నివసించే ప్రాణులు సహించరాని పాపాలను చేసినప్పుడు పాపాల భారం మోయలేనని కొంచెం తల కదలిస్తాడు. ఏప్రాంతంలో ఆదిశేషుని తల కదిలితే ఆ ప్రాంతంలో భూకంపం సంభవిస్తుంది. ఈ విధంగా ఆది శేషుడు మొదట సకల జగత్తుకు ఆధారం. శ్రీమన్నారాయణుడు రాముడిగా అవతరిం చినప్పుడు ఆదిశేషుడు లక్ష్మణస్వామిగా వచ్చాడు. తమ్ముడిగా సేవ చేసిన ఫలితంగా కృష్ణావతారంలో అన్నగా అవతరించమని ఆదేశిస్తే కృష్ణునికి అన్నగా బలరామునిగా అవతరించాడు. కలియుగంలో వ్యాకరణ శాస్త్రం తెలియక అంటే మాట్లాడలేక ఇబ్బందిపడుతున్న జనుల కోసం పాణిని మహర్షి రచించిన 'అష్టాధ్యాయి' సూత్రాలకు వ్యాఖ్యానం చేయడానికి 'పతంజలి'గా అవతరించి మహాభాష్యం రాసి వాక్ శుద్ధిని చేశాడు. ఈ పతంజలే యోగ భాష్యం రాసి మనఃశుద్ధిని, వైద్యశాస్త్రంలో భాష్యం రాసి శరీర శుద్ధిని చేశారు. తరువాత చాలా కాలానికి భగవద్రామానుజులుగా అవతరించి బ్రహ్మసూత్రాలకు వ్యాఖ్యానం చేసి 'శ్రీభాష్యం' అను పేరుతో అందించారు. ఇంతటి దివ్యమైన సేవ చేసిన మహానుభావుడు అయినందున మలయప్ప స్వామి మొదటి వాహన సేవా భాగ్యాన్ని ఆదిశేషునికి ఇచ్చారు.

– చిన్న శేష వాహనం మీద శ్రీనివాసుని విహారం

ధ్వజారోహణం తెల్లవారి ఉదయం మలయప్ప స్వామి చిన్న శేష వాహనం పై నాలుగు మాడ



వీధులలో విహరిస్తారు. చిన్న శేషుడు అనగా శేషుని తమ్ముడు వాసుకి. ఈ వాసుకి శ్రీమన్నారాయణుని ఆజ్ఞతో క్షీరసాగర మధన సమయంలో మందర పర్వతానికి కవ్వపు తాడుగా మారి సముద్రాన్ని చిలకడానికి సహాయం చేశాడు. స్వామి ఆజ్ఞతో తన పడగల నుండి అనగా ముఖముల నుండి విషజ్వాలలు చిమ్ముతూ రాక్షసులను మూర్ఛాక్రాంతులను చేశాడు. తన విషాన్ని సముద్రంలో ఉద్గారం(వాంతి) చేసి సముద్రంలో హాలాహలం పుట్టడానికి తన వంతు సేవ చేసి ఆ హాలహలాన్ని పానం చేసి లోకాలను రక్షించే అవకాశాన్ని శంకరునికి ఇచ్చి దానికి కృతజ్ఞతగా శంకరుని చేతికి కంకణమైనాడు. తన చెల్లెలైనా 'జగత్కారు' ని 'జగత్కారు' అనే మహర్షికి ఇచ్చి వివాహం చేసి బ్రహ్మ ఆజ్ఞను పాటించి ఆ దంపతుల సంతానమైన ఆస్తికునితో జనమేజయుడు ఆచరించిన సర్పయాగాన్ని నివారించి అఖిల నాగులకు జీవితాన్ని ప్రసాదించిన మహానుభావుడు 'వాసుకి', అందుకే మలయప్ప స్వామి వాసుకికి రెండవ సేవా భాగ్యాన్ని ప్రసాదించాడు.

– హంస వాహనం పై స్వామి విహారం


చిన్న శేషవాహన సేవ జరిగిన నాటి సాయంత్రం మలయప్ప స్వామి హంస వాహనం పై విహరిస్తారు. శ్వేత వర్ణంతో పాలని, నీటిని వేరు చేయగల ఏకైక పక్షి 'హంస' కావున దీనిని జ్ఞానానికి ప్రతీకగా వ్యవహరిస్తారు. అంటే మంచిచెడులేవో తెలిపి దేనిని ఆచరించాలో తెలియజేసే దానిని జ్ఞానం అంటారు. జ్ఞానాన్ని స్వీకరించి అజ్ఞానాన్ని విడిచిపెట్టాలి. పాలను స్వీకరించి నీటిని విడిచిపెట్టాలి. జ్ఞానాన్ని ప్రభోదించే సర్వసంగ పరిత్యాగులైన సన్యాసులను పరమహంసలు అంటారు.

ఒకసారి బ్రహ్మలోకంలో ఋషులందరూ ఎవరు కనబడినా మీరెవరు? అని అడుగుతారని ఇచ్చట మీరు అన్నదానికి అర్థం ఏమిటని బ్రహ్మను ప్రశ్నించారు. శరీరాన్ని ఉద్దేశించా లేక ఆత్మనా. ఒకవేళ శరీరమే అయితే ఏ రూపమో ప్రత్యక్షంగా కనబడుతోంది కదా. ఆత్మ స్వరూపం ఒక్కటే కావున ఆత్మను ఎవరని అడగడం కుదరదు అయినందున మీరెవరు అనే ప్రశ్న తప్పు కదా అని ఋషులు బ్రహ్మను ప్రశ్నించారు. సమాధానం ఎలా ఇవ్వాలో తెలియక బ్రహ్మ శ్రీమన్నారాయణుని స్మరించగా వారికి తత్త్వాన్ని తెలుపడానికి స్వామి ఒక హంస రూపంలో వారి ముందుకు వచ్చారు. హఠాత్తుగా వచ్చిన హంసను చూసిన ఋషులు మీరెవరని అడుగగా హంసగా కనబడుతున్నాను కదా లోపల ఉన్న ఆత్మ మీలో ఉన్నదాని వంటిదే కదా మరి మీరెవరు అని మీరే ఎలా అడిగారు అని హంసరూపంలో ఉన్న స్వామి తిరిగి ప్రశ్నించారు. ఇదంతా చూసిన ఋషులు వచ్చింది సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే అనుకొని సాష్టాంగ దండ ప్రణామం చేసి చేతులు జోడించి స్వామీ! మా సందేహాన్ని తొలగించండని ప్రార్థించారు. నేను మనిషిని, నేను పశువును, నేను రాక్షసుడిని అని చెబితే అవన్నీ శరీరాలు, నేను అంటే శరీరం కాదు కదా. శరీరమే ఆత్మ అనుకున్న వారే నేను మనిషిని అంటారు. కాని ఆత్మజ్ఞానం ఉన్నవారు భగవంతుడు ఆత్మగా ఉన్నా, జీవాత్మ ఆత్మగా ఉన్నా మానవ శరీరాన్ని అని చెప్పాలి, వీరే ఆత్మజ్ఞానులు, మీరెవరు అన్న ప్రశ్నకు ఆత్మ జ్ఞానం ఉన్న వారా లేనివారా అని అర్థం. ఇలా ఆత్మ, అనాత్మ వివేకాన్ని క్షీరనీర న్యాయంతో తొలగించిన అవతారం హంసా వతారం. అందుకే మనలోని అహంకారాన్ని తొలగించి ఆత్మ వివే కాన్ని కలిగించాలనే అనుగ్రహ బుద్ధితో స్వామి హంసను తన వాహనంగా చేసుకొని ఆత్మను శరీరం మోయటం లేదు. ఆత్మే శరీరాన్ని మోస్తుందని తెలియ జేస్తున్నాడు. పరమాత్మ జీవాత్మకు ఆధారం. అదే విధంగా జీవాత్మ శరీరానికి ఆధారం, ఈ ఆత్మను తాను స్వయంగా మోసుకొని తన లోకానికి చేర్చేవాడు పరమాత్మ అన్న ధర్మ సూక్ష్మాన్ని బోధించడమే హంస వాహనంలోని ఆంతర్య మని స్వామి స్వయంగా హంస వాహనం పై విహరిస్తూ బోధిస్తాడు.



చౌడూరి నరసింహారావు
ప్రవచన కర్త, ఆధ్యాత్మిక విశ్లేషకులు

# నేను ఏడాదికి 125 రోజులు సెలవు తీసుకుంటా.. అదెలాగంటే : అక్షయ్‌కుమార్



బాలీవుడ్‌లో వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరించే నటుల్లో అక్షయ్‌కుమార్ ) ఎప్పుడూ ముందుంటారు. ఏడాదికి కనీసం మూడు లేదా నాలుగు సినిమాలతో ప్రేక్షకులను పలకరిస్తారు. ఎంతో క్రమశిక్షణ కలిగిన నటుడిగానూ ఆయనకు పేరుంది. నిత్యం షూటింగ్స్ బిజీగా ఉండే అక్షయ్ దినచర్య ఎలా మొదలవుతుంది? అసలు ఆయన సెలవులు ఎప్పుడు తీసుకుంటారు? అన్న ఆసక్తికర విషయాలను తాజాగా ఓ షోలో పంచుకున్నారు.

"నేను కూడా అందరిలానే సెలవులు తీసుకుంటా. ఏడాదిలో అవి 125 రోజులు ఉంటాయి. అది ఎలాగో చెబుతాను చూడండి.

సంవత్సరంలో 52 ఆదివారాలు, 40 రోజుల వేసవి విహారయాత్ర, క్రిస్మస్‌కు 12 రోజులు, దీపావళికి 3 రోజులు. ఇవి కాకుండా ప్రతి మూడు నెలలకు కుదిరితే ఓ వారం పాటు విశ్రాంతి తీసుకుంటా. మనందరికీ రోజుకి 24 గంటలు, ఏడాదికి 365 రోజులే ఉంటాయి.

ఇక్కడ అత్యంత ముఖ్యమైన విషయమేంటో తెలుసా జీవితమంటే ఏమీ లేదు సమయాన్ని సరిగ్గా నిర్వహణ చేసుకోవడమే. ఈ విషయంలో నేను ఎవరికీ ఉపన్యాసాలు ఇవ్వాలనుకోవడం లేదు. కానీ, మీకు ఒక్క విషయం మాత్రం చెప్పగలను. వీలైనంత వరకూ నిరాడంబరంగా ఉండండి. జీవితాన్ని జటిలం చేసుకోవద్దు.

ఒత్తిడి జోలికి పోవద్దు. నేటి ఆధునిక కాలంలో ఒత్తిడిని అనేది అత్యంత ప్రమాదకరం"

"కొందరు వ్యక్తులు ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ ఉంటారు. మరికొందరు అటు ఇంట్లో వారితో ఇటు, స్నేహితులతో సరైన సంబంధ బాంధవ్యాలు లేక ఇబ్బంది పడుతుంటారు. నేను 24మందితో కలిసి చిన్న బెడ్‌రూమ్‌లో ఉండేవాడిని. మీ జీవితాన్ని సాధ్యమైనంత వరకూ సరళతరం చేసుకోండి. సంతోషంగా ఉండమని దేవుడు మనల్ని భూమ్మీదకు పంపాడు. ఎందుకంటే ఈ భూమి కూడా స్వర్గానికి ప్రతిరూపం" అని అక్షయ్ చెప్పుకొచ్చారు. ఇటీవల 'జాలీ ఎల్ఎల్‌బీ 3'తో ప్రేక్షకులను పలకరించారు. ఈ ఏడాది అక్షయ్ నుంచి వచ్చిన ఐదో చిత్రమిది. ఇప్పటివరకూ రూ.59 కోట్లు వసూలు చేసింది. ఇక 2025లో 'స్కైఫోర్స్', 'కేసరి: చాప్టర్2', 'హౌస్‌ఫుల్5', 'కన్నప్ప' చిత్రాలతో అక్షయ్ అలరించారు.

# ఆమె ధైర్యానికే లొంగిపోయా



తెరపై సహజమైన నటనతో మెప్పిస్తూ.. వరుస అవకాశాల్ని తన ఖాతాలో వేసుకుంటుంది కన్నడ భామ రుక్మిణీ వసంత్. త్వరలో 'కాంతార: చాప్టర్ 1'తో ప్రేక్షకుల్ని పలకరించడానికి ముస్తాబవుతోంది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా ట్రైలర్‌లో యువరాణి కనకవతి పాత్రలో మెరిసి అందరి దృష్టిని ఆకర్షించిందీ తార. ఈ నేపథ్యంలోనే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రుక్మిణి తన పాత్ర గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది. "నా కెరీర్‌లోని ప్రత్యేక పాత్రలలో యువరాణి కనకవతి పాత్ర కూడా ఒకటి. మన జానపద కథలను ముందుకు తీసుకెళ్లే అద్భుతమైన చిత్రమిది.

ఇలాంటి సినిమాలో నాకు అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది.

కనకవతి రాజవంశానికి చెందిన అమ్మాయి. కానీ ఆమెలో కొంచెం కూడా గర్వం కనిపించదు. ఇందులో కనకవతికి ఉన్న దయ, ధైర్యం చూసి లొంగి పోవాల్సి వచ్చింది. థియేటర్లలో ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఎప్పుడెప్పుడూ చూస్తారా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నాన"ని చెప్పుకొచ్చింది.

# నీ జీవితంలో ఒక్క వీరోచిత క్షణమైనా ఉందా?



అనుపమ పరమేశ్వరన్, మలయాళ నటుడు షరాఫుద్దీన్ జంటగా నటించిన చిత్రం 'ది పెట్ డిటెక్టివ్'. ప్రణీశ్ విజయన్ తెరకెక్కిస్తున్న తొలి చిత్రమిది. తాజాగా ఈ సినిమా నుంచి చిత్రబృందం 'లా లా లా ది పెట్ డిటెక్టివ్' అనే గీతాన్ని విడుదల చేసింది. "నా ప్రియమైన టోనీ.

నువ్వు ఒక్క విలువైన కేసునైనా పరిష్కరించావా? అని నేను అడగను కానీ.. నీ జీవితంలో ఒక్క వీరోచిత క్షణమైనా ఉందా?" అంటూ హీరోయిన్ వేసిన ప్రశ్నతో ప్రారంభమైన ఈ పాట "జంతువుల పంజరం మూసేశారు.. కానీ దానిని తీయడానికి ఎవరు ధైర్యం చేస్తారు" అంటూ హీరో డిటెక్టివ్‌గా పెంపుడు జంతువులను వెతికి పట్టుకునే హాస్యభరిత సన్నివేశాలతో ప్రేక్షకులలో నవ్వులు పూయిస్తోంది. ఈ సినిమా అక్టోబరులో థియేటర్లలో విడుదల కానుంది.

## 30 ఏళ్లకు జాతీయ అవార్డు...

# ఓ భావోద్వేగ క్షణం



'ముప్పై ఏళ్ల నా సినీప్రయాణంలో తొలి జాతీయ చలనచిత్ర అవార్డుని గెలుచుకోవడం ఒక భావోద్వేగ క్షణము'ని అన్నారు నటి రాణీ ముఖర్జీ. 'మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' చిత్రంలో నటనకుగాను ఉత్తమ నటిగా ఈ పురస్కారం ఆమెను వరించింది. మంగళవారం జరిగిన 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో రాణికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ అవార్డుని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బుధవారం విలేకర్ల సమావేశంలో రాణీ ముఖర్జీ మాట్లాడుతూ.."నటిగా నా 30ఏళ్ల ప్రయాణంలో మొదటి జాతీయ అవార్డుని అందుకోవడం నిజంగా నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ గౌరవం నాకొక ప్రపంచం లాంటిది. నా జీవితంలో ఈ క్షణం కోసం ఎప్పుడూ కలలు కన్న నా దివంగత తండ్రికి దీనిని అంకితం చేయాలనుకుంటున్నాను. నేను ఈ రోజు ఆయనను చాలా మిస్ అవుతున్నాను. ఆయన ఆశీర్వాదం నా తల్లి నిరంతర సహకారం, ప్రేరణ నన్ను ఈ శ్రీమతి పాత్ర ద్వారా నడిపించాయని నాకు తెలుసు. నా అభిమానుల అచెంచలమైన ప్రేమ, మద్దతు నాకు గొప్ప ప్రేరణగా నిలిచాయి. ఈ అవార్డు మీ అందరికీ ఎంత ప్రత్యేకమో నాకు తెలుసు. మీరు ఎంత సంతోషంగా ఉన్నారో చూడటం నాకు అపారమైన ఆనందాన్నిస్తుంది"అని అన్నారు. ఈ సినిమా గురించి మాట్లాడుతూ.."ఇది నార్వేలోని భారతీయ తల్లిని తన పిల్లల నుంచి బలవంతంగా వేరు చేసిన తర్వాత తిరిగి వారి సంరక్షణను పొందేందుకు అధికారులతో తల్లి చేసే పోరాటం. ఒక తల్లిగా దేవికా పాత్ర నాకు చాలా వ్యక్తిగతమైనది. ఈ చిత్రంతో మేము మాతృత్వ స్ఫూర్తిని గౌరవించడానికి ప్రయత్నించాము. మహిళలు ప్రతిరోజు తమలో మోస్తున్న నిశ్శబ్ద శక్తిని ఇది గుర్తు చేస్తుందని నేను ఆశిస్తున్నాను"ని పేర్కొన్నారు. అంతేకాదు రాణీ ముఖర్జీ అవార్డు ప్రదానోత్సవంలో తన కుమార్తె అదిరా పేరున్న ఒక బంగారు గొలుసు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# 'ద్రౌపది 2' చిత్రీకరణ పూర్తి



%జి.ఎం. ఫిల్మ్ కార్పొరేషన్‌తో కలిసి నేతాజీ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద చోళ చక్రవర్తి నిర్మిస్తున్న చిత్రం 'ద్రౌపది 2'. తమిళ-తెలుగు ద్విభాషా చిత్రంగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌కి మోహన్.జి దర్శకత్వం వహించారు. ఈ మూవీలో రిచర్డ్ రిషి ముఖ్య పాత్రను పోషిస్తున్నారు. ఈ హిస్టారికల్ యాక్షన్ డ్రామాకు సంబంధించిన చిత్రీకరణ ముగిసింది. ఈ సందర్భంగా దర్శక, నిర్మాతలు సినిమా గురించి కొన్ని విశేషాల్ని పంచుకున్నారు. దర్శకుడు మోహన్.జి మాట్లాడుతూ, 'చిత్రీకరణ సమయంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా కూడా నిర్మాత చోళ చక్రవర్తి ఇచ్చిన సపోర్ట్‌తోనే పూర్తి చేయ గలిగాను' అని అన్నారు. 'దర్శకుడు మోహన్ సినిమాను తెరకెక్కించిన తీరు నన్ను బాగా ఆకట్టుకుంది. అనుకున్న దానికంటే ముందే షూటింగ్ పూర్తయింది' అని నిర్మాత చోళ చక్రవర్తి చెప్పారు. ఈ చిత్రంలో ప్రేక్షకులను 14వ శతాబ్దంలోకి తీసుకు వెళ్లి, ఆనాటి దక్షిణ భారతదేశ వైభవాన్ని కళ్లకు కట్టినట్లుగా చూపించబోతున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. అద్భుతమైన కథ, విజువల్స్, తారాగణంతో తెరకెక్కిస్తున ఈ చిత్రాన్ని డిసెంబర్ నెలలో గ్రాండ్‌గా రిలీజ్ చేయాలని మేకర్లు ప్లాన్ చేస్తున్నారు.



# సరికొత్త పాయింట్‌తో 'విద్రోహి'

రవి ప్రకాష్, శివకుమార్, చరిష్మా శ్రీఖర్, సాయికి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'విద్రోహి'. విఎస్‌వి దర్శకత్వంలో సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని వెంకట సుబ్రహ్మణ్యం విజ్జన నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ని హీరో శ్రీకాంత్, ఫస్ట్ సాంగ్‌ని వి.వి.వినాయక్, సెకండ్ సాంగ్‌ను ఆర్‌పి.పట్నాయక్ విడుదల చేసిన విషయం తెలిసిందే. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్ర ట్రైలర్‌ను తాజాగా హీరో అల్లరి నరేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమాలో పని చేసిన వారు నాకు చాలా క్లోజ్ పర్సన్స్. వారికి ఈ సినిమా మంచి సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'మా 'విద్రోహి' మూవీకి హీరో శ్రీకాంత్, దర్శకుడు వివి వినాయక్, సంగీత దర్శకుడు ఆర్‌పి.పట్నాయక్ మాకు సపోర్ట్ చేశారు. ఇండస్ట్రీ తరఫున ఇలాంటి సపోర్ట్ మాకు లభించడం చాలా ఆనందంగా ఉంది. త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం.

ఈ సినిమా తప్పకుండా మిమ్మల్ని అలరిస్తుంది' అని నిర్మాత వెంకట సుబ్రమణ్యం తెలిపారు. దర్శకుడు విఎస్‌వి మాట్లాడుతూ,' ఫస్ట్ లుక్‌కు ట్రిమెండస్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సాంగ్ చాలా మంచి ఆదరణను రాబట్టుకుంటోంది. సెకండ్ సాంగ్ కూడా ట్రెండింగ్‌లో ఉంది. ఇప్పటి వరకు రాని సరికొత్త పాయింట్‌తో ఉండే సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ ఇది. మా నిర్మాత ఎక్కడా రాజీపడకుండా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు.' అని చెప్పారు.



# గిల్ డిప్యూటీగా రవీంద్ర జడేజా

: ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్‌లో భారత్ () తొలిసారి స్వదేశంలో టెస్టు సిరీస్ ఆడనుంది. వెస్టిండీస్‌తో అక్టోబర్ 2 నుంచి అక్టోబర్ 14 వరకు రెండు టెస్టుల సిరీస్ జరగనుంది. ప్రస్తుతం టీమ్‌ఇండియా దుబాయ్ వేదికగా ఆసియా కప్‌లో తలపడుతోంది. అక్కడే భారత టెస్టు జట్టుసారథి శుభ్‌మన్ గిల్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌తో చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ సమావేశం నిర్వహించారు. అనంతరం టీమ్‌ఇండియా స్క్వాడ్‌ను ప్రకటించారు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో గాయపడిన రిషభ్ పంత్‌కు బదులు ఎన్.జగదీశన్‌కు ఛాన్స్ వచ్చింది. అలాగే గిల్‌కు డిప్యూటీగా రవీంద్ర జడేజాను నియమించింది.

ఆ ఇద్దరు ఔట్

ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో ఆడిన కరుణ్ నాయర్, శార్దూల్ ఠాకూర్‌ను సెలక్షన్ కమిటీ పక్కన పెట్టింది. ఆ పర్యటనలో వీరిద్దరి నుంచి చెప్పుకోదగ్గ ప్రదర్శన ఏదీ రాలేదు. కరుణ్ నాయర్ బదులు దేవదత్ పడిక్కల్ జట్టులోకి వచ్చాడు. దేశవాళీలో అదరగొట్టిన జగదీశన్‌కు ఛాన్స్ దక్కింది. రిషభ్ పంత్ లేకపోవడంతో ధ్రువ్ జురెల్‌కు బ్యాకప్ కీపర్ అయ్యాడు. భారత పేసర్ మహ్మద్ షమీ పునరాగమనంపై అగార్కర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇషాన్ కిషన్ భవితవ్యంపైనా స్పందించాడు.

"నితీశ్ కుమార్ రెడ్డి గత సిరీస్‌లో చాలా అద్భుతంగా ఆడాడు. అతడికి మరిన్ని ఛాన్స్‌లు ఇస్తే మెరుగ్గా రాణించే అవకాశం ఉంది. అతడిపై భారీగానే అంచనాలు పెట్టుకున్నాం. ఇషాన్ కిషన్‌ను మేం భారత్ %ూ% తరఫున ఎంపిక చేసే సమయంలో ఫిట్‌గా లేడు. ఇప్పుడు ఓకే. అయితే, దేశవాళీలో మరిన్ని మ్యాచులు ఆడితే బాగుంటుందనే ఉద్దేశంతో తీసుకోలేదు. బుమ్రా వర్క్‌లోడ్‌పై ఫిజియోలతో చర్చించాం. ఏదైనా సరే జట్టే తొలి ప్రాధాన్యం. తప్పకుండా బుమ్రా అద్భుతంగా రాణిస్తాడనే నమ్మకం ఉంది. రెండు టెస్టులకూ అందుబాటులో ఉంటాడు. షమీ ఫిట్‌నెస్‌పై మాకు ఇంకా అప్‌డేట్ రాలేదు. భారత్ తరఫున మరింత క్రికెట్ ఆడే సత్తా అతడిలో ఉంది. కరుణ్ నాయర్ నుంచి మేం చాలా ఆశించాం. కానీ, అతడు అంచనాలను అందుకోలేకపోయాడు. పడిక్కల్ ఆస్ట్రేలియాలో బాగానే ఆడాడు. ధర్మశాలలో ఇంగ్లాండ్‌పై హాఫ్ సెంచరీ కొట్టాడు. తప్పకుండా అదే ఫామ్ కొనసాగిస్తాడని ఆశిస్తున్నాం" అని అగార్కర్ వెల్లడించాడు.

భారత స్క్వాడ్ ఇదే

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా (వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీశ్, జగదీశన్, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్‌దీప్ యాదవ్

వెస్టిండీస్: కెవ్లాన్ అండర్సన్, బ్రాండన్ కింగ్, అలిక్ అథనాజ్, తాగెనరైన్ చంద్రపాల్, జాన్ క్యాంప్‌బెల్, జస్టిన్ గ్రీవ్స్, రోస్టన్ ఛేజ్ (కెప్టెన్), టెవిన్ ఇమ్లాచ్, షై హోప్, షమార్ జోసెఫ్, అండర్సన్ ఫిలిప్, జైడెన్ సీలెస్, ఖారీ పియ్రె,

# ఏ స్థానంలో ఆడటం ఇష్టం?

## 'మోహన్ లాల్'ను ప్రస్తావిస్తూ సంజుశాంసన్ సమాధానం



ఆసియా కప్‌లో భారత ఆటగాడు సంజు శాంసన్ బ్యాటింగ్ స్థానం ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఓపెనర్ మినహా.. వన్‌డౌన్ నుంచి మిడిలార్డర్ వరకూ ఆడేశాడు. ఓ రెండు మ్యాచుల్లో అయితే బ్యాటింగ్ చేసే అవకాశమే రాకపోవడం గమనార్హం. తాజాగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆరుగురు బ్యాటర్లు ఔటైనా సరే అతడిని క్రీజ్‌లోకి పంపించలేదు. ఈక్రమంలో వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ అడిగిన ప్రశ్నకు సంజుశాంసన్ ఆసక్తికరంగా సమాధానం ఇచ్చాడు. ఈసందర్భంగా మలయాళం సీనియర్ నటుడు మోహన్‌లాల్‌ను ప్రస్తావించాడు.

సంజయ్ మంజ్రేకర్: చివరిగా ఓ ప్రశ్న అడుగుతా. టీ20ల్లో మూడు సెంచరీలు నీ ఖాతాలో ఉన్నాయి. ఆ మూడు కూడా ఓపెనర్‌గానే వచ్చాయనుకుంటా.

సంజు శాంసన్: ఇది ప్రశ్న అనుకుంటున్నా.

మంజ్రేకర్: అంటే, ఏ స్థానంలో కంఫర్ట్‌గా ఉంటావు?

శాంసన్: ఇటీవల మలయాళం ఇండస్ట్రీకి చెందిన మోహన్‌లాల్‌ను దేశంలో అత్యుత్తమ సినీ అవార్డు వరించింది. దాదాపు నలభై ఏళ్ల నుంచి ఆయన నటిస్తున్నారు.

నేను కూడా దేశం తరఫున పదేళ్ల నుంచి ఆడుతున్నా. నేను కేవలం హీరో పాత్రలనే వేయాలనుకోవడం లేదు. కమెడియన్‌గా, విలన్‌గా.. ఇలా విభిన్న పాత్రలను చేయాలనుంది

. నేను కేవలం ఓపెనర్‌గానే పరుగులు చేస్తానని చెప్పను. నాకు ఇష్టమైన ప్లేస్ వన్‌డౌన్. మిగతా స్థానాల్లోనూ ఎందుకు ప్రయత్నించకూడదు. నేను కూడా మంచి విలన్ అవుతా. (ఆఖర్లో 'సంజు మోహన్‌లాల్ శాంసన్' అంటూ నవ్వేశాడు)

మోహన్‌లాల్ కూడా తన కెరీర్‌లో కేవలం హీరో పాత్రలనే కాకుండా.. సపోర్టింగ్‌గా ఉండే రోల్స్‌లోనూ నటించాడు. దానిని గుర్తుచేస్తూ శాంసన్ ఇలా సమాధానం ఇవ్వడం అభిమానులను ఆకట్టుకుంది. దీనికి సంబంధించి వీడియో వైరల్‌గా మారింది.

# కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్..

## భారత్ A వన్డే జట్టు ప్రకటన



ఓవైపు ఆస్ట్రేలియా A తో అనధికారిక టెస్టు సిరీస్ జరుగుతుండగానే.. వన్డే సిరీస్‌కు భారత %ూ% జట్టు)ను బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. సెప్టెంబర్ 30 నుంచి మూడు వన్డేల సిరీస్ మొదలుకానుంది. మూడు మ్యాచులు కాన్పూర్ వేదికగానే జరుగుతాయి. సుదీర్ఘ ఫార్మాట్‌కు దూరంగా ఉన్న శ్రేయస్ అయ్యర్ మళ్లీ వన్డే జట్టులోకి వచ్చేశాడు. అతడినే సారథిగా నియమించడం గమనార్హం. అనధికారిక టెస్టు సిరీస్‌కూ తొలుత శ్రేయస్ ) కెప్టెన్. తొలి మ్యాచ్‌లో పెద్దగా రాణించలేదు. దీంతో రెండో టెస్టుకు దూరంగా ఉన్నాడు. అతడి స్థానంలో ధ్రువ్‌జురెల్‌కు కెప్టెన్సీ ఛాన్స్ వచ్చింది. ఇప్పుడు మళ్లీ వన్డేలు ఆడేందుకు సిద్ధమయ్యాడు. ఇక రెండు, మూడు మ్యాచులకు తిలక్‌వర్మ అందుబాటులో ఉంటాడు. అతడిని అయ్యర్‌కు డిప్యూటీగా నియమించింది. ఆసియా కప్‌లో ఆడుతోన్న తిలక్‌తోపాటు అర్ష్‌దీప్, హర్షిత్ రాణా కూడా అనధికారిక వన్డే సిరీస్‌లో పాల్గొంటారు.

వన్డే సిరీస్‌కు జట్టు

తొలి మ్యాచ్‌కు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), రియాన్ పరాగ్, ఆయుష్ బదోని, సూర్యాంశ్ షెడ్గె, విప్రాజ్ నిగమ్, నిషాంత్ సింధు, గుర్జప్‌నీత్ సింగ్, యుధ్‌వీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), ప్రియాంశ్ ఆర్య, సిమ్రజీత్ సింగ్

మిగతా రెండు మ్యాచులకు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), రియాన్ పరాగ్, ఆయుష్ బదోని, సూర్యాంశ్ షెడ్గె, విప్రాజ్ నిగమ్, నిషాంత్ సింధు, గుర్జప్‌నీత్ సింగ్, యుధ్‌వీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), ప్రియాంశ్ ఆర్య, సిమ్రజీత్ సింగ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్.

# కుల్‌దీప్ ఖాతాలో రికార్డు..

## అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా ఘనత



ఆసియా కప్ 2025 టోర్నీలో టాప్ బౌలర్‌గా కొనసాగుతోన్న కుల్‌దీప్ యాదవ్ ( మరో ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం ఐదు మ్యాచుల్లో 12 వికెట్లు పడగొట్టాడు. తాజాగా బంగ్లాదేశ్ పైనా మూడు వికెట్లు తీసి సత్తా చాటాడు. ఈక్రమంలో ఆసియా కప్‌లోనే అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా కుల్‌దీప్ నిలిచాడు. ఈ జాబితాలో ఇప్పటివరకు టీమ్‌ఇండియా తరఫున రవీంద్ర జడేజా (29) ముందున్నాడు.

ఆసియా కప్ వన్డే, టీ20 ఫార్మాట్‌లో జరిగింది. వన్డేల్లో 19 వికెట్లు, టీ20 ఫార్మాట్‌లో 12 వికెట్లను కుల్‌దీప్ (31) తీశాడు. జడేజా ఎక్కువగా వన్డే ఫార్మాట్‌లోనే 25 వికెట్లు తీయగా.. టీ20ల్లో నాలుగు మాత్రమే పడగొట్టాడు. ఓవరాల్‌గా కుల్‌దీప్ రెండో బౌలర్‌గా నిలిచాడు. శ్రీలంక పేసర్ లసిత్ మలింగ (29o4) 33 వికెట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. కుల్‌దీప్ తర్వాత స్పిన్ దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ (30) ఉన్నాడు.

ఒకే ఎడిషన్‌లో టాప్ వికెట్ టేకర్‌గా..

ప్రస్తుత టోర్నీలో కుల్‌దీప్ 5 మ్యాచుల్లోనే 12 వికెట్లు తీశాడు. దీంతో ఒకే ఎడిషన్‌లో అత్యధిక వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా నిలిచాడు. భువనేశ్వర్ కుమార్ 2022లో 11 వికెట్లు తీయగా.. ఇప్పుడు దానిని కుల్‌దీప్ అధిగమించాడు. ఓవరాల్‌గా మరో వికెట్ తీస్తే కుల్‌దీప్‌దే అగ్రస్థానం. యూఏఈ ఆటగాడు అమ్జద్ జావెద్ 2016లో ఏడు మ్యాచుల్లో 12 వికెట్లు పడగొట్టాడు. ఇంకా శ్రీలంకతోపాటు ఫైనల్‌లో భారత్ ఆడనున్న నేపథ్యంలో కుల్‌దీప్ టాప్ ప్లేస్‌కు చేరుకోవడం పెద్ద కష్టమేం కాదు.

## గిల్ డిప్యూటీగా రవీంద్ర జడేజా..


# విండీస్‌తో టెస్టు సిరీస్‌కు టీమ్‌ఇండియా ఇదే

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్‌లో భారత్ (తొలిసారి స్వదేశంలో టెస్టు సిరీస్ ఆడనుంది. వెస్టిండీస్‌తో అక్టోబర్ 2 నుంచి అక్టోబర్ 14 వరకు రెండు టెస్టుల సిరీస్ జరగనుంది. ప్రస్తుతం టీమ్‌ఇండియా దుబాయ్ వేదికగా ఆసియా కప్‌లో తలపడుతోంది. అక్కడే భారత టెస్టు జట్టుసారథి శుభ్‌మన్ గిల్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌తో చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ సమావేశం నిర్వహించారు. అనంతరం టీమ్‌ఇండియా స్క్వాడ్‌ను ప్రకటించారు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో గాయపడిన రిషభ్ పంత్‌కు బదులు ఎన్.జగదీశన్‌కు ఛాన్స్ వచ్చింది. అలాగే గిల్‌కు డిప్యూటీగా రవీంద్ర జడేజాను నియమించింది.

ఆ ఇద్దరు ఔట్


ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో ఆడిన కరుణ్ నాయర్, శార్దూల్ ఠాకూర్‌ను సెలక్షన్ కమిటీ పక్కన పెట్టింది. ఆ పర్యటనలో వీరిద్దరి నుంచి చెప్పుకోదగ్గ ప్రదర్శన ఏదీ రాలేదు. కరుణ్ నాయర్ బదులు దేవదత్ పడిక్కల్ జట్టులోకి వచ్చాడు. దేశవాళీలో అదరగొట్టిన జగదీశన్‌కు ఛాన్స్ దక్కింది. రిషభ్ పంత్ లేకపోవడంతో ధ్రువ్ జురెల్‌కు బ్యాకప్ కీపర్ అయ్యాడు. భారత పేసర్ మహ్మద్ షమీ పునరాగమనంపై అగార్కర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇషాన్ కిషన్ భవితవ్యంపైనా స్పందించాడు.

"నితీశ్ కుమార్ రెడ్డి గత సిరీస్‌లో చాలా అద్భుతంగా ఆడాడు. అతడికి మరిన్ని ఛాన్స్‌లు ఇస్తే మెరుగ్గా రాణించే అవకాశం ఉంది. అతడిపై భారీగానే అంచనాలు పెట్టుకున్నాం. ఇషాన్ కిషన్‌ను మేం భారత్ %ూ% తరఫున ఎంపిక చేసే సమయంలో ఫిట్‌గా లేడు. ఇప్పుడు ఓకే. అయితే, దేశవాళీలో మరిన్ని మ్యాచులు ఆడితే బాగుంటుందనే ఉద్దేశంతో తీసుకోలేదు. బుమ్రా వర్క్‌లోడ్‌పై ఫిజియోలతో చర్చించాం. ఏదైనా సరే జట్టే తొలి ప్రాధాన్యం. తప్పకుండా బుమ్రా అద్భుతంగా రాణిస్తాడనే నమ్మకం ఉంది. రెండు టెస్టులకూ అందుబాటులో ఉంటాడు. షమీ ఫిట్‌నెస్‌పై మాకు ఇంకా అప్‌డేట్ రాలేదు. భారత్ తరఫున మరింత క్రికెట్ ఆడే సత్తా అతడిలో ఉంది. కరుణ్ నాయర్ నుంచి మేం చాలా ఆశించాం. కానీ, అతడు అంచనాలను అందుకోలేకపోయాడు. పడిక్కల్ ఆస్ట్రేలియాలో బాగానే ఆడాడు. ధర్మశాలలో ఇంగ్లాండ్‌పై హాఫ్ సెంచరీ కొట్టాడు.



# ఇప్పుడు వర్కౌట్ కాకపోయినా..

## మళ్లీ అదే చేస్తాం: సూర్యకుమార్ యాదవ్



ఆసియా కప్ 2025 టోర్నీ ఫైనల్‌కు టీమ్‌ఇండియా దూసుకెళ్లింది. సూపర్ -4లో వరుసగా రెండు మ్యాచుల్లోనూ గెలిచింది. తాజాగా బంగ్లాదేశ్‌ను 41 పరుగుల తేడాతో టీమ్‌ఇండియా చిత్తు చేసింది. బంగ్లాతో మ్యాచ్‌కు తుది జట్టులో ఎలాంటి మార్పులు లేకుండానే భారత్ బరిలోకి దిగింది. కానీ, ప్రయోగాలను మాత్రం ఆపలేదు. అనూహ్యంగా వన్‌డౌన్‌లో శివమ్ దూబె వచ్చాడు. ఇక సంజు శాంసన్ అయితే బ్యాటింగ్‌కే రాలేదు. ఆరు వికెట్లు పడినా సరే అతన్ని క్రీజ్‌లోకి పంపలేదు. దీంతో అభిమానుల్లో మళ్లీ అనుమానాలు మొదలయ్యాయి. ఇప్పుడంటే గెలిచారు కాబట్టి సరిపోయింది.. ఒకవేళ ఫలితం తేడా కొడితే పరిస్థితి ఏంటనేది వారి ఆందోళన. అయితే, ఇలాంటి ప్రయోగాలను కొనసాగిస్తూనే ఉంటామని భారత కెప్టెన్ సూర్యకుమార్ పరోక్షంగా స్పష్టంచేశాడు.

"బంగ్లా బౌలింగ్ లైనప్ చూశాక బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేశాం. ఎడమ చేతివాటం స్పిన్నర్, మరొక లెగ్ స్పిన్నర్ ఉన్నారు. స్పిన్‌ను ఆడటంలో దూబె సరైన ఎంపిక అని భావించాం. మిడిల్ ఓవర్లలో అతడు చాలా దూకుడుగా ఆడతాడు. అయితే, ఈసారి అది వర్కౌట్ కాలేదు. అలాగని తర్వాత మ్యాచుల్లో మారుస్తామని కాదు. పిచ్, ప్రత్యర్థి బౌలింగ్‌ను దృష్టిలోఉంచుకొని మా నిర్ణయాలు ఉంటాయి. మున్ముందూ ఇలాగే ప్రయత్నిస్తాం" అని సూర్య వెల్లడించాడు.

# గ్రూప్ వన్ లో డీఎస్పీగా ఎంపికైన మౌనిక



ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 25 (భారత శక్తి): మల్లంపల్లి ఎర్రమట్టి లో మెరిసిన ఆణిముత్యం మల్లెపు మౌనిక గ్రూప్ వన్ లో ఎంపికైన అల్లెపు మౌనిక. టీజీ పీఎస్సీ బోర్డ్ ప్రకటించిన గ్రూప్ వన్ ఫలితాల్లో ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన అల్లెపు సమ్మయ్య సరోజన ల కూతురు అల్లెపు మౌనిక డి.ఎస్.పి గా ఎంపికయ్యారు. బలహీన వర్గం పేద కుటుంబం నుండి మౌనిక గ్రూప్ వన్ స్థాయి ఉద్యోగాన్ని సాధించినందుకు మల్లంపల్లి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మల్లంపల్లి లో ప్రజా సంఘాల నాయకులు మౌనికను ఘనంగా.సన్మానించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లంపల్లి లోని సిద్ధార్థ హై స్కూల్ 2015లో పదో తరగతి,2017లో హన్మకొండ లోని కాకతీయ మహిళా కళాశాలలో ఇంటర్, సెయింట్ ఫ్రాన్సిస్ హైదరాబాద్ లో బిఎ, ఇపిపి 2020 లో డిగ్రీ పూర్తిచేసిన మౌనిక కృషి ఆదర్శనీయం, అభినందనీయం అన్నారు. ఏ కోచింగ్ లేకుండా టీజీపీఎస్సీ ఫలితాల్లో 315 వ ర్యాంక్ సాధించడం తన అకుంఠిత దీక్షకు నిదర్శనం అన్నారు. నేటి యువతకు ఆదర్శనీయంగా మౌనిక నిలిచిందని, జీవితంలో చదువును మించిన ఆయుధం లేదని,పేద కుటుంబంలో పుట్టిన మౌనిక ఏ కోచింగ్ తీసుకోకుండా అత్యున్నత స్థానాన్ని సాధించడం గొప్ప విషయం అన్నారు. పేదకుటుంబమైనప్పటికీ కూతుర్ని చదివించడానికి ఎనలేని కృషి చేసి ప్రోత్సహించిన తల్లిదండ్రులు కల నెరవేరిందన్నారు. గురువులకు,జేడీ మల్లంపల్లిమండలానికి ములుగు జిల్లా కు పేరుతేవడం మల్లంపల్లి ప్రజలకూ గర్వంగాఉందన్నారు . గ్రామం లో ఉన్న యువతీ,యువకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గోల్కొండ రాజు, చిదర సంతోష్ , మెర్రి రాజు, పొనుగంటి రవి, కానుగంటి సతీష్, కుక్కల సంపత్, ఎస్ ఆర్ రాజు, ఎడ్ల అనీల్ రెడ్డీ,గొల్లెన సంతోష్, భూపతి మధు, మహ్మద్ బాబుల్, జింక వేణు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (భారత శక్తి): తెలంగాణలో 2620 కొత్త మద్యం దుకాణాల నిర్వహణకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. రేపటి నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. అక్టోబర్ 23న డ్రా తీసి షాపులు ఎవరికి దక్కాయో ప్రకటిస్తుంది. ఈ డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30 వరకు కొత్త షాపులు నిర్వహించుకోవచ్చు. ఒక్కో షాపు కోసం రూ.3 లక్షలు నాన్ రిఫండబుల్ టెండర్ ఫీజు చెల్లించాలి. మొత్తం షాపుల్లో గౌడ కులస్థులకు 15%, ఎస్సీలకు 10%, ఎస్టీలకు 5% కేటాయించనుంది.

## సిసి రోడ్లు, డ్రైనేజీ పనుల్లో నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు

* **మూణ్నాళ్ల ముచ్చటగానే అభివృద్ధి పనులు**
* **అధికారుల పర్యవేక్షణ లోపంతో నిధులు దుర్వినియోగం**
* **కమిషనర్ కు వినతిపత్రాన్ని అందించిన రేణుక అక్షర మహిళా మండలి**




మణుగూరు, సెప్టెంబర్ 25 (భారతశక్తి): మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు ఇస్తున్నారని రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు ఆరోపించారు. గురువారం పట్టణంలో జరిగే అభివృద్ధి పనులను రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించిందని, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావుకు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ మాట్లాడుతూ.. స్థానిక శాసన సభ్యులు పట్టణంను సుందర వనంగా తీర్చిదిద్దేందుకు కోట్ల రూపాయల నిధులు వెచ్చించిస్తే నాసిరకం పనులతో తూతూ మంత్రంగా నిర్మాణాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టర్లు అంచనా వ్యయంకు చేయాల్సిన పనులను 40 శాతం నిధులతో నిర్మాణాలు పూర్తి చేసి మిగతావి తమ ఖాతాలో వేసుకుంటున్నారని ఆరోపించారు. కొంతమంది అధికారులు కమీషన్ల దాహానికి నిబంధనలు పాటించకుండా చేసిన నిర్మాణాలు మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలి పోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. వివిధ రకాల గ్రాండ్ల నుండి విడుదలైన నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపించారు. సెంట్రల్ లైటింగ్, సిసి రోడ్లు, డ్రైనేజీ పనుల్లో నాణ్యత లోపం కనిపిస్తుందని, క్వాలిటీ కంట్రోల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమితి సింగారం పంచాయితీలోని రాజీవ్ గాంధీ నగర్ లో అసంపూర్తిగా నిర్మాణం చేసిన సమీకృత మార్కెట్ పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నాసిరకం విద్యుత్ పరికరాల వాడకం వలన సెంట్రల్ లైటింగ్ పనులు సాగుతున్నాయని, దీనికి కొందరు అధికారులు కమీషన్ల కోసం కక్కుర్తే కారణమని పేర్కొన్నా రు. మరోవైపు సిసి రోడ్డు పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కొందరి అండదండలతో నాసిరకంగా పనులు జరుగుతున్నాయని,ఈ పనులపై విచారణ జరిపించి గుత్తేదారులు, ఏఈపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాసిరకంగా అభివృద్ధి పనులను చేపట్టి ప్రజాధనం వృథాచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు బొడ్డు సౌజన్య, కోరి శ్యామల, రెడ్డీబోయిన రేణుక, దేరంగుల సుజత, కన్నాపురం వసంత, డాకూరి సౌజన్య, బాడీష పార్వతి, కన్నాపురం శైలజ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఉద్యోగులతో బతుకమ్మ సంబరాలలో నిర్మల జగ్గారెడ్డి



సంగారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 25: సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద టీఎన్జీవోఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పాల్గొన్నారు. మహిళ ఉద్యోగులతో కలసి నిర్మల జగ్గారెడ్డి బతుకమ్మ ఆడారు. అనంతరం మహిళ ఉద్యోగులు నిర్మలా జగ్గారెడ్డిని ఘనంగా సన్మానించారు.



## మేదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

ఉమ్మడి వరంగల్ బ్యూరో, సెప్టెంబర్25 (భారత శక్తి): తెలంగాణ సంప్రదాయం ప్రకారంగా బతుకమ్మ సంబరాలు తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర ఉద్యోగుల విభాగం సహకారంతో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించుకుంటున్నామని తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం మహిళా విభాగం..రాష్ట్ర అధ్యక్షురాలు దీకొండ సరిత అన్నారు. శుక్రవారం బతుకమ్మ సంబరాలు నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణం, పబ్లిక్ గార్డెన్ లో అంగ రంగ వైభవంగా జరిగినాయి. మహిళలు బతుమ్మపాటలకు చక్కగా ఆడి, పాటలపోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పాతకోటి ఉమ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చందా స్వరాజ్యం, రాష్ట్ర ఉద్యోగ విభాగం అధ్యక్షులు శ్రీ ప్రతాపగిరి ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ చందా రాజేందర్, దండుగుడుము ఉపేందర్, రాష్ట్ర న్యాయ సలహా దారు దీకొండ సర్జుమోహన్.. ఇతర రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాలో 49 మద్యం షాపుల నిర్వహణకు డ్రా నిర్వహించిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ



కామారెడ్డి జిల్లా, సెప్టెంబర్25 (భారత శక్తి ప్రతినిధి) : తెలంగాణ నూతన మద్యం పాలసీ (202527 )లో భాగంగా జిల్లాలో 49 మద్యం షాపుల నిర్వహణకు ఎస్సీ, ఎస్టీ, బిసి గౌడ కులస్తుల రిజర్వేషన్ ఎంపిక కొరకు గురువారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హల్ లో జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఆధ్వర్యంలో వీడియోగ్రఫీ మధ్య జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ, ఎస్టీ అభివృద్ధి శాఖ, బీసీ అభివృద్ధి శాఖల అధికారుల సమక్షంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ వారు డ్రా నిర్వహించారు. జిల్లాలో మొత్తం 49 మద్యం దుకాణాలు ఉండగా వాటిలో 05 ఎస్సీ సామాజిక వర్గానికి, 02 ఎస్టీ సామజిక వర్గానికి మరియు 07 బిసి గౌడ కులాలకు లాటరీ ద్వారా మద్యం షాపులను ఎంపిక చేసి వాటి ఆమోదానికి రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ కు పంపిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటిండెంట్ హనుమంతరావు, జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారి వెంకటేష్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జయరాజ్, జిల్లా ఎస్టీ అభివృద్ధి అధికారి సతీష్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఎండిఆర్ కో ఫౌండర్ పృధ్వీరాజ్

సంగారెడ్డి, సెప్టెంబర్25 (భారత శక్తి ప్రతినిధి) : సంగారెడ్డి, జిల్లా పటాన్‌చెరు పట్టణంలోని పృధ్వీరాజ్ శాంతి నగర్, గొల్ల బస్తి, గోనెమ్మ బస్తి, జెపి కాలనీ, గౌతమ్ నగర్, ఇస్నాపూర్ ప్రాంతాలలోని దుర్గామాత మండపాలను బీఆర్ఎస్ నాయకులు, ఎం డి ఆర్ ఫౌండేషన్ కోఫౌండర్ మాదిరి ప్రిథ్వీరాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిథ్వీరాజ్ మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సంతోషంగా, ఆరోగ్యంగా, ఐశ్వర్యంతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.

## వృద్ధులకు ఆపన్న హస్తం



* **రాచకొండ పోలీసుల వినూత్న ఆవిష్కరణ**

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (భారతశక్తి): రాచకొండ పోలీస్ కమిషనరేట్ మరియు రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ (RKSC) సంయుక్తంగా గోల్డెన్ కేర్ - మన కోసం శ్రమించిన వారికి మన సంరక్షణ అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఈ కార్యక్రమం ద్వారా రాచకొండ కమిషనరేట్ పరిధిలోని వృద్ధ పౌరులకు సంరక్షణ, రక్షణ మరియు గౌరవం అందించడమే ప్రధాన లక్ష్యం. రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు IPS, చైర్మన్ RKSC మార్గదర్శకత్వంలో, ఈ కార్యక్రమం వృద్ధుల కోసం నియమిత పర్యటనలు, నైతిక సహకారం, సైబర్ భద్రతపై అవగాహన, SOS సెటప్, వైద్య మరియు అత్యవసర సహాయం కోసం ఆసుపత్రులతో అనుబంధాలు, అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మార్గదర్శనం (వైద్య సహాయం, ఆరోగ్య బీమా) అందించనుంది. అంతేకాక, రాచకొండ పోలీసులు వృద్ధులకు ఆర్థిక మోసాల నివేదనలో సహాయం, శారీరక లేదా మానసిక వేధింపుల కేసుల దర్యాప్తు మరియు జోక్యం, నిర్లక్ష్యం మరియు విడిచిపెట్టే సంఘటనల పరిష్కారం, కోల్పోయిన వస్తువులు లేదా తప్పిపోయిన వ్యక్తులను కనుగొనడంలో సహాయం అందిస్తారు. ఈ కార్యక్రమానికి చట్టపరమైన ఆధారాలు కూడా ఉన్నాయి, వీటిలో BNSS సెక్షన్ 144 వృద్ధులను పోషించకుండా నిర్లక్ష్యం చేసినవారిపై చర్యలు తీసుకునే విధంగా ఉంటుంది. అలాగే, మెయింటెనెన్స్ యాక్ట్ (సెక్షన్లు 4 & 5) వృద్ధులు తమ పిల్లల నుండి ఆర్థిక సహాయం పొందేలా అవకాశం కల్పిస్తుంది. వృద్ధులు సహాయం కోసం సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ -14567 లేదా రాచకొండ వాట్సాప్ నంబర్ - 8712662111ద్వారా సంప్రదించవచ్చు. ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ పోలీస్, జి. సుధీర్ బాబు, IPS మాట్లాడుతూ.. మన వృద్ధులు సమాజానికి నిజమైన మూలస్తంభాలు మరియు జ్ఞాననిధులు. గోల్డెన్ కేర్ ద్వారా మేము భద్రత మాత్రమే కాదు, ఆప్యాయం, గౌరవం, ఆత్మీయతను అందిస్తున్నాం. రాచకొండ పోలీసులు ఎల్లప్పుడూ మీ కుటుంబ సభ్యుల్లా ఉంటారు అని పేర్కొన్నారు. వచ్చిన సీనియర్ సిటిజన్స్ అందరికీ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి డీసీపీ మల్కాజిగిరి పద్మజ, ఐపీఎస్, ఎల్బీ నగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, ఐపీఎస్, భువనగిరి డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, ఐపీఎస్, మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, డీసీపీ క్రైమ్స్ అరవింద్ బాబు, డీసీపీ అడ్మిన్ ఇందిరా, విమెన్ సేఫ్టీ డీసీపీ ఉషా రాణి, డీసీపీ సైబర్ క్రైమ్ నాగలక్ష్మి, డీసీపీ sot రమణ రెడ్డి, ట్రాఫిక్ డీసీపీ మనోహర్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ జాయింట్ సెక్రటరీ శివ కారడి, చీఫ్ కోఆర్డినేటర్ సావిత్రి, సూర్యనారాయణ తో పాటు సీనియర్ అధికారులు, అతిథులు, RKSC ట్రాఫిక్ మార్షల్స్ హాజరై తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వృద్ధ పౌరుల కోసం భద్రతతో కూడిన, సహకారంతో కూడిన, సమానత్వ సమాజాన్ని నిర్మించేందుకు రాచకొండ పోలీసులు మరియు RKSCలు కట్టుబడి ఉన్నట్లు మరోసారి ధృవీకరించారు. ప్రతి వృద్ధునికి చేరుకునేలా నియమిత సమీక్షా సమావేశాలు నిర్వహించి, గోల్డెన్ కేర్ పరిధిని మరింత విస్తరించనున్నారు.



# శ్రీవారి భక్తులకు గుడ్ న్యూస్.. అందుబాటులోకి కొత్త సౌకర్యాలు

తిరుమల, సెప్టెంబరు 25 (భారత శక్తి) : తిరుమల శ్రీవారి భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి పలు కీలక అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన 'వేంకటాద్రి నిలయం' యాత్రికుల వసతి సముదాయాన్ని (పీఏసీ 5) ఉపరాష్ట్రపతి, సీఎం లాంఛనంగా ప్రారంభించారు. దీంతో పాటు, శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యతను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన విజన్ బేస్డ్ స్టోరింగ్ మెషిన్‌కు కూడా శ్రీకారం చుట్టారు. అంతకుముందు, ప్రాంగణానికి చేరుకున్న ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రికి టీటీడీ అధికారులు మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసిన అనంతరం వారు భవనాన్ని కలియతిరిగి భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. వసతి గృహం బుకింగ్ కౌంటర్ పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం, తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను (ఐసీసీసీ) కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ ఆయన వెంట ఉన్నారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రులు ఆనం రాంనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు. కాగా, బుధవారం రాత్రి ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ పద్మావతి అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా భేటీ అయిన విషయం తెలిసిందే.



## మిగ్21 విమాన స్థానంలో తేజస్ జెట్‌లు.. హెచ్ఏఎల్‌తో రక్షణ శాఖ ఒప్పందం

ఢిల్లీ, సెప్టెంబరు 25 (భారత శక్తి) : భారత వాయుసేనలో తేజస్ యుద్ధ విమానాలు చేరనున్నాయి. రక్షణ శాఖ... దశాబ్దాలుగా కీలక సేవలు అందించిన మిగ్21 యుద్ధ విమానాలకు వీడ్కోలు పలికి వాటి స్థానంలో తేజస్ జెట్లను ప్రవేశపెట్టనుంది. ఈ క్రమంలో రూ. 62,370 కోట్లతో 97 తేజస్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)తో రక్షణ శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపిన నెలలోపే ఈ ఒప్పందం ఖరారైంది. మిగ్21 యుద్ధ విమానాల స్థానంలో ఈ సింగిల్ ఇంజిన్ ఎంకే1ఏ తేజస్ జెట్‌లను ప్రవేశపెడుతున్నారు. తాజాగా సమీకరిస్తున్న 97 విమానాల్లో 68 యుద్ధ విమానాలు, 29 ట్విన్ సీటర్ ట్రైనర్ జెట్లు ఉండనున్నట్లు రక్షణ శాఖ వెల్లడించింది. ఈ అత్యాధునిక ఫైటర్ జెట్‌లలో ఉత్తమ్ ఏఈఎస్ఏ రాడార్, స్వయం రక్షా కవచ్ వ్యవస్థలతో పాటు కంట్రోల్ యాక్యుయేటర్‌లు ఉంటాయి. వీటిలో 64 శాతానికి పైగా దేశీయ కంటెంట్, 67 దేశీయ ఉత్పత్తులు ఉండనున్నట్లు రక్షణ శాఖ తెలిపింది. 202728 నుండి వీటి సేకరణ ప్రారంభమవుతుందని, తద్వారా వాయుసేన సామర్థ్యాలు పెరగడంతో పాటు ఆత్మనిర్భర్ భారత్, భారత రక్షణ సంసిద్ధతలను మరింత పెంపొందిస్తుందని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ ప్రాజెక్టు రాబోయే ఆరేళ్లలో ఏడాదికి 11,750 ఉద్యోగాలను సృష్టిస్తుందని అంచనా.

## నేను భారత్‌కు పెద్ద అభిమానిని, ఆ దేశమంటే చాలా ఇష్టం

అమెరికా, సెప్టెంబరు 25 : భారత్‌కు తాను పెద్ద అభిమానినని, ఆ దేశమంటే తనకు చాలా ఇష్టమని అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్ రైట్ అన్నారు. ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌తో ఇంధన వాణిజ్యాన్ని మరింతగా పెంచుకోవడానికి ఎదురు చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు. న్యూయార్క్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ అద్భుత మిత్ర దేశమైన భారత్‌తో అమెరికా ఇంధన సహకారాన్ని విస్తరించుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం భారత్ మరో అంశంలో చిక్కుకుందంటూ, రష్యా నుంచి చమురు కొనుగోలును ఉద్దేశించి అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయాల్సిన అవసరం భారత్‌కు లేదని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే తక్కువ ధరకు లభించడం వల్ల ఆ కొనుగోళ్లను కొనసాగిస్తోందని అన్నారు. కానీ చమురు విక్రయాలతో వచ్చిన ఆదాయాన్ని రష్యా యుద్ధానికి వినియోగిస్తోందని ఆయన పేర్కొన్నారు. కాబట్టి అలాంటి దేశంతో వాణిజ్యాన్ని భారత్ ముగించుకుంటే బాగుంటుందని హితవు పలికారు. న్యూఢిల్లీపై పెనాల్టీలు విధించాలని అమెరికా కోరుకోవడం లేదని క్రిస్ రైట్ స్పష్టం చేశారు. కేవలం యుద్ధాన్ని ముగించాలని మాత్రమే చూస్తున్నామని వెల్లడించారు. భారత్ తమ ఇంధన దిగుమతుల గురించి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించుకుంటుందని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. న్యూఢిల్లీతో ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

## తెలంగాణ ఇంటర్ విద్యలో కీలక మార్పులు..

హైదరాబాద్, సెప్టెంబరు 25 (భారత శక్తి) : రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు తెలంగాణ ఇంటర్ బోర్డు శ్రీకారం చుట్టింది. భవిష్యత్ టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా, వచ్చే నవంబర్ నెల నుంచి ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పై తరగతులు ప్రారంభించనున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి ప్రకటించారు. ఆధునిక సాంకేతిక విద్యను పాఠశాల స్థాయి నుంచే అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ సిలబస్‌తో పాటు పరీక్షల విధానంలో కూడా మార్పులు చేయనున్నట్లు బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులపై భారం తగ్గించి, నైపుణ్య ఆధారిత విద్యను ప్రోత్సహించడమే ఈ మార్పుల ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. మరోవైపు, ప్రభుత్వ జూనియర్ కాలేజీల పట్ల విద్యార్థుల ఆదరణ పెరుగుతోందని, గతేడాదితో పోలిస్తే ఈసారి అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అదే సమయంలో కాలేజీల్లో అధ్యాపకుల కొరతను నివారించేందుకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టిందని బోర్డు కార్యదర్శి తెలిపారు. కొత్త పోస్టుల భర్తీకి ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందని, తక్షణ అవసరాల నిమిత్తం త్వరలోనే 494 మంది గెస్ట్ లెక్చరర్లను నియమించనున్నట్లు వెల్లడించారు. ఇక విద్యార్థుల పురోగతి, బోధన నాణ్యత వంటి అంశాలపై తల్లిదండ్రులతో చర్చించేందుకు ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జూనియర్ కాలేజీలలో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా, విద్యార్థులకు ఊరటనిచ్చే అంశంగా ఈ ఏడాది కూడా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో జంబ్లింగ్ విధానాన్ని అమలు చేయడం లేదని బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

## స్మితా సబర్వాల్ పై చర్యలు వద్దు.. హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబరు 25 (భారత శక్తి) : కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసులో ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ కు హైకోర్టు ఊరటనిచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై విచారణ జరిపిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన విషయం విదితమే. ఈ నివేదికలో ఐఏఎస్ స్మితా సబర్వాల్ పేరును కూడా కమిషన్ పేర్కొంది. దీనిపై స్మితా సబర్వాల్ హైకోర్టును ఆశ్రయించారు. నోటీసుల జారీ, వాంగ్మూలం నమోదు చేసిన విధానాన్ని ఆమె న్యాయస్థానంలో సవాల్ చేశారు. కమిషన్ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తనపై తదుపరి చర్యలు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్ ను విచారించిన హైకోర్టు.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా స్మితా సబర్వాల్ పై చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. ఇప్పటికే దాఖలైన పిటిషన్లతో కలిపి దీనిని విచారిస్తామని పేర్కొంది.

## అగ్నిప్రైమ్ ప్రయోగం సక్సెస్.. ఇక రైలు నుంచే శత్రువులకు గురి

ఢిల్లీ, సెప్టెంబరు 25 (భారత శక్తి) : భారత రక్షణ రంగం మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. దేశంలోనే మొట్టమొదటిసారిగా రైలు ఆధారిత మొబైల్ లాంచర్ నుంచి 'అగ్ని ప్రైమ్' మధ్యంతర శ్రేణి క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఈ చారిత్రక ప్రయోగంతో, ఇలాంటి అత్యాధునిక సామర్థ్యం కలిగిన కొన్ని దేశాల సరసన భారత్ సగర్వంగా నిలిచింది. ఈ విషయాన్ని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం అధికారికంగా ప్రకటించారు. ఈ కొత్త తరం క్షిపణి దాదాపు 2,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం ఛేదించగలదని, దీనిలో పలు అత్యాధునిక సాంకేతికతను పొందుపరిచారని ఆయన తెలిపారు. ప్రత్యేకంగా రూపొందించిన ఈ రైలు లాంచర్ వ్యవస్థ ద్వారా క్షిపణిని దేశంలోని రైల్వే నెట్‌వర్క్‌పై ఎక్కడికైనా అత్యంత వేగంగా తరలించవచ్చు. దీనివల్ల శత్రువుల నిఘాకు చిక్కకుండా, చాలా తక్కువ సమయంలో ప్రయోగానికి సిద్ధం చేసేందుకు వీలు కలుగుతుంది. దేశ రక్షణ సామర్థ్యాన్ని ఇది రెట్టింపు చేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ అద్భుత విజయంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనతను సాధించిన రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ), వ్యూహాత్మక బలగాల కమాండ్ (ఎస్ఎఫ్‌సీ) శాస్త్రవేత్తలతో పాటు సాయుధ బలగాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యంలో భాగంగా రక్షణ రంగంలో స్వావలంబన సాధించే దిశగా ఈ ప్రయోగం ఒక కీలక ముందడుగు అని ఆయన అభివర్ణించారు.

## తమిళనాడు ప్రభుత్వ ఆహ్వానం.. చెన్నైకి సీఎం రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

ఈ పర్యటన కోసం సీఎం రేవంత్ రెడ్డి ఈ మధ్యాహ్నం 1 గంటకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో చెన్నైకి బయలుదేరి వెళ్లనున్నారు. సాయంత్రం జరిగే ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని, ప్రసంగిస్తారు. కార్యక్రమం ముగిసిన అనంతరం ఆయన తిరిగి హైదరాబాద్‌కు రానున్నారు. ఈ పర్యటనకు రాజకీయంగానూ ప్రాధాన్యత ఏర్పడింది. బీహార్ రాజధాని పాట్నాలో నిన్న జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆ సమావేశం ముగిసిన మరుసటి రోజే ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న డీఎంకే ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. త్వరలో బీహార్, వచ్చే ఏడాది తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఇండియా కూటమిని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది.

## ఫార్ములా ఈరేసు కేసులో కేటీఆర్‌కు బిగుస్తున్న ఉచ్చు..

హైదరాబాద్, సెప్టెంబరు 25 (భారత శక్తి) :రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైన ఫార్ములా ఈరేసు కేసు వ్యవహారం కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌ను కోరింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి సంబంధిత దస్త్రం రాజ్‌భవన్‌కు చేరినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ ఫైల్‌ను అందుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, దీనిపై న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. వారి సూచనల అనంతరం గవర్నర్ తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అంతకుముందు, ఈ కేసుపై లోతైన దర్యాప్తు చేపట్టిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), కేటీఆర్‌తో పాటు ఇతర నిందితులపై ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది. ఏసీబీ నివేదికను పరిశీలించిన విజిలెన్స్ కమిషనర్ కూడా ఇందుకు పచ్చజెండా ఊపారు. ఈ సిఫార్సుల ఆధారంగానే ప్రభుత్వం ఇప్పుడు గవర్నర్ అనుమతి కోసం ఫైల్‌ను ముందుకు పంపింది.

### ఏసీబీ నివేదికలో కీలక ఆరోపణలు

ఫార్ములా ఈరేసు ఒప్పందం నుంచి నిధుల చెల్లింపుల వరకు అనేక నిబంధనలను ఉల్లంఘించారని ఏసీబీ తన నివేదికలో స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా రెండు విడతల్లో విదేశీ కరెన్సీ రూపంలో డబ్బు చెల్లించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ. 54.88 కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొంది. అప్పటి పురపాలక శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆదేశాల మేరకే ఈ ప్రక్రియ మొత్తం జరిగిందని చెప్పడానికి తమ వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని ఏసీబీ తెలిపినట్లు సమాచారం. ఈ కేసులో కేటీఆర్‌తో పాటు ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఫార్ములా ఈఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థ, ఏస్ నెక్స్ట్‌జెన్ సంస్థ ఎండీలను ఏసీబీ నిందితులుగా చేర్చింది. ఐఏఎస్ అధికారి అయిన అరవింద్ కుమార్‌పై అవినీతి నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. దీంతో, ఆయనపై ప్రాసిక్యూషన్‌కు అనుమతినివ్వాలని కోరుతూ కేంద్ర సిబ్బంది, వ్యవహారాల శాఖకు రాష్ట్రప్రభుత్వం త్వరలో లేఖ రాయనున్నట్లు తెలిసింది. హెచ్ఎండీఏ నిధులను క్యాబినెట్ అనుమతి లేకుండా చెల్లించారంటూ పురపాలకశాఖ కార్యదర్శి దానకిశోర్ ఇచ్చిన ఫిర్యాదుతో గతేడాది ఏసీబీ ఈ కేసు నమోదు చేసిన విషయం విదితమే.



## సీ.ఎం.రిలీఫ్ ఫండ్ తో ఎంతో మంది పేదలకు లబ్ధి : సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, సెప్టెంబర్ 25 (భారత శక్తి): బాధితురాలు నిర్మలకి 2 లక్షల రూపాయల ఎల్.ఓ.సీ అందజేస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ నందు నివాసం ఉండే నిర్మల కీళ్ల నొప్పులకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి యొక్క ఆర్థికస్థితులు బాగలేక వారి కుటుంబసభ్యులు స్థానిక ఎమ్మెల్యేను సంప్రదించారు. వెంటనే స్పందించిన వారు ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేశారు. దానికి గాను వారికి 2,00,000(రెండు లక్షల రూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు అయింది.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుందని అన్నారు.ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం. సహాయనిధి అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో భారాస నాయకులు నిమ్మల శ్రీనివాస్ గౌడ్, సింగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, ప్రతీక్ తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ సంబరాలలో ఆడిపాడిన అధికారులు

ఎల్బీనగర్, సెప్టెంబర్ 25 (భారత శక్తి): జిహెచ్ఎంసి ఎల్బీనగర్ జోనల్ పరిధిలోని హయత్ నగర్ సర్కిల్ 3, ఎల్బీనగర్ సర్కిల్ 4, సరూర్ నగర్ సర్కిల్ 5 లోని మహిళా ఉద్యోగినిలు గురువారం సర్కిల్ కార్యాలయం ఆవరణలో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.3 సర్కిల్ల పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన మహిళలు సైతం సాయంత్రం వరకు సంబరాలలో పాల్గొని పాటలకు లయబద్ధంగా నృత్యాలు చేస్తూ బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసీ డివిజన్ల మహిళా కార్పొరేటర్లు రాధా ధీరజ్ రెడ్డి, సుజాతా నాయక్, చింతల అరుణ యాదవ్ డీసీలు వంశీకృష్ణ, మల్లికార్జున్, శ్రీనివాస్ తదితర అన్నీ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మలకు బహుమతులు ప్రకటించి అందించారు.






# జీ.హెచ్.ఎం.సి. నిర్లక్ష్యం.. ప్రజలకు ప్రాణ సంకటం

**ఆఫీసు ముగిసింది.. తనబిడ్డ అడిగిన బొమ్మ కొన్నాడు.. భార్యకు మల్లెపూలు, స్వీట్ బాక్స్ కొన్నాడు.. అతను ఒక చిరుద్యోగి.. ఎప్పుడెప్పుడు ఇంటికి వెళదామని బైక్ స్టార్ట్ చేసి ఇంటికి బయలుదేరాడు.. కానీ ఊహించని ఉపద్రవం ముంచుకొచ్చింది.. క్షణాల్లో ఆకాశం మేఘావృత్తమై పోయింది.. నిమిషాల్లో భారీ వర్షం కమ్ముకుంది.. ఏదో ఆలోచిస్తూ వెళ్తున్న అతని బైక్ వర్షం వరదల్లో చిక్కుకుంది.. నడిరోడ్డుపై తెరచివున్న డ్రైనేజ్ మ్యాన్ హోల్ లో అతని బండి పడిపోయింది.. కూతురుకు కొన్న బొమ్మ, భార్యకు కొన్న మల్లెపూలు నీళ్లలో తేలిపోసాగాయి.. అతని ప్రాణం గాల్లో భారీ వర్షంలో కలిసిపోయాయి.. ఇది ఒక్కరి కథ కాదు.. ఈరోజు హైదరాబాద్ నగరంలో అడుగడుగునా ఎదురవుతున్న అమాయకుల కథలు, ఎన్నో కుటుంబాల్లో మిగులుతున్న వ్యధాలు.. దీనికి కారణం ఏమిటి..? ఒక్క చిన్న వర్షా నికే మునిగిపోతున్న నగరం మాటేమిటి..? ఈ దుస్థితికి కారణం ఎవరు..? నాలాలను సైతం వదలకుండా కబ్జాలు చేస్తున్న అక్రమార్కులు.. వారికి సహకరిస్తున్న జీ.హెచ్.ఎం.సి. సిబ్బంది.. పట్టించుకోని ప్రభుత్వాలు.. నిమ్మకుండిపోతున్న రక్షణ వ్యవస్థ.. వీటన్నిటి మధ్య అమాయకుల జీవితాలు నలిగిపోతున్నాయి.. పేరుకే విశ్వనగరం.. చూస్తే అంతా డొల్ల.. అవినీతి కంపు.. ఈ పరిస్థితుల్లో మార్పు అనేది సాధ్యం అవుతుందా..? నగర జీవనం సరైన దారికి వస్తుందా..? ఇవన్నీ జవాబులేని ప్రశ్నలే..**




**(స్పెషల్ కరస్పాండెంట్)**

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (భారత శక్తి) : భారీ వర్షాలు, హైదరాబాద్ లో వరదలు.. ప్రభుత్వ నిర్లక్ష్యం.. నాలాలు కబ్జాలు, అధికారుల అవినీతి.. బాధ్యత ఎవరిది? మరోసారి భారీ వర్షాలతో నగరం తడిసి ముద్దయ్యింది. కొద్ది గంటల వానకే రోడ్లన్నీ నదులుగా మారిపోయాయి. పలు ప్రాంతాల్లో అమాయకులైన ప్రజలు తమ ఇళ్లలో బందీల్లా మారిపోయారు. ఈ దృశ్యాలు కొత్తవేమీ కాదు. ప్రతి వర్షాకాలం ఇదే కథ. అసలెప్పుడు మనం జీవించే హక్కును.. సురక్షితమైన నగరంలో ఉంటున్నాం అనే కలను నిజం చేసుకోగలుగుతాం..?

*** నాలాల పై కబ్జాలు.. శూన్యంగా మారిన అభివృద్ధి :**

హైదరాబాద్ కు జీవనాడులుగా ఉండే నాలాలు ఎన్నో సంవత్సరాలుగా అడ్డదారుల్లో కబ్జాకు గురవుతున్నాయి. వీటిపై అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. అధికారుల సహకారంతోనే ఈ భూకబ్జాలు జరుగుతున్నాయన్నది వాస్తవం.. బహిరంగంగా కనిపిస్తున్న నిజం.. తెరవెనుక ఏమేమి జరుగుతున్నాయో..? అందరికీ తెలిసిపోతోంది.. జీ.హెచ్.ఎం.సి. అధికారులు, స్థానిక నాయకులు కలిసి చేస్తున్న దుర్మార్గం.. నగర అభివృద్ధిని ప్రైవేట్ లాభాల కోసం వీరందరూ తాకట్టు పెట్టారు.

*** ఒక్క వానకే సిటీ స్థంభించిపోతోంది.. ఎందుకు ఈ దైన్యమైన పరిస్థితి ? :**

ఇతర మెట్రో నగరాల్లో గంటల కొద్దీ వాన కురిసినా పెద్దగా ఎలాంటి సమస్యలు ఎదురవ్వడం లేదు.. అక్కడ ప్రజల జీవనానికి ఎలాంటి ఆటంకాలు కలగడం లేదు.. కానీ హైదరాబాద్ లో మాత్రం వరుణుడు కొంచెం సీరియస్ అయినా, ట్రాఫిక్ కష్టాలు, ఇంటింటిలోకి నీరు, ఎక్కడికక్కడ గుంతలు.. వెరసి ఇవన్నీ ప్రజలకు నిత్య నరకంగా మారుతున్నాయి. ఈ పరిస్థితికి కారణం స్టార్మ్ వాటర్ డ్రైన్స్ మెయింటనెన్స్ లో ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్యం. పాత నాలాలను శుభ్రం చేయకుండా వదిలేయడం, కొత్తగా నిర్మించినవి సరైన ప్రమాణాల ప్రకారం కాకుండా నిర్మించడమే ఇందుకు సిసలైన కారణంగా తెలుస్తోంది..

*** కామెడీ కథలుగా మారిపోతున్న జీ.హెచ్.ఎం.సి. హామీలు :**

ప్రతి సంవత్సరం వర్షాల ముందే జీ.హెచ్.ఎం.సి., వాటర్‌బోర్డ్, రెవెన్యూ శాఖలు కలసి 'మేము సిద్ధం' అని పత్రికల ముందుకు వస్తాయి. ఇప్పుడు వీటికి హైడ్రా కూడా తోడయ్యింది.. కానీ నిజానికి సిద్ధంగా ఉండేది కేవలం ప్రజలు వారి అవసరాలు మాత్రమే. అధికారుల మాటలు, వాస్తవరూపంలోకి వచ్చేసరికి తేలిపోతున్నాయి.. కేవలం మాటలవరకే మిగిలిపోతున్నాయి.. ప్రకటనలకిసం లక్షలు, కోట్లు ఖర్చుబెట్టడం, వాటినుంచి కమీషన్లు తీసుకోవడం తప్ప ఒరిగేది ఏమీ లేదు.. చివరికి సామాన్యులే బలైపోతున్నారు.. నాణ్యమైన మౌలిక వసతులపై ఖర్చు పెట్టాల్సిన బడ్జెట్ అక్రమార్కులైన అధికారులు, రాజకీయ గద్దలా జేబుల్లోకి వెళ్లిపోతున్నాయి..

ప్రజలు ప్రశ్నించాల్సిన సమయం వచ్చింది అని విశ్లేషకులు చెబుతున్నా.. ప్రజలెప్పుడూ ప్రశ్నిస్తూనే ఉన్నారు.. కానీ వారికి సరైన జవాబు చెప్పే నాథుడు మాత్రం టార్చిలైట్ పెట్టి వెదికినా కనిపించడం లేదు.. ప్రతి సంవత్సరం అదే దారుణ పరిస్థితి, అదే తీరని బాధ, అదే బాధ్యతారాహిత్యం.. చూస్తూ మౌనంగా ఉండలేక.. కొందరు బాధ్యతగా ఈ సమస్యలపై ప్రశ్నిస్తున్నారు.. కొందరు పాత్రికేయులు కూడా తమ కలాలకు పనిచెబుతున్నారు.. కానీ వీరిని ఎవరు పట్టించుకుంటున్నారు.. ఇంకా గట్టిగా ప్రశ్నిస్తే, ఇంకా ఘాటుగా వార్తలు రాసి వెలుగులోకి తీసుకుని వస్తే.. కేసులు, జైళ్లు, వేధింపులు, బెదిరింపులు, ఇంకా ఎక్కువ మాట్లాడితే ప్రాణాలు సైతం తీస్తున్నారు.. నాలాలపై కబ్జాలు ఎవరెవరు చేశారో స్పష్టంగా తెలుసుకునే ప్రయత్నం చేద్దామంటే అధికారులు స్పందించడం లేదు.. ఫిర్యాదులు బుట్టదాఖలు అవుతున్నాయి.. అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరితే.. తిరిగి మనలని ప్రశ్నిస్తున్న దుర్మార్గం అడుగడుగునా నెలకొంది.. క్రిందిస్థాయి ఉద్యోగి నుంచి కమిషనర్ వరకు జీ.హెచ్.ఎం.సి.లో అవినీతిలో కూరుకుని పోయారు..



వాస్తవానికి వాళ్ళు గ్రహించాల్సిన నిజం ఒకటి ఉంది .. ఎంత కాదనుకున్నా.. ఎంతగా అక్రమ సంపాదన వెనుకేసుకొస్తున్నా వారు కూడా ఈ నగరంలో ప్రజల్లో భాగమే.. ఏదో ఒకరోజు వారికి, వారి సన్నిహితులకు, వారి కుటుంబసభ్యులకు కూడా ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతాయి.. అప్పుడు వారు ఎవరికీ చెప్పుకుంటారు..? వారు సంపాదించిన అక్రమ ధనం వారిని కాపాడుతుందా..? ఇది ఆలోచించాలి..

కొందరు మేధావులు, విశ్లేషకులు కొన్ని సూచనలు చేస్తున్నారు.. ఏమిటంటే ప్రతి నాలా పైన జీ.పీ.ఎస్. మాప్ తో కూడిన డిజిటల్ రికార్డ్ అందుబాటులో ఉంచాలి.. అప్పుడే కబ్జాలు ఆగుతాయి.. కానీ అవినీతికి అలవాటుపడ్డ అధికారులు వున్నంత కాలం ఇది సాధ్యం కాదనే అభిప్రాయలు కూడా వ్యక్తం అవుతున్నాయి.. చివరగా అభివృద్ధి అంటే సిమెంట్ రోడ్‌లు కాదు, సురక్షిత జీవనానికి బాటలు వేయడం..

హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందాలంటే మౌలిక వసతులు ప్రాధాన్యతగా మారాలి. నాలాలు, డ్రైనేజ్ వ్యవస్థ, వర్షం నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం కళ్లుతెరిస్తే మంచిది. లేకపోతే ఎప్పుడు వర్షం వచ్చినా ఇవే పరిస్థితులు ఎదురవుతాయి.. వర్షంతో పాటు నగర ప్రజల కన్నీళ్లు కూడా కురుస్తాయి..




# హైడ్రా పనితీరు బతుకమ్మ కుంట నిదర్శనం..

*** జాతీయ స్థాయిలో బతుకమ్మ కుంట వైభవం**
*** ఈ నెల 26న సీఎం చేతులమీదుగా ప్రారంభం**
*** బతుకమ్మ ఉత్సవాలకు సర్వం సన్నద్ధం**
*** సర్వాంగ సుందరంగా మారిన బతుకమ్మ కుంట**

హైదరాబాద్, సెప్టెంబరు 25 (భారత శక్తి) : బతుకమ్మకుంట తన పేరును సార్ధకం చేసుకుంది. కబ్జాల కోరల్లో చిక్కుకున్న చెరువు నేడు జీవం పోసుకుంది. ముళ్ల పొదలు.. పిచ్చి మొక్కలతో అటువైపు చూడాలంటేనే భయపడే విధంగా ఉన్న బతుకమ్మకుంట..నేడు జలకళతో చూడముచ్చటగా తయారయ్యింది. కబ్జాల చెరను విడిపించుకుని కనువిందు చేస్తోంది. ఆక్రమణల నుంచి బయట పడి ఆహ్లాదంగా మారింది. ఇలా జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంది. ఇదంతా హైడ్రా చొరవతోనే సాధ్యమైందని అక్కడి నివాసితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సర్వాంగ సుందరంగా మారిన చెరువును చూసి ఇది కలా.. నిజమా అని సంబర పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ దృఢ సంకల్పానికి, హైడ్రా పని తీరుకు బతుకమ్మ కుంట నిదర్శనమంటున్నారు. ఈ నెల 26న బతుకమ్మ కుంట ప్రారంభోత్సవానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కి బతుకమ్మలతో ఘన స్వాగతం చెప్పేందుకు అక్కడి నివాసితులు సిద్ధమయ్యారు.

*** హైడ్రాకు ప్రేరణగా నిలిచిన బతుకమ్మకుంట..**

జలకళతో.. జీవ వైవిధ్యంతో.. చక్కటి పర్యావరణంతో ఆరోగ్యవంతమైన జీవనం సాగించేలా ఈ నగరాన్ని తీర్చి దిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికై ఎలా ముందుకు వెళ్లాలి అని ఆలోచించే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కి తట్టిన ఆలోచనే హైడ్రా. జులై 19వ తేదీ 2024లో హైడ్రా ఆవిర్భవించింది. ఆరంభం నుంచే తన మార్కును చాటుతూ.. నగర భవిష్యత్తుకు బాటలు వేస్తున్న హైడ్రాకు బతుకమ్మ కుంట ప్రేరణగా నిలిచింది. వరద నివారణకు బతుకమ్మకుంట బాటలు వేసింది. నగరవ్యాప్తంగా చెరువులు అభివృద్ధి చెందితే వరదలు చాలావరకు నివారించవచ్చునని బతుకమ్మకుంట నిరూపించిందని హైడ్రా కమిషనర్ ఏ.వీ రంగనాథ్ తెలిపారు. వర్షం పడితే బతుకమ్మకుంట పరిసరాలు నీట మునిగేవి. ఈ వర్షాకాలంలో బతుకమ్మకుంటలోకి వరద నీరు చేరడంతో ముంపు సమస్య తప్పింది. కేవలం 5 నెలల్లో బతుకమ్మకుంటను రూపొందించమని చెప్పారు. ఒకప్పటి ఎర్రకుంటనే.. కాలక్రమంలో బతుకమ్మ కుంటగా మారిందని స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ రికార్డులు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి. కాలక్రమంలో బతుకమ్మకుంటలో చెత్త, నిర్మాణ వ్యర్థాలు పోయడంతో చెరువు ఆనవాళ్లు కోల్పోయిందన్నారు.





*** వివాదాలనుంచి బయటపడి..**

నిర్మాణ వ్యర్థాలతో చెరువును పూడ్చేసి..ఈ చెరువ8ఉ ఆనవాళ్లు లేకుండా కబ్జా రాయుళ్లు ఆక్మించేశారు. ఆ భూమికి సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకుండా కేవలం అన్ రిజిస్టర్డ్ అగ్రిమెంట్‌తో యెడ్ల సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి దశాబ్దాలుగా పోరాడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బతుకమ్మకుంటను హైడ్రా చేపట్టింది. రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీతో కలిసి చెరువు చరిత్రను తవ్వి తీసింది. అన్ని విభాగాలతో కలిసి అనేక సమావేశాలు ఏర్పాటు చేసి బతుకమ్మ కుంట చెరువే అని నిర్ధారించుకుంది. బతుకమ్మ కుంట పునరుద్ధరణ ప్రక్రియలో హైడ్రా అనేక న్యాయపరమైన సమస్యలు ఎదుర్కొంది, ముఖ్యంగా భూ కబ్జాదారులైన సయ్యద్ ఆజం, సయ్యద్ జహాంగీర్ మరియు ఏ. సుధాకర్ రెడ్డి లాంటి వారిచే వేసిన పిటిషన్లపై కోర్టులు పదేపదే ఇది చెరువు భూమియేనని స్పష్టం చేశాయి.

*** బతుకమ్మ కుంట బతికే ఉందని రుజువైంది..**

మండు వేసవిలో దాదాపు రూ. 7.15 కోట్లతో బతుకమ్మ కుంట పనులను హైడ్రా చేపట్టింది. జేసీబీలతో మోకాలు లోతు తవ్వగానే గంగమ్మ తల్లి ఉబికి వచ్చింది. బతుకమ్మ కుంట బతికే ఉందని రుజువు చేసింది. అక్కడి స్థానికులలో ఆనందం పెల్లుబికింది. బతుకమ్మ కుంట కాదు.. ఇది మా స్థలమంటూ ఇప్పటివరకూ నమ్మబలికిన వారిని ఇప్పుడేమంటారు అని అక్కడి స్థానికులు ప్రశ్నించారు. ఈ మేరకు అక్కడి ముళ్ల పొదలను తొలగించి... తవ్వకాలు చేపట్టిన హైడ్రాకు గంగమ్మ స్వాగతం పలికింది. అంబర్‌పేట మండలం, బాగ్అంబర్‌పేట్‌లోని సర్వే నంబరు 563లో 1962 63 లెక్కల ప్రకారం మొత్తం 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మ కుంట. బఫర్ జోన్‌తో కలిపి మొత్తం వైశాల్యం 16.13 ఎకరాల విస్తీర్ణం అని తేల్చిన సర్వే అధికారులు. తాజా సర్వే ప్రకారం అక్కడ మిగిలిన భూమి కేవలం 5.15 ఎకరాల విస్తీర్ణం మాత్రమే మిగిలి ఉంది. ప్రస్తుతం మిగిలి ఉన్న 5.15 ఎకరాల విస్తీర్ణంలోనే బతుకమ్మ కుంటను పునరుద్ధరించింది.







*** సర్వాంగ సుందరంగా..**

బతుకమ్మకుంట ఇప్పుడు పిక్నిక్ స్పాట్‌గా మారింది. చెరువు అభివృద్ధిని దగ్గరగా పరిశీలించిన స్థానికులు సాయంత్రం అయితే చాలు అక్కడకు చేరుకుని సేదదీరుతున్నారు. బతుకమ్మ కుంట చుట్టూ ఎన్నో ఆకర్షణలు వచ్చాయి. పిల్లల ప్లే ఏరియా అందుబాటులోకి వచ్చింది. వయసు మళ్లిన వారు అక్కడ కూర్చొని సేద దీరేందుకు గుమ్మటాలు ఏర్పాటు చేశారు. చుట్టూ నడక దారి ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. చెరువులో వరద నీరు వచ్చి చేరడంతో నిండు కుండను తలపిస్తోంది. చెరువులో బోటు షికారు ఏర్పాటు చేశారు. ఇలా అభివృద్ధి చేసిన చెరువును ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డిగారు నగర ప్రజలకు ఈ నెల 26న అంకితం ఇవ్వనున్నారు. బతుకమ్మ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడే నిర్వహించాలని నిర్ణయించింది.

*** అభినందనలు తెలిపిన స్థానికులు..**

హైడ్రాను తీసుకువచ్చిన ప్రభుత్వానికి స్థానికులు అభినందనలు తెలిపారు. హైడ్రాతోనే ఇది సాధ్యమైందని అంటున్నారు. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారితో పాటు.. హైడ్రా అధికారులు, సిబ్బంది ఎంతో దీక్షతో ఈ చెరువును అభివృద్ధి చేశారు. హైడ్రా దీక్షా దక్షతకు ఇది నిదర్శనం. ముళ్ల పొదలతో భయంకరంగా కనిపించే ఈ పరిసరాలు.. ఇప్పుడు ఆహ్లాదంగా మారాయి. తమ ఇళ్లకు డిమాండ్ వచ్చింది. ఈ పరిసరాలకు కొత్త అందాలు వచ్చాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.